

ఫిబ్రవరి 2021
రు. 20/-

సంకల్ప బలం

సామాజిక విలువల మాసపత్రిక




బడ్జెట్ సమర్పిస్తున్న
ఆర్థిక మంత్రి


ప్రపంచం అంతా విస్తుపోయి చూసిన
కేపిటల్ హిల్ ఘటన




వ్యవస్థాపక సంపాదకురాలు

**తీగవరపు శాంతి**

# చైతన్యం

సంకల్ప బలం

**సామాజిక విలువల మాస పత్రిక**

సంపుటి -10 ఫిబ్రవరి 2021 సంచిక - 5


## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అభిప్రాయ వేదిక | 5 |
| వైద్యో నారాయణో హరి: | 6 |
| యూనియన్ బడ్జెట్ | 7 |
| వెన్నెలకంటి పాటైనా మాటైనా... | 9 |
| తుంపిలి దెయ్యం | 12 |
| పరిహారం | 15 |
| వేదులాన్వయు పలుకు | 20 |
| పూరీ జగన్నాధస్వామి వైభవం | 21 |
| సప్త మోక్ష నగరాలు | 23 |
| గాలిపటాలు | 27 |
| 116 కందాల్లో సుందరకాండ | 28 |
| గ్రీసు దేశపు పురాణ గాథలు | 31 |
| ప్రేమంటే ఇంతే | 35 |
| సినిమా | 36 |
| మహాభారతంలో మహోన్నతమైన వ్యక్తి | 37 |
| నాన్న | 40 |
| నవవిధ భక్తులు | 41 |
| మా ఊరి నందుల కథ | 43 |
| భాగవతులతో అనుబంధం | 44 |
| గడి - నుడి | 45 |
| ఎలగందుల మట్టిలోని మాణిక్యం | 46 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

## జో బైడెన్ : అమెరికా అధ్యక్షుడు

అమెరికా అధ్యక్షుని ఎన్నిక ఎలక్టోరల్ కాలేజీ నుండి ఎన్నుకున్న 538 మంది అధికారులు (ఎలక్టోరల్స్) సమక్షంలో చేయాల్సి ఉంటుంది. అది ఎవరు ఎన్నికల్లో గెలిచారనేది అధికారికంగా నిర్ణయిస్తుంది. వారు డిశంబర్ 14 న ఓటు వేసేందుకు తమ రాష్ట్ర రాజధానుల్లో సమావే-శమవుతారు. ఎలక్టార్స్ ఓట్లు సాధారణంగా రాష్ట్రంలోని మెజారిటీ ఓట్లను ప్రతిబింబిస్తాయి. అయితే అది అధికారికంగా అవసరం కాదు. క్యాబినెట్ మంత్రులను నియమించడానికి, ప్రణాళికలు రూపొందించడానికి తగిన సమయం ఇచ్చిన తరువాత కొత్త అధ్యక్షుడు జనవరి 20న అధికారికంగా ప్రమాణస్వీకారం చేస్తారు. ఆ విధంగా అమెరికా అధ్యక్షునిగా 2021 జనవరి 20న జో బైడెన్ అధికారికంగా ప్రమాణస్వీ-కారం చేశారు. వైస్ ప్రెసిడెంట్ గా ఇండియన్ అమెరికన్ అయిన కమలా హారిస్ ప్రమాణస్వీకారం చేశారు. 20,000 ల మంది సెక్యూరిటీలతో సింపుల్ గా అధ్యక్ష ఉపాధ్యక్ష ప్రమాణస్వీకారాలు జరిగాయి. భారతీయులు ఎంతో మంది బైడెన్ ప్రెసిడెంట్ అయితే మనకి అనుకూలంగా గ్రీన్ కార్డులు, H1 వీసాలు వస్తాయని ఎదురు చూస్తున్నారు.

ఎన్నికలు వస్తున్నాయి అంటే చాలు దాడులు మొదలు. ఘర్షణ వాతావరణం లేకుండా ఎన్నికలు జరగవు. ఒకరి ఇంటిపైన ఒకరు దాడులు చేసుకుంటూ, ఘర్షణలతో, కొట్లాటలతో ఇంకా చెప్పాలంటే హింసలతో ఎన్నికలు జరుగుతాయి .ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు భయకంపితులవుతున్నారు. ప్రస్తుతం పంచాయితీ ఎన్నికల నామినేషన్ ముగించేసరికే ఎన్నో ఘర్షణలు జరిగాయి. ముందు ముందు ఎలా ఉంటుందో ?

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా మూడోసారి2021---22 లో ఆర్థిక బడ్జెట్ పార్లమెంట్లో ప్రవేశపెట్టారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రసంగించారు. కరోనా పోరాటంలో ఉద్యోగులంతా అండగా నిలిచారని, ఎంపీలు, ఎంఎల్ ఏ లు తమ జీతాలను విరాళంగా ఇచ్చారని, కరోనా నివారణకు రెండు వ్యాక్సిన్లు వచ్చాయని మరికొన్ని త్వరలో రాబోతున్నాయని, కరోనా తరువాత ప్రపంచం మారుతోంద-ని అన్నారు. డిజిటల్ పద్దతిలో బడ్జెట్ ప్రవేశపెట్టారు నిర్మలాసీతారామన్, కరోనా కట్టడిలో దేశానికి దిక్సూచిగా నిలిచామని అన్నారు. లాక్ డౌన్ లేకుంటే భారత్ భారీ నష్టాన్ని చవి చూడవలసి వచ్చేదని అన్నారు. ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతను ఇచ్చామని, నేషన్ ఫస్టులో రైతుల ఆదాయం రెట్టింపు చేశామని 15 యాథావసర ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశామని 35 వేలకోట్లు కరోనా వ్యాక్సిన్ కోసం కేటాయించామని, ఈ విధంగా బడ్జెట్ ను ప్రసంగించి బడ్జెట్ను ప్రవేశపెట్టారు ఆర్థిక వ్యవస్థ అనేక రంగాలకు తీవ్ర నష్టానికి గురి చేసింది. బడ్జెట్ ఫోకస్ అంతా ఇన్ఫ్రా స్ట్రక్చర్ పైనే ఉంది అని ప్రజల అభిప్రాయం. బడ్జెట్ ముఖ్యంగా 6 అంశాలను చెప్పవచ్చు. తెలంగాణలో స్కూళ్లు తెరుచుకున్నాయి. ఏపీకి బడ్జెట్ లో టోపీ పెట్టారని , సామాన్యులకు అధికంగా ధరలు పెరిగేటట్టుగా బడ్జెట్ ఉందని అనుభవజ్ఞుల అభిప్రాయం.

కరోనా వల్ల 11 నెలలుగా స్కూళ్లు, కాలేజీలు, సినిమా హాళ్లు అన్నీ ఒక్కొక్కటిగా తెరుచుకుంటున్నాయి. అలా అని కరోనా పూర్తిగా మనల్ని వదిలి వెళ్ళింది అనడానికి కూడా లేదు. ఇంకా కొత్త వైరస్ లు వస్తున్నాయి. అందుకే వ్యాక్సిన్ ఇచ్చినంత మేరకు అందరూ తీసుకుంటూనే కరోనా ని-బంధనలు పాటించాలి తప్పనిసరిగా అని ప్రభుత్వం నియమం పెట్టింది. స్కూల్స్ లో కరోనా నిబంధనలు పాటించడం లో భాగంగా విద్యార్థులు బెంచికి ఇద్దరు మాత్రమే కూర్చోవాలని నిర్ణయించారు.

భారతీయ క్రికెట్ ప్లేయర్స్ కరోనా సమయంలో కూడా ఆడి, ఆస్ట్రేలియా మీద విజయం సాధించడం భారతీయులకు ఎంతో గర్వ కారణం.. వయస్సులో పెద్దవారు మాత్రమే గెలవగలరు అనే నినాదాన్ని పక్కన పెట్టి, వయస్సులో చిన్న వారైనా ఆస్ట్రేలియా మీద యుద్ధంలా ఆడి, గెలిచి భారత దేశానికే గర్వ కారకులయ్యారు. ప్రపంచంలోని ప్రజలంతా రాత్రి పగలూ తేడా లేకుండా టీవీలకే అతుక్కుపోయి భారతీ-యుల విజయానికి భారత దేశ ప్రధాని మోడీ తో సహా ప్రజలంతా క్రికెట్ టీమ్ ను అభినందనలతో ముంచెత్తారు.

తీగవరపు శాంతి

# అభిప్రాయవేదిక

1.వైద్యో నారాయణో హరి అంటూ డా. కల్పలత గారితో డా. స్రవంతి, కరోనా గురించి చేసిన ఇంటర్వ్యూ అత్యద్భుతం, డా. స్రవంతి కల్పలత గారిని ఇంటర్వ్యూ చేసిన తీరు, ఆ డాక్టరుగారు కూడా విజ్ఞానవంతమైన విషయాలు చెప్పడమే కాక ఎన్నెన్నో విషయాలు తేటతెల్లమైన తెలుగులో వివరించారు. డా. కల్పలతాగారు భారతావని ముద్దుబిడ్డ అని, దేశానికి సేవ చేయడం ప్రశంసనీయమని వైరస్ చాలా చూసినా ఆమె వేక్సిన్ తీసుకోవడం నిజంగా గర్వకారణం అంటూ వందలమంది వారి వారి అభిప్రాయాలు తెలియ జేశారు..ప్రతీ ఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలియ జేయమన్నారు.

**ఢిల్లీ నుండి శ్రీ రామ కృష్ణ రావు , శ్రీమతి విజయ , బొంబాయి శ్రీ మంగళంపల్లి లక్ష్మీనరసింహమూర్తి, కెనెక్టికట్ నుండి శ్రీమతి సుందరవల్లి శ్రీదేవి, మిల్వాకీ నుండి శ్రీమతి జయశ్రీ, హైదరాబాదు నుండి శ్రీమతి పద్మజ వెల్లి, హ్యూస్టన్ నుండి శ్రీ కేశవరావు, శ్రీమతి సరస్వతి తెలియ జేశారు.**

2. టైటిల్ పేజీలు కూడా చాలా బాగా తీసుకువస్తున్నారు. ఇదీ ఓ సమస్యే అంటూ ఎలక్ట్రాన్ గారు సమాజంలో ఉన్న సమస్యలను తీసుకుని పరిష్కారమార్గాలతో కథల రూపంలో అత్యద్భుతంగా వ్రాస్తున్నారు. వేదులాన్వయ పలుకులు ఉపయోగంగాను, హాస్యాస్పదంగాను కూడా ఉంటున్నాయి. కొవ్వుతో మొదలు పెట్టి, అత్తా కోడళ్లవరకు వీలైన వారి పధ్యాలు బావుంటున్నాయి.

**శ్రీమతి సరళ, శ్రీ రాఘవేంద్ర రావు ---గుంటూరు**

3. పూరి జగన్నాథ వైభవం గురించి శ్రీ పోచినపెద్ది వెంకట మురళీ కృష్ణ గారు ఎంతో అత్యద్భుతంగా వ్రాస్తున్నారు. ఇంతవరకు ఇవన్నీ మాకు తెలియవు. శ్రీ కొత్త రామానందం నేటి హరిద్వార్ గురించి సప్త మోక్ష నగరాలలో భాగంగా మమ్మల్ని తీర్థ యాత్ర చేయిస్తున్నంత గొప్పగా వ్రాస్తున్నారు.

**శ్రీమతి శైలజ, శ్రీమతి వాగ్దేవి --- రామంతపూర్**

4. 2020వ సంవత్సరంలో ప్రజలు పడిన బాధలు, ముఖ్యంగా కరోనా సమయంలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అనేక విషయాల గురించి బాగా వ్రాసారు శ్రీమతి భారతిగారు. పాలేపు బుచ్చిరాజు గారు సుందరకాండ పద్యం తాత్పర్యంతో సహా చాలా బాగా అందిస్తున్నారు.

**శ్రీమతి లత, శ్రీ కరుణాకర్ -మండపేట.**

5. జూన్ జన్మ వృత్తాన్తమ్ గురించి చాలా బాగా వ్రాసారు. తల్లి నెమోసిన్ జ్ఞాపకశక్తికి అధిపతి అంటూ బాగా వివరించారు వేమూరి వెంకటేశ్వరరావు గారు. కృష్ణమోహన్ , సత్యభామ రుక్మిణీ పాత్రలు జీవం పోసినట్లు బాగా వ్రాసారు శ్రీ వేంకట సుబ్బారావు గారు .

**శ్రీ సుదర్శనరావు , శ్రీమతి సుమ, -కరీంనగర్.**

6. భయం అనే కథను పాలకుర్తి రామారావు గారు ఎంతో అత్యద్భుతంగా వ్రాసారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మా తాతమ్మ చెప్పిన కథ అంటూ బాగా వ్రాసారు. పోడూరి శ్రీనివాసరావుగారు షావుకారు జానకి గురించి ఎంతో ఇంట్రెస్ట్ కలిగిస్తూ తెలియనివి ఎన్నో చెప్పారు ఆవిడ గురించి .

**శ్రీమతి మాలతి, శ్రీమతి రాధ ----ఒంగోలు**

7. ఆదూరి హైమావతిగారు వ్రాస్తున్న నవవిధభక్తులు లో భాగంగా జనవరి నెలలో వ్రాసిన కీర్తన గురించి బామ్మ ద్వారా తెలియజేయడం చాలా బావుంది. మా ఊరి నందుల కథలో బీగం వృత్తి, ప్రవృత్తిగురించి చాలా బాగా చెప్పారు. భాగవతులతో అనుబంధం అంటూ భాగవతుల గురించి ఈ రోజుల్లో ఎవరికీ తెలియనివి తెలియజేసారు, బాగా వ్రాసారు.

**శ్రీమతి అన్నపూర్ణ , శ్రీ రామమూర్తి ---- కొవ్వూరు**

8.చాగంటి కృష్ణకుమారి గారు అందిస్తున్న పజిల్ చూస్తున్నాము. బావుంటోంది. డా. వడ్డేపల్లి కృష్ణ గారి గురించి చదువుతుంటే నిండు కుండ తొణకదు అన్నట్లుగా వారిలో ఉన్న భావపరంపర తో అత్యద్భుతంగా గేయాల రూపంలోనూ, గీతాల రూపంలోనూ, గేయ నాటికల రూపంలోనూ వారు వ్రాయడం నిజంగా మన అదృష్టం .

**శ్రీమతి శ్రీలత, శ్రీమతి శివకుమారి, -కొత్తూరు.**


# వైద్యో నారాయణో హరి:

## 2 వ భాగం

'వైద్యో నారాయణో హరి:' శీర్షిక క్రింద గత నెల కోవిడ్ వ్యాధిపై డా, కల్పలత గారితో డా. స్రవంతి నిర్వహించిన ముఖాముఖిని ప్రచురించాం. ఈ నెల మూత్రపిండ వ్యాధులు మరియు మూత్రపిండ మార్పిడి పై డా. భమిడిపాటి మూర్తి గారితో డా.స్రవంతి జరిపిన ముఖాముఖిని ప్రచురిస్తున్నాం. పక్క నున్న వీడియో ఐకాన్ పై క్లిక్ చేసి ముఖాముఖిని చూడవచ్చును. - ఎడిటర్

“Organ transplantation” అవయవాల మార్పిడి - ఈ ప్రక్రియ ఇప్పటిది కాదు, ఎన్నో దశాబ్దాల క్రితం 2nd century BC లో మన భారత దేశం లోనే ప్రముఖ శస్త్రవైద్యుడైన శుశ్రుత మొట్టమొదట ప్రారంభించారు. అయిన rhinoplasty, ముక్కుకి సంభందించిన సర్జరీ లో skin graft ఉపయోగించినట్టు కథనాలు ఉన్నాయి. అక్కడ మొదలు 18th మరియు 19th century లో రకరకాల organ transplants చెయ్యడానికి ప్రయత్నాలు జరిగాయి. 1954 లో America లోని Boston Hospital లో మొదటి సారిగా kidney transplant విజయవంతంగా నిర్వహించారు.





ఇప్పుడు ప్రతి ఏటా సుమారు పది లక్షలకు పైగా kidney transplants ప్రపంచమంతటా చేస్తున్నారు, మిగితా అవయవాల తో పోలిస్తే కిడ్నీ ట్రాన్స్ప్లాంట్ అన్నిటికంటే చక్కగా విజయవంతగా చేయబడుతోంది అని చెప్పచ్చు.

ఇవ్వాళ మనతో వారి అనుభూతులని పంచుకోవడానికి మన ముందుకు వచ్చారు. Kidney Transplant Nephrologist Dr.Bhamidipati Murthy గారు.

Dr.Murthy garu ఢిల్లీ లోని Maulana Azad Medical కాలేజీ లో MBBS మరియు PGI Chandigarh లో post గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న తర్వాత New England మరియు Cleveland Clinic లో advanced training పొందారు. వారు Houston లోని Baylor College అఫ్ Medicine లో Associate Professor of Nephrology గా పని చేస్తున్నారు. వారు ఎన్నో scientific papers మరియు books publish చేశారు.

# యూనియన్ బడ్జెట్

దేశ చరిత్రలో మొదటిసారి ఆర్థిక-మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ సోమవారం పేపర్ లెస్ బడ్జెట్ (ఈ-బడ్జెట్) ను పార్లమెంట్ లో సోమవారం ది. 1 ఫిబ్రవరి 2021 రోజున ప్రవేశ-పెట్టారు. గత బడ్జెయ్ ప్రసంగాలకు భిన్నంగా ఈసారి లోక్ సభలో రెండో వరసలో నిలబడి 110 నిముషాలపా-టు ప్రసంగించారు.

బడ్జెట్ హైలైట్స్

కరోనా వైరస్ మహమ్మారితో కుదేల-వుతున్న దేశ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టడమే లక్ష్యంగా కేంద్ర ఆర్థికమంత్రి, దేశాభివృద్ధికి మూల స్తంభాలుగా ఉన్న ఆరు రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్ ప్రతిపాదిం-చారు. దేశాభివృద్ధికి మూలస్థంభా-లైన ఆరోగ్యం, ఆర్థిక సంస్కరణలు, ఉద్యోగ కల్పనా, మూలధనం, మౌలిక సదుపాయాల కల్పనలకు పెద్ద పీట వేశారు. మొత్తం రు. 34,83,236 కోట్ల అంచనా వ్యయంతో బజెట్ ప్రతిపా-దించారు.

త్వరలో అసెంబ్లీయే ఎన్నికలు జరగ-నున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం, కేరళ లాంటి రాష్ట్రాలకు భారీగా వరాలు ప్రకటించారు. ఈ కేటాయిం-పులకు అవసరమైన నిధుల కోసం పలు ప్రభత్వ రంగ సంస్థల్లో ప్రభుత్వ వాటాలను విక్రయించడం ద్వారా లక్షా డెబ్బై అయిదు వేళా కోట్లను, పెట్రోల్, డీజిల్, దిగుమతి చేసుకునే వంటనూనెలు, ఆల్కహాల్ లాంటి వాటిపై కొత్తగా 'అగ్రి సెస్' పేరుతొ మరో ముప్పయ్ వేల కోట్ల రూపాయల నిధులు సమకూర్చుకోవాలనుకుం-టున్నారు. పన్ను రాయితీల ఊసే లోకపోగా అదనపు భారం పడేలా అగ్రి సెస్ ను ప్రతిపాదించడం కూడా మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా మారింది.

ఆదాయపు పన్ను

కొత్త మినహాయింపుల ఊసే లేదు, శ్లాబులు సవరించలేదు, పెన్షన్ మరియు వడ్డీ ఆదాయం తప్ప లేని 75 ఏళ్ల వయసు దాటిన వారికి ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయనవసరం లేదని చెప్పడం, వివాదాల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం లాంటివి చెప్పుకో-దగ్గ పరిణామాలు. వృద్ధుల పింఛను, వడ్డీ చెల్లించే బ్యాంకులు అవసర-మైన మేరకు పన్ను (TDS) వసూలు చేస్తారు. ఫిక్సడ్ డిపాజిట్లపై వడ్డీ ఆదాయం ఒకే బ్యాంకులో ఉంటేనే ఈ వెసులుబాటు.

వ్యక్తుల చేతుల్లోకి వచ్చే డివిడెండు ఆదాయానికి ఎప్పటిలాగానే పన్ను విధిస్తారు. స్థిరాస్తి ఇన్ ఫ్రా ఇన్వెస్ట్ మెంట్ ట్రస్టులకు చెల్లించే డివిడెండు పై ఇకపై TDS ఉండదు. విదేశీ పో-ర్టుఫోలియోలో పెట్టుబడిదారుల డివిడెండు ఆదాయంపై పన్ను రేట్లను హేతుబద్ధంగా పరిశీలించే అవకాశం ఉంది. అంతే కాకుండా, విదేశీ కంపెనీలు ఆర్జించే డివిడెండుపై చె-ల్లించాల్సిన పన్ను తక్కువగా ఉంటే కనీస ప్రత్యామ్నాయ పన్ను MVAT చెల్లించనక్కరలేదు.

రు. 45 లక్షలలోపు అందుబాటు గృహాలపై తీసుకున్న ఇంటి ఋణానికి సెక్షన్ 80 EEA క్రింద రు. 1,50,000/- వరకు చెల్లించే వడ్డీపై ప్రత్యేక ప్రోత్సా-హాన్ని మార్చి 31, 2022 వరకు పొడి-గించారు.

గత రెండేళ్లలో రు. 50,000/-కు మించి మూలం వద్ద పన్ను కోత TDS వసూలు చేసిన సందర్భాలలో తప్పనిసరిగా రిటర్నులు దాఖలు చే-యాల్సివుంటుంది. ఒకవేళ రిటర్ను-లు దాఖలు చేయకపోతే, వారినుంచి TDS రెట్టింపు మొత్తాన్ని గానీ, లేదా 5 శాతం, ఈ రెంటిలో ఏది ఎక్కువైతే అది వసూలు చేస్తారు. ఆ నిబంధన ఉద్యోగులు, ప్రవాస భారతీయులు, లాటరీ చెల్లింపులు తదితరవాటిలో పూర్తి పన్ను మూలం వద్ద తగ్గించిన

సందర్భాలలో వర్తించదు.

ఉద్యోగులకు వచ్చే LTC మొత్తంపై ఖర్చులతో నిమిత్తం లేకుండా కొన్ని నిబంధనలకు లోబడి మినహాయింపు వర్తిస్తుంది.

ప్రవాస భారతీయులు స్వదేశానికి వచ్చినప్పుడు వాళ్లకు లభించే పదవీ విరమణ మొత్తాలపై విధించబోయే పన్నులను అంతర్జాతీయ రేట్లకు అనుగుణంతో సరళీకరిస్తారు.

పన్ను చెల్లించని ఆదాయాన్ని తిరిగి పరిశీలించేందుకు ప్రస్తుత నిబంధనల ప్రకారం మదింపు సంవత్సరం ముగిసిన తర్వాత ఆరేళ్ళ వరకు నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది. సెక్షను 149 ప్రకారం ఈ నోటీసులు ఇస్తారు. ఈ ఆరేళ్ళ కాలపరిమితిని మూడేళ్లకు తగ్గించాలని ప్రతిపాదించారు. అయినప్పటికీ, తీవ్రమైన మోసపూరిత కేసుల విషయంలో పదేళ్ల వరకు తిరిగి తనిఖీ చేసే వీలుంది. నమోదు చేయని ఆదాయం రు. 50 లక్షలకు మించి ఉన్నప్పుడే ఈ నిబంధన వర్తిస్తుంది. తిరిగి తనిఖీ చేసే విధానం ఇకపై కొన్ని నివేదికలపై కొన్ని నిర్దిష్ట నివేదికల ఆధారంగా జరుగుతుంది.

వివాదాల పరిష్కారం కోసం - ప్రస్తుతం పన్ను చెల్లింపుదారుడికీ, ఆదాయపుపన్ను శాఖకు మధ్య ఉన్న వివాదాల పరిష్కారానికి సెటిల్ మెంట్ కమీషనును ఆశ్రయించవచ్చు. రు. 50 లక్షల లోపు ఆదాయం ఉండి, అందులో వివాదాస్పద ఆదాయం రు. 10 లక్షల లోపు ఉన్న సందర్భాలలో, ది. 1వ ఫిబ్రవరి 2021 నుండి ఈ కమిటీని సంప్రదించి పరిష్కరించుకోవచ్చు.

**ఆరోగ్యరంగానికి అగ్రపీఠం**

ఈ రంగానికి 23,846 కోట్ల రూపాయలు కేటాయించారు. కేవలం కోవిడ్ వేక్సిన్ కొరకే 35,000 కోట్ల రూపాయలు వినియోగించనున్నారు. అదే విధంగా 'ఆత్మ నిర్భర్, స్వస్థ భారత్ యోజన' కు 64,000 కోట్ల రూపాయలు కేటాయించినట్లు చెప్పారు.

**ఇతర ప్రతిపాదనలు**

. వలస కార్మికులు, కూలీలకు అండగా ఉండడం కోసం 'ఒకే దేశం ఒకే రేషన్' కూడా అమలు చేస్తున్నామన్నారు.

.దేశ రక్షణ రంగానికి 4.8 లక్షల కోట్లు, రైల్వే శాఖకు 1,10,055 కోట్లు కేటాయించారు. 2022 జూన్ వరకల్లా ఈస్టర్న్, వెస్టర్న్ (EDFC, WDFC ) రవాణా కారిడార్లు ఏర్పాటు కానున్నాయి. విజయవాడలో రెండు కారిడార్లు అభివృద్ధి కానున్నాయి. 2022 డిశంబర్ నాటికి బ్రాడ్ గేజ్ రైల్వే లైన్లను 100% విద్యుదీకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇది 46000 కిలోమీటర్ల వరకు ఉంటుంది.

. దేశం లోని వాహనాల ఫిట్ నెస్ పరీక్ష ప్రత్యేక విధానం - వ్యక్తిగత వాహనాలకు 20 ఏళ్ళు, వాణిజ్య వాహనాలకు 15 ఏళ్ళు, ఈ కాల పరిమితి ముగిసిన తర్వాత ఫిట్ నెస్ పరీక్షకు వెళ్లాలని నిబంధనలు విధించారు.

. ప్రావిడెంట్ ఫండ్ లో జమ అయిన రు. 2.5 లక్షల మొత్తంపై వచ్చే వడ్డీకే పన్ను మినహాయింపు లభిస్తుంది.

. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రు. 12 లక్షల కోట్లు అప్పుగా తేవాలని లక్ష్యం పెట్టుకున్నారు.

. రెండు ప్రభుత్వ బ్యాంకులు, ఒక భీమా సంస్థలో పెట్టుబడులు ఉపసంహరించనున్నారు.

. బ్యాంక్ డిపాజిటర్లకు సులువుగా రక్షణగా ఉండే విధి విధానాలను డిపాజిట్ ఇన్సూరెన్స్ చట్టం 1961, లో మార్పులు తీసుకురానున్నారు.

. బడ్జెట్ ప్రతిపాదనల వల్ల

- ఈ క్రింది వస్తువుల ధరలు పెరగవచ్చు.

* సోలార్ ఇన్వర్టర్లు * కార్ల విడి భాగాలు * లెదర్ ఉత్పత్తులు * వంట నూనెలు * ఆల్కహాల్ వగైరా...

- ఈ క్రింది వస్తువుల ధరలు తగ్గవచ్చు.

*బంగారం * వెండి * కాపర్ * టెక్స్టైల్స్ * నాఫ్తా * ఆటోమొబైల్ పరికరాలు * నైలాన్ దుస్తులు * మధ్య తరగతి పరిశ్రమల ఉత్పత్తులు

సేకరణ:

కె. రామానందం

# వెన్నెలకంటి... పాటైనా, మాటైనా వెన్నెల విరిజల్లు



కొన్నిపాటలు వింటూంటే.. ఎంత హాయిగా ఉందీపాట.. పాట రచయిత ఎవరోకదా ! అనిపిస్తుంది. ఆపాటలో సాహిత్యం అంత బాగుంటుంది. అలాగే, కొన్నిపాటలు వింటూంటే, అసంకల్పితంగా ఆ సినిమాలో నటీనటుల అభినయం మన కళ్ళముందు ప్రత్యక్షమవుతుంది. అలాంటి పాటలు చిరస్మరణీయాలు. సంవత్సరాలు గడిచినా అవి ప్రేక్షకుల గుండెల్లో, సంగీతప్రియుల హృదయాల్లో అజరామరంగా నిలిచిపోతాయి.

అటువంటి గీతరచయితల కోవలోకి చెందుతారు శ్రీ వెన్నెలకంటి. ఆయన రాసిన పాటలన్నీ సూపర్ హిట్టే. అనువాదచిత్రాల పాటలెంత హిట్ అయ్యాయో, స్ట్రెయిట్ చిత్రాల పాటలూ అంతే హిట్ అయ్యాయి. డబ్బింగ్ చిత్రాలకు పాటలంటే, రచయితలకు ఎన్నో పరిమితులుంటాయి....భాష పరంగానే కాదు, పెదాల కదలికలకు అనుగుణంగా పదాలు పడాలి. అంతేకాదు, పాటలో తెలుగుతనం వుండాలి. వెన్నెలకంటి వ్రాసిన ఎన్నో అనువాదచిత్ర గీతాలు, బహుళ జనాదరణ పొందడమేకాకుండా.. ..ఆయనలోని ప్రతిభను తెలియచేస్తాయి.౨౦

శ్రీ వెన్నెలకంటి పూర్తిపేరు "వెన్నెలకంటి రాజేశ్వర ప్రసాద్" అయినా ఇంటి పేరైన "వెన్నెలకంటి" పేరుతోనే, ఆయన ప్రాచుర్యం పొందారు. ఆయన స్వస్థలం నెల్లూరు. శ్రీ కోటేశ్వరరావు, ఘంటసాల బలరామయ్య గారి ప్రతిభా పిక్చర్స్ సంస్థలో ప్రొడక్షన్ చీఫ్ గా పనిచేసేవారు శ్రీ కోటేశ్వర రావు గారు. అక్కినేని ణి చలనచిత్ర పరిశ్రమకు పరిచయం చేసిన ఘనుడు శ్రీ బలరామయ్య గారు. అటువంటి ప్రముఖుని సంస్థలో పనిచేసేవారు, శ్రీ వెన్నెలకంటి తండ్రి శ్రీ కోటేశ్వర రావు గారు.



శ్రీమతి పద్మావతి దంపతుల రెండో సంతానంగా జన్మించారు. సినీపరిశ్రమలో ప్రతిభా కోటేశ్వర రావుగా పేరు గడించారు.

తండ్రిలాగే, తనపేరు కూడా సినిమాలలోచూసుకోవాలనే తపనతో రచయితగా మారారు, మన వెన్నెలకంటి. బాల్యంనుంచే సాహిత్యం మీద మక్కువ ఏర్పడడంతో, చిన్నతనంలోనే, పదకొండవ ఏటనే "భక్త దుఃఖ నాశ పార్వతీశా" మకుటంతో ఏకంగా ఒక శతకం వ్రాసారు వెన్నెలకంటి. గురువుల ప్రోత్సాహం, పెద్దల ఆశీస్సులతో ఆ తర్వాత "రామచంద్ర శతకం", "లలితా శతకం" కూడా వ్రాసారు. కానీ వెన్నెలకంటి మనసంతా నాటకాలమీదే ఉండేది. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత బ్యాంకు వుద్యోగంలో చేరినా, నాటకాలకు, సాహిత్యానికీ వెన్నెలకంటి ఎప్పుడూ దూరం కాలేదు. శ్రీ జంధ్యాల వ్రాసిన "ఏక్ దిన్ కా సుల్తాన్" నాటకంలోనూ, "ఈ చరిత్ర ఏ సిరాతో", "ఎవ్వనిచే జనించు","దర్పణం" వంటి ఇతర నాటకాల్లో కూడా శ్రీ వెన్నెలకంటి నటించారు.

స్టేట్ బ్యాంకు లో క్యాషియర్ గా ఉద్యోగం చేస్తున్నప్పటికీ, సినిమాలమీద ఉన్నవ్యామోహంతో, ఎలాగైనా సినీ పరిశ్రమలో గుర్తింపు తెచ్చుకోవాలన్న ఆసక్తితో గీతరచయితగా మారారు వెన్నెలకంటి.

1986 లో నటుడు, నిర్మాత డా. ప్రభాకర రెడ్డి ప్రోత్సాహంతో 'శ్రీరామచంద్రుడు' చిత్రంలో తొలిపాట 'చిన్నిచిన్ని కన్నయ్యకు వెన్నెలజోల' అన్నపాట వ్రాసారు. ఆపాట తో తన సినీప్రస్థానాన్ని మొదలుపెట్టారు శ్రీ వెన్నెలకంటి. ఒకప్రక్క సినిమా, మరోప్రక్క ఉద్యోగం ... ఎటువైపు కాలుమోపాలో, నిలద్రొక్కుకోవాలో తెలియక ఊగులాడుతున్నసమయంలో శ్రీ ఎస్పీ



బాలసుబ్రహ్మణ్యం ప్రోత్సాహంతో "అన్నాచెల్లెలు" చిత్రంలో "అందాలు ఆవురావురన్నాయి" అన్న మరోపాట వ్రాసారు. అటువంటి పరిస్థితుల్లో, శ్రీ ఎస్పీ బాలు తదితర పలువురి సూచనలతో స్టేట్ బ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేసి సినీ పరిశ్రమ వైపే మొగ్గుచూపారు. అలా ప్రారంభమైన శ్రీ వెన్నెలకంటి గత 35 ఏళ్ళ సినీ సాహితీప్రయాణం లో 300 చిత్రాలకు పైగా సవ్యసాచిలా మాటలూ, పాటలూ వ్రాయడం జరిగింది. తన సినీ జీవిత చరిత్ర లో ఎక్కువ బాలకృష్ణ సినిమాలకు పాటలు వ్రాసినట్లు శ్రీ వెన్నెలకంటి తెలిపారు. ఇప్పటివరకు స్ట్రెయిట్, డబ్బింగ్ చిత్రాలకు సుమారు 2000 కు పైగా పాటలు వ్రాసారు.

ముద్దులమామయ్య చిత్రంలో సోదరి సెంటిమెంట్ తో పాట వ్రాయాల్సివచ్చిన సందర్భంలో, తనకు తోబుట్టువులు లేని కారణంగా, ఆపాట వ్రాయడానికి విముఖత చూపినా... దర్శక నిర్మాతల సూచనలతో, గొప్ప హిట్ పాటగా నిలచిన "మామయ్య అన్న పిలుపు..." అనే హిట్ గీతాన్ని అందించారు.

త్వరగా పాటను వ్రాసిచ్చే రచయితగా శ్రీ వెన్నెలకంటి గారికి మంచి పేరు, గుర్తింపు వుంది. పెదాల కలయికకు సరిపోయేవిధంగా, పాటలను వ్రాయడంలో శ్రీ వెన్నెలకంటి సిద్ధహస్తుడు. అందుకే, డబ్బింగ్ చిత్రాల మాటల, పాటల రచయితగా పేరు తెచ్చుకున్నారు. పద్యం, పాట, గేయం, వచన కవిత్వం,

అభ్యుదయ కవిత్వం, నాటకం.... ఇలా ప్రక్రియ ఏదైనా...శ్రీ వెన్నెలకంటి ముందు తలవంచాల్సిందే...వారి మాటల్లో, పదాల్లో..ఒదిగిపోవాల్సిందే. వైవిధ్యభరితమైన రచనా విశిష్టత, శబ్దాలంకారపు చమత్కారం, భావుకత విరజిమ్మిన పరిమళం శ్రీ వెన్నెలకంటి పాటల్లో గుబాళిస్తూ వుంటాయి. పండిత పామరులకు సైతం సులభశైలిలో అర్థమయ్యేరీతిలో పాటలు వ్రాయగలిగిన సత్తా ఉంది, శ్రీ వెన్నెలకంటికి. స్ట్రెయిట్ చిత్రాలతో ప్రయాణం మొదలైనా, అనువాద చిత్రాలకు చిరునామాగా మారారు శ్రీ వెన్నెలకంటి.

కమలహాసన్ "నాయకుడు" సినిమాతో అనువాదచిత్ర ప్రవేశం జరిగింది.

ముఖ్యంగా నటుడు కమల్ హసన్ కు, ఇసైజ్ఞాని ఇలయరాజా కి శ్రీ వెన్నెలకంటి ఎంతో ప్రీతిపాత్రుడు. ఆయన సినిమాలు తెలుగులో డబ్బింగ్ అయితే, ఆ చిత్రానికి మాటలు, పాటలు శ్రీ వెన్నెలకంటి వ్రాయాల్సిందే.

"మాటరాని మౌనమిది.. మౌనవీణ గానమిది ", "అల్లిబిల్లి కలలా రావే.... అల్లుకున్న కథలా రావే","రాసలీలవేళా ....రాయబారమేలా","కలలో తెర...తీయాలా, తీయగా ఎద...వేగాలా", "చల్తీ కా నామ్ గాడీ, చలాకీ వన్నెలేడీ", "చిరునవ్వుల వరమిస్తావా... చితినుంచి లేచొస్తా.. మరుజన్మకు కరుణిస్తావా...ఈ క్షణమే మరణిస్తా", "మాటే మౌనమై మాయజేయనేలా ", "చలి చలి చంపుతున్న చమక్కులో" ," రాజశేఖరా .. ఆగలేనురా..", "మధురమే సుధాగానం", "శ్రీరంగ రంగానాథుని దివ్యరూపమే చూడరే", "వెన్నెల్లో హాయ్ హాయ్ .." కొండా కోనల్లో లోయల్లో గోదారి గంగమ్మా సాయల్లో",,వంటి ఎన్నో బహుళ జనాదరణ పొందిన, మాధుర్యభరితమైన పాటలు శ్రీ వెన్నెలకంటి కలంనుంచి జాలువారినవే.

జనవరి 5వ తేదీన తన ఇంటిలో బాత్రూం కి వెళదామని లేచిన శ్రీ వెన్నెలకంటి massive heartattack రావడంతో కుప్పకూలి మరణించారు. శ్రీ వెన్నెలకంటి కుమారులు శశాంక్ వెన్నెలకంటి, రాకేందుమౌళి కూడా చలనచిత్రసీమలో గీతరచయితలుగా పనిచేస్తున్నారు.

శ్రీ వెన్నెలకంటి కలం నుంచి జాలువారిన మరికొన్ని మధురగీతాలు:

నీ గూడు చెదిరింది నీ గుండె పగిలింది, హృదయం ఎక్కడున్నాది (గజినీ), రాయినిమాత్రం కంటే (దశావతారం), కమ్మని నీ ప్రేమ (గుణ), హృదయం ఎక్కడ వున్నాది (గజినీ), మాటంటే మాటేనంట (ఏప్రిల్ 1 విడుదల), విజయావారి బృందావనం చిత్రం లోని పాటలు, "చిన్ని చిన్ని కన్నయ్యకు వెన్నెల జోల "(శ్రీరామచంద్రుడు), రాసలీల వేళా (ఆదిత్య 369), ప్రణయమా.. నీ పేరేమిటి ప్రణయమా (అల్లరి ప్రియుడు), రావయ్యా.. ముద్దులమామ (సమరసింహారెడ్డి), అమ్మ నువ్వోక్కసారి (మా వూరిమారాజు), ప్రేమంటే ఏమిటంటే (శీను).........

ఇంకా..ఇంకా...ఇంకా.... ఎన్నో... ఎన్నెన్నో...మధుర గీతాలు.

శ్రీ వెన్నెలకంటి గారు సభ్యులుగావున్న రెండు గొప్ప సంస్థల్లో నేను కూడా సభ్యుడిని కావడం, రెండు సందర్భాలలో వారితోపాటు నేను కూడా ఆయా సభల్లో పాలుపంచుకోవడమేకాకుండా, అనేకమార్లు వారితో ఫోన్ లో సంభాషించే అవకాశం రావడం నేను చేసుకున్న పూర్వజన్మ పుణ్యంగా భావిస్తున్నాను.

డా. పోడూరి శ్రీనివాస్ రావు,
98494 22239

# తుంపిలి దెయ్యం



"ను... ను.. నువ్వెవరూ?", వణికిపోతూ అరిచాడు పి. ఎన్ . సింహం .

"నేనా?... కొంచెం గుర్తుకు తెచ్చుకో", నవ్వి అన్నది ఓ ఆకారం.

ఆ నవ్వు నవ్వులా లేదు... వంద ఏనుగులు ఘీంకరించినట్టూ, వెయ్యి పులులు ఒకేసారి గాండ్రించినట్ట, వంద సింహాలు ఒకేసారి గర్జించినట్టూ, కోటి కుక్కలు ఒకేసారి భీకరంగా మొరిగినట్టూ, పదివేల కుక్కలు ఒకేసారి ఊళ వేసినట్టూ, వెయ్యి గాడిదలు కూడబలుక్కుని ఒకేసారి గాండ్రించినట్టూ ఉంది. పి .ఎన్ . సింహానికి చెమటలు పట్టాయ్. గుండె గుభేలుమంది.

నా... నా... కు గుర్తు రావడంలేదు" తడబడుతూ నత్తినత్తిగా అన్నాడు సింహం.

"ఎందుకు గుర్తుంటానూ ... ఉండను గాక ఉండను. పేరుకు మాత్రమే నరసింహానివి. బుద్ధి చూస్తే నిన్ను ఏ జంతువుతోనూ కూడా పోల్చడానికి మనసు రావడంలేదు. నిన్నే ఏమిటిలే... ఏ మనిషినీ జంతువులతో పోల్చలేం."

"మనుషుల మీద అంత కోపం ఎందుకూ?"

"నేను దెయ్యాన్ని కనక ... మీకంటే వెయ్యి రెట్లు మంచివాడ్ని గనకా!" మరోసారి వెయ్యి విమానాలు ఒకేసారి స్టార్టు చేసినట్లు, రెండు వేల చెడిపోయిన రుబ్బురోళ్లు ఒకేసారి గిర్రున తిరిగినట్లు చిరునవ్వు నవ్విందా ఆకారం.

"ఓర్నాయనోయ్ ... దెయ్యానివా?", పరిగెట్టబోయాడు సింహం.

"ఓరి సన్నాసీ, మనిషికి భయపడాలి గానీ, దెయ్యానికి భయపడటం ఏమిట్రా? భయపడకు", అభయం ఇచ్చిందా దెయ్యం.

కొంచెం స్థిమితపడ్డాడు సింహం. 'నీ పేరేమిటీ? బ్రతికివున్నపుడు ఏం చేసేవాడివీ? పిల్లలెంతమంది? ఏమాత్రం సంపాదించావు? ఏమాత్రం వెనకేశావు?", ధైర్యంగా అడిగాడు సింహం.

ఇందుకే నేను ఆత్మహత్య చేసుకుని మరీ చచ్చింది. ఒరే, పేరు శాశ్వతమటరా? ఇక పిల్లలు! వాళ్ళు శాశ్వతమా? వాళ్ళు చిన్నప్పుడు మనచేత నానా చాకిరీ చేయించుకుంటారు. మనకి వృద్ధాప్యం వచ్చినపుడు వాళ్ళు లక్షా తొంభై సాకులు చెప్పి మననుంచి దూరంగా పోతారు. మహా అయితే ఓ వృద్ధాశ్రమంలో చేర్పి, ఓ నర్సును మనకి సహాయంగా పెట్టో చేతులు దులుపుకుంటారు. ఇహ ఎంత సంపాదనయితేనేమీ, ఎంత వెనకేస్తేనేమీ, చచ్చేటపుడు మన వెంట చిల్లిగవ్వ కూడా రాదుగదా. ఈ బోడి ప్రశ్నలు తప్ప మిగతావేవీ యీ మనుజజాతికి పట్టవు. ఛీ.. మీ మొహాన కారం కొట్టా!", ఛీదరించుకుంది దెయ్యం.

సర్లే... యీ మాటలు రోజుకి వంద సార్లు మేం వింటూ వున్నవే. అన్నిటికీ సమాధానం చెప్పావు సర్లే గానీ, ఇప్పుడు నీ పేరేమిటీ?", విశ్రాంతిగా అడిగాడు సింహం.

"బతికున్నప్పుడు నేను పుట్టింది 'తుంపిలి' అనే గ్రామం గనక నన్ను తుంపిలి దెయ్యం అంటారు. చచ్చి దెయ్యమయ్యాక ఏ పేరుతో పిలిచినా ఒకటే. అసలు పేరుతో పనేముందీ?", కంకర గుట్టల మీద నుంచి రోడ్డు రోలర్ నడిచినట్టు గరబరా గరబరా నవ్వింది తుంపిలి.

"దెయ్యాలు పెళ్లి చేసుకుంటా-

యా?" కుతూహలంగా అడిగాడు సింహం.

"మనిషికి దేవుడు ఎందుకు కనపడడో నీకు తెలుసా? పిలవంగానే ప్రత్యక్షమైతే, నీలాంటి వెధవలు ఆయన్ని అగ్గిపెట్టె తెమ్మనీ, ఆనపకాయలు తరగమనీ, పిండి రుబ్బి దోసెలు వెయ్యమనీ చంపుకుతింటారు.

అందుకే ఆయన చచ్చినా కనిపించడు. ఏదో మంచీ చెడూ చెప్పి నిన్ను బాగుచేద్దామని నీకు కనిపించాను. నువ్వేం అడుగుతున్నావ్? నాకు పెళ్లయిందా లేదా, పిల్లలున్నారా లేదా, నా సంసారం, etc అడిగి ఫక్తు మనిషి వనిపించుకున్నావు", ఛీదరిస్తూ అన్నది తుంపిలి.

"సారీ.. మనుషులకు పెళ్లి తప్పదనుకో... దెయ్యాలక్కూడా మాలాంటి నియమాలు వుంటయ్యా అనే కుతూహలంతో అడిగానే కానీ, నిన్ను హర్ట్ చెయ్యాలని కాదు. ఇంతకీ మీలో ప్రేమ వివాహాలూ మామూలు పెళ్ళిళ్ళూ ఉంటయ్యా?", దెయ్యం మీద పూర్తిగా భయం పోయింది కానక ధైర్యంగా అడిగాడు సింహం.

"ఒరే సింహం, ఇంకో గంటలో నువ్వు మూడు ముళ్ళు వేసిన పెళ్ళామే పాత చెప్పులు వదిలేసినట్లు వదిలేసి పుట్టింటికి పోబోతోంది. నీకు మా పెళ్లిళ్ల గురించి ఎందుకూ కుతూహలం? పో... ఇంటికి పో.. కాళ్ళో గడ్డమో పట్టుకుని నీ పెళ్ళాన్ని ఆపుకునే ప్రయత్నం చెయ్!"

"ఏమిటీ... నిజమా..", గబగబా ఇంటికేసి పరిగెత్తాడు సింహం. మళ్ళీ కంకర మీద బుల్ డోజర్ లా నవ్వింది తుంపిలి.

"ఇదిగో పంచాయతనం గారూ, కాసేపు ఆగుతారూ?", పాతిక కప్పలు బెకబెక లాడినంత గుసగుసగా అన్నది తుంపిలి. ఠక్కున ఆగాడు పంచాయతనం గారు. మనిషి కనపడకుండా మాట వినిపించేసరికి ఆయనకి గుండెల్లో రాయి పుట్టింది. 'పవన తనయ సంకట హరణ' అంటూ హనుమాన్ చాలీసా చివరినుంచి మొదలెట్టారు పంచాయతనం గారు.

ఖంగారక్కరలేదులే, అయినా జపతపాలతో జబ్బుల్ని తగ్గించే, దయ్యాల్ని వదలకొట్టే మీకు భయమెందుకూ?", మళ్ళీ నవ్వింది తుంపిలి.

"నువ్వెవరూ? కంటికి కనిపడకుండా ఎలా మాట్లాడుతున్నావు?" గాంభీర్యాన్ని నటిస్తూ అన్నాడు పంచాయతనం.

"నేను దెయ్యాన్ని. నా పేరు తుంపిలి. అయ్యా, ఆయతనం గారూ, మీరు కొన్నాళ్ళు 'మతం' పుచ్చుకుని మత మార్పిడులను భీకరంగా ప్రోత్సహించారు. ప్రేయసిని పెళ్లి చేసుకోవడం భార్య ఉండగా కుదరదు కనక, మీరే మళ్ళీ స్వయంగా మతం మార్చుకుని ఖురాన్ బట్టీ పట్టారు.

మీరు చేస్తున్న అరాచకానికి నిఖార్సైన మహమ్మదీయులు దేహ శుద్ధి చేస్తే, మళ్ళీ కాషాయం కట్టుకుని మెయిన్ గా పూజలూ, వ్రతాలూ చేయిస్తూ సైడ్ బిజినెస్ గా జ్యోతిష్యం, వాస్తు, దెయ్యాల్ని వెళ్లగొట్టే పనీ పెట్టుకుని ఆరు చేతులా గడిస్తున్నారు. దెయ్యాల్ని వదలగొట్టే మీకు, నేను దెయ్యాన్ని తెలీదా", గద్దించినట్టుగా అన్నది తుంపిలి.

"సర్లే... నా వెనక ఎందుకు పడ్డావూ?", చికాగ్గా అన్నాడు ఆయతనం. లోపల్లోపల భయం యథాతథం గానే వుంది.

"పడేలాగ నువ్వే చేసుకున్నావు. భగవంతుణ్ణి ప్రేమించమని చెప్పు. అది ఓ. కే. భగవంతుడ్ని చూపిస్తూ భయపెడతావు ఎందుకూ? ఏమిటీ... మొక్కు చెల్లించకపోతే దేవుడు అష్ట కష్టాల పాలుచేస్తాడా? ఎంత తప్పుడు మాట! ఏమిటీ మొక్కు అంటే? సృష్టి అంతా భగవంతుడిదేగా?

నువ్వు ఆయనకి ఇచ్చేదేమిటీ? ఏమోయ్, దెయ్యాల్ని వెళ్లగొట్టే నెపం మీద ఎన్ని కోళ్ళనీ, ఎన్ని మేకల్నీ బలిచ్చావూ? నిజం చెప్పు... మనిషి తప్ప అలాంటి నికృష్టపు పని ఏ జీవి అయినా యీ భూమ్మీద చేస్తోందా? ఆశ్రమాలకి విరాళం, చర్చీలు కట్టడానికి విరాళం. మసీదులకి విరాళం, గురుద్వారాలకి విరాళం. వినాయకుడి విగ్రహాలు పెట్టడానికి విరాళం, ఆఖరుకి అభిమాన నటుడికి బేనర్లు పెట్టడానికి, పాలాభిషేకాలు చెయ్యడానికి కూడా విరాళమే. అన్నిటికీ డబ్బే... అదే బ్రహ్మ, అదే విష్ణు, అదే మహేశ్వరుడు, అదే క్రీస్తు, అదే అల్లా, అదే జొరాస్టర్. ఒక్కసారి నిజం చెప్పు... గుట్టలు గుట్టలుగా మత గ్రంథాల్ని పేర్చుకుంటూ పోతున్నావే, క్షణానికో సారి పాప పుణ్యాల మాట, స్వర్గ నరకాల మాటా ఎత్తుతున్నావే - ఒక్కసారి మళ్ళీ అడుగుతున్నాను ... ఎంతకాలం జనాల్ని భయపెట్టి మీ గుప్పెట్లో ఉంచుకుంటావు? ఎంతకాలం స్వార్థం స్వార్థం స్వార్థం అనే పిశాచంతో కాపురం చేస్తూ 'సూక్తుల్ని' వల్లిస్తూ కాలం గడుపుతావు? ఎంతకాలం మనిషిని మతానికో, కులానికో అంటగట్టి మానవత్వాన్ని హరిస్తావు? ఎంతకాలం నీ సుఖం కోసం ఇతరుల కష్టాన్ని దొంగిలిస్తావు? చెప్పవేం?", గట్టిగా అడిగింది తుంపిలి.

"నిన్ను బంధించి యీ సీసాలోకి పంపడం నాకు క్షణంలో పని", పైపై డాంబికంతో అన్నాడు పంచాయతనం.

"నీ బొంద. సాయంత్రం ఫుల్ బాటిల్ కొట్టకపోతే మాటైనా మాట్లాడలేనివాడివి నన్ను బంధిస్తావా? ఎట్లా బంధిస్తావో చెప్పు చూద్దాం", పకపకా నవ్వింది తుంపిలి.

"ఓం శాకినీ, డాకిణీ, శంకిణీ, హాకినీ, హ్రీమ్, హ్రూమ్, ఫట్" నోటికొచ్చిన శబ్దాల్ని వెలువరించాడు పంచాయతనం.

"నా బొంద ... అవన్నీ నాకు సీనియర్స్, చచ్చి దెయ్యమయ్యాక, మా ఛండాలపు బుద్ధిని మాన్పించి, కొంచెం మానవత్వం వైపు తిప్పింది వాళ్ళే. ఒరే సన్నాసీ... దేవుడ్ని చూపించో, గారడీలు చూపించో జనాల్ని భయపెట్టి సుఖపడటం మానెయ్. లేకపోతే నువ్వూ మాలాగా నీళ్ళూ నిప్పులూ లేకుండా గాల్లో గాలిపటంలాగా తిరుగుతూ వుండాల్సిందే!", హెచ్చరించింది తుంపిలి.

"చచ్చాక దెయ్యమయ్యేది నిజమేనా? మరి నేను బోల్డన్ని హిందూ క్రైస్తవ మహమ్మదీయ గ్రంథాలన్నీ చదివాగా! స్వర్గానికి దారులు వేసుకున్నాగా? కన్ఫ్యూజింగ్ గా అడిగాడు పంచాయతనం.

"మీలాంటి వాళ్ళని మాతో చేర్చుకోము. పదిమందికీ మంచి చేసి మేం మళ్ళీ మానవజన్మ ఎత్తొచ్చు. నీకా ఛాన్సు లేదు. కనీసం జంతు జన్మ కూడా దొరకదు. బతికి వున్నప్పుడే బాగుపడు", సలహా ఇచ్చింది తుంపిలి.

"అంటే ఏం చేయాలీ?", మెల్లగా అడిగాడు పంచాయతనం.

"మనుషుల్ని మనుషులుగా చూడు. కంటికి కనపడనివాడ్ని పూజిస్తూ కంటెదురుగా వున్నవాళ్ళని కష్టపెట్టకు. బతుకులో ఏదీ శాశ్వతం కాదనీ, అన్నీ ఇక్కడ వదిలి పోవాల్సిందేననీ గుర్తుంచుకో. పదిమంది కోసం నువ్వు బ్రతకడమే పుణ్యం. నీకోసం నువ్వు మాత్రమే స్వార్థంగా బతకడం పాపం. నువ్వు సుఖపడుతూ అందరికీ సుఖాన్ని ఇవ్వడం స్వర్గం. 'నేను మాత్రమే' సుఖపడాలి అనుకోవడం సజీవనరకం. ఛాయిస్ నీదే", పంచాయతనం వీపుని గాలిలాగా తట్టి నిష్క్రమించింది తుంపిలి.

PS : దెయ్యాలెక్కడో లేవు. మనలోనే వున్నాయి. దైవం అడుగు పెట్టాలంటే దుష్ట భావాల్ని ముందు పక్కనెట్టాలి.

మళ్ళీ కలుద్దాం.

- భువనచంద్ర

# పరిహారం



ఎలెక్ట్రాన్

రీ ఇంబర్స్ మెంట్ అనే ఆంగ్లపదానికి హిందీలో ప్రతిపూర్తి, భర్పాయి, అదాయగీ అనే మూడు పదాలు చెప్పారు. తెలుగులో ఏమంటారో అని శంకరనారాయణ నిఘంటువు చూస్తే పరిహారం అన్న పదం గోచరించింది. ఈ పదానికి ముందు ఏదైనా విశేషణం చేరిస్తే అది విశేషణ పూర్వపద కర్మధారయమై కూర్చుంటుంది. నష్టపరిహారం ఒక ఉదాహరణ. మెడికల్ అనే ఆంగ్లపదం ముందు చేరిస్తే అది మెడికల్ రీ ఇంబర్స్ మెంట్ అవుతుంది. అంటే-అయిన వైద్యపు ఖర్చులకి ఇచ్చే పరిహారం అన్నమాట. ప్రభుత్వాలు పేదలకోసం రూపొందించిన ఆరోగ్యశ్రీ పథకాలూ, తమతమ ఉద్యోగులకి సంస్థలు కలుగజేసే వైద్యసదుపాయలూ, ఈ కోవకి కొద్దిపాటి తేడాలతో చెందినవే. వైద్యబీమాలు పూర్తిగా వేరే కోవకి చెందినవి. 'ఆరోగ్యమే మహాభాగ్యము' అని వేదకాలంనుంచీ మనిషిని హెచ్చరిస్తూ వస్తున్న సూక్తి శతప్రతిశతమైన సత్యవాక్కు. అయితే ప్రజల అనారోగ్యమే మహాభాగ్యము అన్నది వైద్యులకు, కార్పొరేట్ ఆస్పత్రులకూ అన్వయిస్తే, అది అందరికీ, అన్నింటికీ కాక కొంతమందికీ, కొన్నింటికీ మటుకూ సత్యదూరం కాదు. అనాదికాలంనుంచి దేశీయమైన, ప్రాంతీయమైన వైద్యవిధానాలు ప్రపంచమంతటా నెలకొనే ఉన్నాయి. అయితే ఆ ఔషధాలు మౌలికంగా వనమూలికల, మొక్కల ఆకుల, చెట్ల బెరళ్ళ, స్వర్ణ, రజిత, తామ్ర, అభ్రక,పాదరస భస్మాలపై, ఆధారితమైనవే. అనాది కాలంలో కూడా శస్త్రచికిత్సలు జరిగినా, విస్తృతంగా జరిగినట్టి ఆధారాలు లేవు. విరిగిన ఎముకలకు కట్లుకట్టి నయం చేయడంలో మట్టుకు ప్రావీణ్యత ఉండేది. తరతరాలుగా తమిళనాడులోని పుత్తూరు కట్టు వైద్యం అందరికీ తెలిసినదే కదా?కత్తికోత అనేది లేకుండా కేవలం ఆయుర్వేద లేపనాలతో, పై కట్లతో విరిగిన ఎముకలను అతికించడంలో కొన్ని వంశాలు గృహవైద్యంగా నిపుణత సాధించాయి.



అయితే శాస్త్రవిజ్ఞానం కొత్తపుంతలు తొక్కడంతో వైద్యవిధానాలు కూడా శీఘ్రగతిని పురోగమించసాగాయి. ఔషధనిర్ణయాలకి ముందుగా రోగ కారకాల్ని తెలుసుకొనే ప్రయోగశాలలు నెలకొన్నాయి. కీలెరిగి వాత పెట్టినట్టుగా, రోగకారణం తెలిస్తే వైద్యుడు తగిన వైద్యమందివ్వడానికి ఈ పరీక్షలు సహకరిస్తాయి. శస్త్రచికిత్సా విధానాలు అనూహ్యంగా రూపొందాయి. భౌతిక, రసాయన శాస్త్రాలు వైద్యరంగానికి అనూహ్యమైన దన్నునిచ్చాయి. మానవ దేహానికి బాహ్య, అంతరాలైన ప్రతి భాగానికి వై-

ద్యశాస్త్రంలో ప్రత్యేకమైన శాఖలు పెరిగిపోయాయి. వైద్యవిద్యాధ్యయనంలో ఆయా శాఖల్లో స్నాతకోత్తర పట్టాలు సంపాదించి మహానిపుణులు తయారవుతున్నారు. ఉన్నరోగాలకీ, తలెత్తే కొత్తరోగాలకి కొత్తకొత్త మందుల తయారి సంస్థలు ముందుగా మండూకాలమీద, మూషికాలమీద, కుందేళ్లమీద, కోతులమీద, ఆఖరిగా మానవులమీద అనేకమైన అభ్యంతరాల నడుమ ప్రయోగాలు చేసి, మందు క్షేమదాయకమేనని నిర్ధారించుకొని, ప్రభుత్వ వైద్యరంగనిపుణుల సలహాసంఘం వారి అనుమతి తీసుకొని విపణి వీధుల్లో అమ్ముతున్నారు.

ఈ ప్రగతి కారణంగా ఒకనాటి మనిషి సగటు జీవనకాలం 35 నుంచి ఈ నాడు 70 వరకూ పాకిపోయింది. పుట్టినప్పట్నుంచీ ఏ ఔషధమూ తీసుకోకుండా అరవైలు దాటి బతికేవారి సంఖ్య చెప్పుకోదగ్గ శాతంలో ఉండగా, రోజుకి గుప్పెడు మందులు తీసుకొంటూ, ఎనభైలు దాటినా మరణభయంతో కుమిలే మానవులు చాలా చాలా అధిక శాతంలో ఉండడం మూలాన వైద్యరంగం ఎప్పుడూ వికసితంగానే ఉంటోంది.

ఏ ప్రభుత్వానికైనా ప్రజల ఆరోగ్యం ముఖ్యం. ఎందుకంటే వారికి పరోక్షంగా ఓట్లు ముఖ్యం. ఏ సంస్థకైనా ఉద్యోగుల ఆరోగ్యసమస్యలను నెత్తిన వేసుకొనే బాధ్యత ఉంటుంది. ఎందుకంటే వారి ఆరోగ్యమే సంస్థకి మహాభాగ్యము కాబట్టి.

నేనూ ఓ ప్రభుత్వాధీన సంస్థలో సాంకేతికపరమైన ఉద్యోగిని. దేశంలోని పలు ప్రాంతాలలో ముడిచమురు స్థావరాల్ని అన్వేషించడం, ముడిచమురును, సహజవాయువుల్నీ ఉత్పత్తిచేసి దేశ ఆర్థికపరిస్థికి దన్నుగా సాయం చెయ్యడం మా సంస్థ లక్ష్యం. నన్ను ఈశాన్యప్రాంతంలోని అస్సాం రాష్ట్రంలో శిబ్ సాగర్ (శివసాగర్) అనే ఓ చిన్న తరహా పట్టణంలో నియుక్తుణ్ణి చేశారు. ఆ ఊరి శివాలయం చాలా ప్రసిద్ధి చెందినది.

ఆ ఊరిలో స్వంత ప్రాక్టీసు చేస్తున్న నలుగురు డాక్టర్లలోను ప్రసిద్ధి గాంచిన నిర్మల్ కుమార్ బోర్ఠాకూర్ అనే ఒక వైద్యుణ్ణి సాయంత్రం వేళల్లో, సంస్థ ఉద్యోగుల ఆరోగ్యసమస్యల నివారణ నిమిత్తం, కాలనీలో ఉన్న ఒక క్వార్టర్లో నెలసరి తాత్కాలిక భత్యంమీద కూర్చునే ఏర్పాట్లు చేసింది. ఆ విధంగానే స్త్రీల వైద్యసమస్యల నిమిత్తమై ప్రభుత్వాసుపత్రితో ఒక ఒప్పందం చేసుకొని ఒక లేడీ డాక్టరుని కూడా కుదుర్చుకోవడం జరిగింది. అప్పటికి స్వంత ప్రాక్టీసు చేసే వైద్యురాళ్ళెవరూ ఆ ఊరిలో లేరు. ఆమె మధ్యాహ్న సమయంలో వచ్చి కూర్చునేది. ఎందుచేతనంటే భర్తలు ఉద్యోగ నిర్వహణలకు వెళ్ళిన తర్వాత ఇల్లాళ్ళకు తీరుబడిగా ఉంటుంది కాబట్టి. గాయాలకీ వాటికీ కట్లు కట్టడానికి, కుట్లు వేయడానికీ ప్రథమచికిత్స కోసం ఒక కాంపౌండర్ని కుదిర్చారు. ఆ క్వార్టరు సరిగా నేనుండే క్వార్టర్ కి రోడ్డుకావల ఎదురుగా ఉండేది.

డాక్టరు రోగుల్నిపరీక్షించి మందుచీటీ రాసిచ్చేవాడు. ఉద్యోగులు మందుల షాపుల్లో మందులు కొనుక్కొని, డాక్టరు రాసిచ్చిన మందుచీటీ అంటే ప్రిస్క్రిప్షన్ నకల్ని, మందుల కొనుగోలు తాలూకు అసలు రసీదుల్ని సంస్థ ఆఫీసువారికి సమర్పించుకొంటే, వాటిని పరిశీలించి అయిన ఖర్చులు ఇచ్చేవారు. ఇది క్లుప్తంగా మెడికల్ రీఎంబర్స్మెంట్. అంటే వైద్యపరంగా ఉద్యోగికి అయిన ఖర్చులను సంస్థవారు జాగ్రత్తగా పరిశీలించి, విడిగా కానీ, లేదా నెలాఖరు జీతంలో కలిపి కానీ యివ్వడమన్నమాట. అయితే ఈ వైద్య విధానంలో ఉన్న వెసులుబాటు ఏమిటంటే డాక్టరుగారికి ఉద్యోగులు సంప్రదింపుల సొమ్ములిచ్చుకోనవసరం లేదు.

ఊరికే దొరికితే ఊరంతా తనదే అనుకొనే ఉద్యోగులు కూడా ఉంటూనే ఉంటారు. వారు చీటికీ, మాటికీ ఏ చిన్న సమస్య వచ్చినా ఆస్పత్రికి పరుగులు తీయడానికి అలవాటు పడిపోతారు.

డాక్టరు సాధారణంగా రోగి లక్షణాలను బట్టి మందులిస్తాడు. అయితే కేంద్ర ఆరోగ్యసమితి నియమాల్ని ప్రభుత్వాధీన సంస్థలు

అమలు జరపాలి. అందుచేత డాక్టరు రాసే మందులలో కొన్నిటికి పరిహారం లభించదు. విటమినుమాత్రలు, క్యాడ్ లివర్ అయిలు, ఫెర్రడాల్ లాంటి బలవర్ధకాలూ, మరికొన్ని మందులూ అన్నమాట. విత్తవిభాగంవారు ఉద్యోగులు సమర్పించుకొన్న పరిహారం దరఖాస్తుని జాగ్రత్తగా, నియమానుసారంగా పరిశీలించి, కోయాల్సిన కోతలు కోసేస్తారు. సంస్థ ఉద్యోగుల, వారి కుటుంబాల వైద్యఖర్చుల వ్యవహారాలు చూడ్డానికి విత్తవిభాగంలో ఒక వ్యక్తి ప్రత్యేకంగా నియమితుడై ఉంటాడు. విత్తవిభాగంవారు ఆ క్లైమ్ ప్రథమ పరిశీలనచేసి, డాక్టర్ కి తిరిగి పంపిస్తారు. డాక్టర్ దాన్ని పునఃపరిశీలించి, తన ఆమోదముద్ర వేసి తిరిగి విత్తవిభాగంవారికి పంపిస్తాడు. అప్పుడు దానిమీద విత్తవిభాగాధికారి సంతకం చేసేస్తే, ఆ బిల్ మొత్తం ఉద్యోగి నెల జీతానికి చేర్చి యివ్వబడుతుంది. యిది ఉద్యోగికి వచ్చిన రోగానికీ సంస్థ చెల్లించిన పరిహారానికీ నేపథ్యంలో జరిగే తతంగం.

శనాదివారాల్లో నాకు వీలు కలిగినప్పుడల్లా, ఆయనకి రోగుల సందడి లేనప్పుడల్లా కూర్చుని కబుర్లు చెప్పేవాణ్ణి. ఆయన కజిన్ నాకు ఆంధ్రా యూనివర్సిటీలో ఒక ఏడాది జూనియర్. అస్సాం నుంచి ఆంధ్రావచ్చి చదువుకొన్న విద్యార్థి. ఆ కారణంగా డాక్టర్ కీ నాకూ పరిచయం బాగా పెరిగింది.

ఒకరోజు అలా కూర్చుని కబుర్లు చెప్పుకొనే సమయంలో, ఒకాయన వచ్చి తన అస్వస్థతని గురించి చెప్పాడు. డాక్టర్ ఆయన్ని ఆకుపచ్చటి తెరవెనకకి తీసుకువెళ్లి ఏవో పరీక్షలు చేసి, కొన్ని మందులు రాసిచ్చి జాగ్రత్తలు చెప్పాడు. ఆ కాలం నాటికి రోగనిర్ధారణ పరీక్షలు, సంబంధిత కేంద్రాలు అంతంత మాత్రంగా ఉండేవి. డాక్టరు కేసు తీవ్రతను బట్టి రోగిని ఏభై కిలోమీటర్ల దూరంలో ఉన్న డిబ్రూఘర్ ప్రభుత్వ ఆస్పత్రికి పంపించేవాడు. డిబ్రూఘర్ ఆసుపత్రి ఆ నాటికి అస్సాం లో ఉన్న పెద్ద ఆస్పత్రులలో ఒకటి. సంస్థాగతమైన ఆస్పత్రులు లేవనే చెప్పుకోవాలి.

ఆ వచ్చినాయన తనకిచ్చిన మందుచీటీ చదువుకొని "మీరు రాసిన ఆరు మందుల్లో రెండు మందులకు పరిహారం లభించదు, వేరే మందులుంటే రాయండి సర్!" అన్నాడు.

"ఆ రెండూ బలవర్ధకాలు. వాటి వల్ల మీ రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. మీ మంచికోసమే వాటిని రాశాను. వాడితే మంచిది. నాకు మీ సంస్థ నియమాలతో పని లేదు. కేవలం మీ రోగలక్షణాలతోనే పని!" అని చాలా సౌమ్యంగానే చెప్పాడు. వారి సంభాషణ అంతా బెంగాలీ, అస్సామీ భాషల్లో జరిగినా ఆ సరికి నాకు ఆ రెండు భాషల్లోనూ కాస్త మిడిమిడి జ్ఞానం కలిగింది.

ఆయన వెళ్ళిపోయిన తర్వాత బోర్థాకూర్ నవ్వుతూ అన్నాడు."అర్థమైందనుకొంటాను. ఈయన పేరు చంద్రాబిశ్వాస్. విత్తవిభాగంలో పని చేస్తాడు. భార్య, ముగ్గురు పిల్లలు. అందుచేత ఆయన ఇక్కడ తరచూ ప్రత్యక్షం అవుతాడు. వచ్చినప్పుడల్లా ఇదే తంతు. ఎప్పుడూ కలవలేదా? ఈ కాలనీలోనే ఉంటాడు."

"కాలనీలో ఈ వీధి వరసలో మట్టుకు లేడు. మరో వీధిలో ఉంటే ఉండొచ్చు. నేను పూర్తిగా ఫీల్డ్ మనిషిని. ఫైనాన్స్ సెక్షన్ కి రెండుమూడు సార్లు వెళ్ళినా ఈయన్ని చూడ్డం తటస్థించలేదు. అక్కడ పదిమందికి పైగా పనిచేస్తున్నారు," అన్నాను.

బోర్థాకూర్ రోగాల్ని గురించి, రోగుల మనస్తత్వాలని గురించి చాలా కబుర్లు చెప్పేవాడు.

ఒకసారి మా విభాగంలోనే పనిచేసే దిగువ స్థాయి సాంకేతిక కర్మచారి మెడికల్ లీవ్ పెట్టాడు. ఆరోజు మాకు సైట్ లో చేయవలసిన పని తగలడం మూలాన, అతను రాకపోవడం ఇబ్బందికరంగా మారింది. ఆ రోజు మా బాస్ జయప్రకాష్ వైష్ స్వయంగా సైట్ కి వచ్చి, నేను నా విధులు నిర్వహిస్తుండగా ఆ కర్మచారి చేయాల్సిన పని తను చేశాడు. మధ్యాహ్నానికల్లా పని పూర్తి చేశాం. ఆ సాయంత్రం నేనూ, వైష్ సాబ్ కుటుంబాలతో సహా మహా శివరాత్రి మేళాకి వెళ్ళాం. అప్పుడు, సెలవు పెట్టిన కర్మచారి కులాసాగా స్నేహితులతో మేళాలో తిరుగాడు-

తూ కనిపించాడు.

ఆ మర్నాడు సాయంత్రం నేను డాక్టర్ బోర్ధాకుర్ తో సంగతి ప్రస్తావించాను.

"చికాకు ఇక్కడే ఉంటుంది. మీ వాడు 'కడుపులో నొప్పిగా ఉంది, విరోచనాలు వెళ్తున్నాయి, రెండు రోజులు విశ్రాంతికోసం సెలవు కావాలని అడిగాడు.' జ్వరమంటే తెలుసుకోవచ్చు దెబ్బలు తగిలితే తెలుసుకోవచ్చు. చెయ్యి, కాలూ విరిగితే తెలుసుకోవచ్చు. కడుపు నొప్పి, తలనొప్పి లాంటి లక్షణాలు చెబ్తే మట్టుకు మాటలు నమ్మాలి. సెలవు యివ్వక, తర్వాత ఏదైనా జరిగితే నాకూ, మీ సంస్థకీ కూడా విపరీతమైనా తలనొప్పి విషయం. అందుకని రికమెండ్ చేసి పంపాను. అంతెందుకు? ఈ మెడికల్ లీవ్ అనేది పెద్దస్థాయి ఆఫీసర్లు కూడా కొన్ని సమయాల్లో నిస్సిగ్గుగా ఉపయోగించుకొంటారు. రాజకీయనాయకులు అర్థంతరంగా ఆస్పత్రులలో చేరి విశ్రాంతి తీసుకోవడం జరుగుతుంది. మీరు ఆఫీసరు స్థాయిలో నేరుగా సంస్థలో చేరినా, దిగువస్థాయి కర్మచారుల పనులన్నీ నేర్చుకోవాలి. ఇక్కడ మీవాడు మాయ మాటలు చెప్పి పని ఎగ్గొట్టాడు. ఒకవేళ నిజంగానే సవ్యమైన కారణంతో అతను పనిలోకి రాలేకపోతే-ఆ పని కూడా చేయడం మీరు నేర్చుకోవాలి,“ బోర్ధాకుర్ నవ్వుతూ అన్నాడు.

"నిజమే. రష్యన్లతోటీ, అమెరికన్లతోటీ కలిసి పనిచేయడం వల్ల



ఈ సంస్కృతి మాకూ అలవడింది. వాళ్ళకి డిగ్నిటీ ఆఫ్ లేబర్ అంటే శ్రామిక గౌరవం తెలుసు. అందుకేగదా నా బాస్ వచ్చి, నన్ను నేను చేసే పనికి వదిలి, తను ఆ కర్మచారి పని చేసి మాట నిలబెట్టుకొన్నాడు. న్యాయానికి స్థాయి ప్రమాణంగా గా చూస్తే ఆ కర్మచారి పని నేనూ, నా పని నా బాస్ చెయ్యాలి!" అన్నాను.

ఒకసారి మా సైట్లో ఒక ప్రత్యేకమైన సాంకేతిక నిర్మాణం కోసం అయ్యే ఖర్చుల అనుమతికి పెట్టిన దస్త్రం విత్తశాఖలో ఇరుక్కుపోయింది. దాన్ని త్వరితం చేయడం కోసం విత్తాధికారి సుబ్రమణిని కలుసుకోమని నా పై అధికారి వైష్ సాబ్ చెప్పడం మూలాన వెళ్ళాను. అప్పుడు బిశ్వాస్ ఆయన గదిలో ఉన్నాడు. మణి నన్ను పరిచయం చేశాడు. బిశ్వాస్ ముక్తసరిగా హలో అన్నాడు. చూసి రెండు నెలలైందేమో గుర్తుపట్టలేదను కొంటాను.

బిశ్వాస్ ఏదో దస్త్రంలో మణి సంతకం తీసుకొని వెళ్లిపోయాడు. బిశ్వాస్ వెళ్ళిపోయిన తర్వాత మణి అన్నాడు.

"చాలా నిఖార్సాయిన వ్యక్తి. మెడికల్ క్లైమ్ బిల్స్ చాలా క్షుణ్ణంగా చూస్తాడు. నియమంలో లేని మందుల ఖర్చులు నిర్దాక్షిణ్యంగా కోత పెట్టేస్తాడు. అయితే విచిత్రమేమిటంటే తనకు తెలిసుండీ కూడా డాక్టరుగారిచ్చిన మందు చీటీ ప్రకారం బిల్ పెడ్తాడు. అనర్థమైన మందుల పేర్లచుట్టూ రెడ్ పెన్ తో సున్నాలు చుట్టి అనర్థమని రాస్తాడు. ఈ ఏడాది ఆగస్టు పదిహేను సందర్భంగా ఇచ్చే ప్రశంసా పత్రాల నిమిత్తమై నా విభాగంనుంచి అతని పేరు సూచించాను. గ్రేట్ ఫెలో!' అన్నాడు.

ప్రాజెక్టు ఖర్చుల్ని యక్షప్రశ్నలు వేసి, తగిన సమాధానం వస్తే కానీ మణి సమ్మతించడు. ప్రాజెక్టు మేనేజర్ సంతకం కోసం దస్త్రాన్ని పంపడు. సాంకేతిక

నిపుణులు విసుక్కున్నా మణి చిరునవ్వుతో చెప్పే సమాధానం ఒక్కటే. "మీరేవో పని దృష్ట్యా ప్రొపోజల్స్, అంచనాలు వేసి ముందస్తు సమ్మతి కోసం నా వద్దకు పంపుతారు. ఏ విధమైన అభ్యంతరమూ తెలపడానికి వీలు లేని దస్త్రాలుకూడా నా వద్దకు చెప్పుకోదగ్గ సంఖ్యలోనే వస్తాయి. వాటిమీద నేను కళ్ళు మూసుకొని సంతకం పెట్టి, ప్రాజెక్ట్ మేనేజర్ వద్దకు పంపగలను. కానీ అలా చెయ్యను. ఏదో ఒక చిన్న అభ్యంతరం లేవదీస్తాను. దానికి మీరు సమాధానం యిస్తారు. ఇది మీకూ, నాకూ, మన మేనేజర్ కీ త్రివిధాల క్షేమదాయకం. ఆర్థికపరమైన విశ్లేషణ లేకుండా ఖర్చులు చేస్తారన్న అపప్రథ రాకూడదు. ఆడిట్ వారికి మనం సమాధానం చెప్పుకోవలసిన అవసరం తెచ్చుకోకూడదు."

మణికి మా దస్త్రం సంగతి చెప్పాను. "నేను మూడురోజుల క్రితమే ప్రథమ సమ్మతి ఇచ్చేశాను. అది ప్రాజెక్టు మేనేజరు కల్నల్ హజారికా సాబ్ కి పంపించాను. ఆయన అర్థంతరంగా కేంద్రం పిలుపందుకొని ఢిల్లీ వెళ్ళాడు. ఆయన చార్జి ఇచ్చిన డాక్టర్ దేబ్ కుమార్ చంద్రాసాబ్ మీ సైంటిస్టే కదా? ఫీల్డ్ పనుల అవసరం ఆయనకి తెలియక కాదుగానీ, హెచ్చు విలువల దస్త్రాల మీద తాత్కాలికంగా చార్జి తీసుకున్న సమయంలో సంతకాలు పెట్టడమంటే ఒకవిధంగా ఇబ్బందికరమైన విషయం. ఇవ్వాళ కల్నల్ సాబ్ వస్తున్నాడని తెలిసింది. ఆయన తిరిగి రాగానే, వెంటనే సంతకాలు పెట్టేస్తాడు. రేపటికల్లా దస్త్రం వస్తుందని నీ బాస్ తో చెప్పు," అన్నాడు నవ్వుతూ.

నేను చంద్రబిశ్వాస్ కీ, డాక్టర్ బొర్థాకూర్ కీ మధ్యన జరిగిన సంభాషణ గురించి చెబ్దామనుకొని ఆ ప్రయత్నం విరమించుకొన్నాను. మణి తన శాఖనుంచి బిశ్వాస్ కి ప్రశంసాపత్రం ఇవ్వడానికి సిఫారసు చేశాడు. బిశ్వాస్ పట్ల ఏ విధమైన వ్యతిరేక అభిప్రాయమూ మణి ఎదుట వెలిబుచ్చడం సవ్యం కాదు.

బిశ్వాస్ ఒక అస్వస్థత పాలైన ఉద్యోగిగా, అయిన ఖర్చులకి క్లైమ్ పెడ్తాడు. కానీ ఆఫీసు కుర్చీలో కూర్చున్నప్పుడు తన విధి తాను నిర్వహిస్తాడు. డాక్టరుగారితో మరో మందు యివ్వరాదా అన్న అభ్యర్థనలో చంద్రాబిశ్వాస్ చేసిన తప్పేమైనా ఉందా అంటే లేదనే అనుకోవాలి.


ఈనాడు మన మహానగరాల్లో సర్వ మహానిపుణ ఆస్పత్రులున్నా కొందరు రాజకీయప్రతినిధులు విదేశాలకి పోయి ప్రజల సొమ్ముతో వైద్యం చేయించుకొని వస్తున్నారు. ప్రభుత్వాధీన సంస్థలన్నీ కొన్ని సంస్థాగతమైన ఆస్పత్రులతో ఒప్పందాలు చేసుకొని, అవసరం వచ్చినప్పుడు ఉద్యోగుల్ని వాటికి పంపి, శతాధికమైన వేలలో సొమ్ములు చెల్లిస్తున్నారు. ఈ నొప్పి, ఆ నొప్పి అంటూ మందులు రాయించుకొని వాటిస్థానే మందుల షాపులో టూత్ పేస్టులూ, సబ్బులూ, పౌడర్ డబ్బాలూ అవి కొనుక్కుని, అసలు మందుల పేరిట రశీదులు తీసుకొని క్లైమ్ పెట్టే ఉద్యోగులున్నారు. మెడికల్ కమ్ కిరాణా షాపులు వెలిశాయి. ఇప్పుడు విద్యా, వైద్యరంగాలు విపణి వీధుల్లో పరుగులు తీస్తున్నాయి.

మరో రెండేళ్ళలో మేము అయిదు ముడి చమురు క్షేత్రాలు కనుగొనడంతో ప్రాజెక్ట్ ఉద్యోగుల సంఖ్య అయిదు వేలకి పెరిగింది. కొత్త ఆఫీసు భవనాలు వెలిశాయి. యిరవై పడకలతో, అయిదుగురు డాక్టర్లతో, ఇతర సిబ్బందితో మా సంస్థ స్వంత ఆస్పత్రి వెలిసింది. ఆ అయిదుగురులోనూ ఇద్దరు లేడీ డాక్టర్లు. రెండు అంబులెన్స్లు. వైద్యవిభాగం అధికారిగా బొర్థకూర్ కి ఉద్యోగం ఇవ్వజూపితే ఆయన సున్నితంగా తిరస్కరించాడు. మా సంస్థ ఉద్యోగులం బొర్థాకూర్ ఉద్యోగాన్ని నిరసించాడని తెలుసుకొని నిరాశ పడిపోయాం. "నామీద స్థానికులకు ఎంతో నమ్మకముంది. నేను వారికి దూరం కాదల్చుకోలేదు. మీ వద్ద శాశ్వతంగా చేరితే వారికందకుండా పోతాను. మీరు వేరే చూసుకోండి".

ఒక వైష్, ఒక బొర్థాకూర్, ఒక మణీ, ఒక బిశ్వాస్, చాలా అరుదుగా కనిపిస్తారు.

*****

# వేదులాన్వయు పలుకు -3



వేదుల సుబ్రహ్మణ్యం

కూతురును కోడలను నొక్క కోవ జేర్చి
నిండు మనసున ప్రేమించు నీతిపరులు
ధన్యు లగుదురు నిక్కము ధరణి లోన
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 21

కన్నవారిని కట్టుకునున్న వారి
కంట తడిబెట్ట కుండగ కాచుకొనగ
ధర్మపాలన మొనరింప ధన్యుడగును
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 22

కోరి సంసార బంధము కొనగ దెచ్చి
గుట్టుగా ధర్మమార్గము బట్టి విడక
బాధ్యతల దీర్చు వానికి బరగు ముక్తి
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 23

చిన్న వయసున బుద్ధులు చెప్పదగును
పెరిగినన్జెప్ప చెడును నీ పెద్దరికము
హితము చెప్పగ నొప్పు సమ్మతముతోడ
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 24

వయసు మీరుచు నుండగ వగపు కన్న
మోక్ష ధామము దరిచేరు మోద మరసి
దైవ చింతనపై మది తరలు టొప్పు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 25

వయసుధర్మము పాటించి నయము నెంచి
జాగరూకతతో దినచర్య మలచి
మనసు నాధ్యాత్మికంబున మసల నిమ్ము
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 26

జన్మ సంసార వృత్తుల సతము జిక్కి
పాపకూపము జొచ్చియు బయట బడక
పారలౌకిక జ్ఞానము బడయు టెట్లు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 27

కోపమందున్న వానికి కుదురు లేక
మంచి చెడ్డలు గుర్తించి మసలు శక్తి
సన్నగిల్లి వివేకము సడలి పోదె!
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 28

మనుజు డింద్రియ లోలుడై మసలి నంత
పూర్వ సంస్కార పుణ్యము బుద్ధినిచ్చి
మనసు తీరును సరిదిద్ది మరల జేయు
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 29

తల్లి కనిపెంచి లాలించు పిల్లవాడు
పెద్దవాడయి పెడదారి వెదకు నాడు
తల్లడిళ్ళదె వ్యథతోడ తల్లి మనసు !
వేదులాన్వయు పలుకు సమ్మోదమొలుకు 30

# పూరి జగన్నాథ స్వామి వైభవం

డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ

పూరి జగన్నాథుని రథయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమైనది.కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాథ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.

స్కాందపురాణాంతర్గతమైన జగన్నాథ క్షేత్ర మాహాత్మ్యాన్ని యథాతథంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము. చదవండి, చదివించి మోక్షాన్ని పొందండి.

- సంపాదకురాలు

25వ అధ్యాయం

జైమిని ఋషి సంవాదం

(జగన్నాథ రథ నిర్మాణం )

విగ్రహప్రతిష్ఠకుకావలసినసంభారాలన్నినారదుడు వ్రాసి ఇచ్చాడు. రాజుఆపత్రాన్నిపద్మని.ధికిఇచ్చాడు. " పద్మనిధి! బంగారు మండపాన్నినిర్మించు బ్రహ్మకి ప్రత్యేక భవనాన్ని నిర్మించు. ఇంద్రాది దేవతలు సిద్ధులు, మానవులు, మునీంద్రులు, రాజులు, కూర్చో వడానికి తగిన ఆసనాలతో సభా భవనాన్ని ఏర్పాటు చేయి. కావలసిన వస్తువులు ఏర్పాడటు చేయి. విశ్వకర్మ నీకు సహాయపడతాడు." అని రాజు ఆదేశించాడు.

" రాజా! బంగారంతో మూడు రథాలను నిర్మించాలి వాటిని పట్టు వస్త్రాలతో, ముత్యాల మాలలతో అలంకరిచాలి. జగన్నాథుని రథంపై గరుడ ధ్వజం ఉండాలి. సుభద్ర రథంపై పద్మ ధ్వజం ఉండాలి. స్వామి రథానికి పదహారు చక్రాలు, బలరామునిరథానికి పదునాల్గు చక్రాలు, సుభద్ర రథానికి పన్నెండు చక్రాలు ఉండాలి. స్వామి రథంపదిహస్తాలు,బలరామునిరథంపద్నాలుగు హస్తాలు, సుభద్ర రథం పన్నెండు హస్తాలు పొడవు ఉండాలి.

ఈ చరాచర జగత్తును స్వామి తన అరచేతిలో చూస్తూ ఉంటాడు. బలరామునికి నాగలిని ధ్వజంగా ఏర్పాటు చేయాలి. స్వామిని ముందుగా రథంపై ప్రతిష్ఠించాలి. స్వామి ప్రతిష్ఠకు కావలసినవి ఏర్పాటు చేయి



నేను వచ్చి స్వామిని ప్రతిష్ఠిస్తాను” అని నారదుడు పద్మనిధికిచెప్పాడు, పద్మనిధివిశ్వకర్మకుఆదేశించాడు

విశ్వకర్మ నారదుడు చెప్పిన కొలతలప్రకారం రథాలను నిర్మించాడు. నారదుడు స్వామి రథంపై జగన్నాథుని విగ్రహం ప్రతిష్టించాడు.రథాన్ని లాగడానికి పన్నెండు తెల్లని గుర్రాలను ఏర్పాటు చేసారు. ఆ రథం సూర్య రథంలాగ ప్రకాశిస్తోంది. (1 -29)

“”జగన్నాథుని రథానికి ఈశాన్య భాగంలో మరొక రథాన్నినిల్పారు.ఆరథంలోనాలుగుచేతులవెడల్పు,నాలుగుచేతులపొడవులలో ఒక వేదికను నిర్మించారు. ఆ రథానికి ఉత్తరదిక్కునశుభముహూర్తంలోఅంకురార్పణ చేసారు. ముప్పై ఇద్దరు దేవతలకు బలులు ఇచ్చారు. రథంలో ఉన్న వేదికపై పద్మం ఆకారంలో ముగ్గులు పెట్టారు. దాని మధ్యలో కుంభాన్ని ఉంచారు. వాము చెట్లనుండి తీసిన రసాన్ని పోసారు. గంగా జలాన్ని జల్లారు. సుగంధ ద్రవ్యాలతో పూజించారు. ఆచార్యుడు తూర్పు దిక్కువైపునకు కూర్చుని, విష్ణువును స్మరించుకొని పంచామృతాలు సమర్పించారు.చుట్టు పట్టు వస్త్రాన్ని కప్పి పైభాగంలో పుష్పాలతో అలంకరించారు. నరసింహుని యథావిధిగా పూజించారు. స్వామిని ఆవాహన చేసి, యథావిధిగా అర్చించారు. కుంభానికి వాయువ్య భాగంలో వెయ్యి ఎనిమిది సార్లు సమిధలతో, నెయ్యితో హవిస్సు సమర్పించారు. రథాన్ని అలంకరించారు. శంఖాలు ఊదుచు వాయిద్యాలు వాయించారు. స్వామి రథంపై వాయు దేవుని ప్రతిష్ఠించారు. గరుత్మంతుని పూజించారు. రథం పైభాన్నగరుత్మంతుని ప్రతిష్ఠించారు. కుంభాన్ని రథంపై ఉంచి , రథాన్ని మూడు సార్లు నడిపారు. బ్రహ్మతో కలిసి రథాన్ని సేవించారు.

తరువాత పూర్ణాహుతి సమర్పించారు. బ్రహ్మకు, బ్రాహ్మణులకు దక్షిణ ఇచ్చారు.ద్వాదశాక్షర మంత్రాన్ని చదువుతూ బలరాముని రథంపై ప్రతిష్ఠించారు. నాగలి ధ్వజాన్ని రథంపై ఏర్పాటు చేసారు. స్వామితోబాటు బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు కూడా వెళ్లారు. ఏనుగులు, గుర్రాలు రథంతో పాటు వెళ్లాయి.

రథయాత్ర జరిగే సమయంలో రథం పడిపోతే గ్రామాలలోని వారికి నాశనంకలుగుతుంది.బలిఇవ్వాలి, శాంతి హోమం చేయాలి. అన్నదానం చేయాలి. రథానికి ఈశాన్యభాగంలోఅగ్నినిఏర్పాటుచేయాలి. హోమంచేయాలి. రథంలో ఉన్న లోపాలు చూసి, ఆప్రదేశంలోహోమం చేయాలి. బ్రాహ్మణులతో శాంతి చేయించాలి. ఈవిధంగా చేస్తే విశేషమయిన శుభాలు కలుగుతాయ. బ్రాహ్మణులకు శుభము

(ఇంకా వుంది)

# సప్త మోక్ష నగరాలు



కొత్త రామానందం

జీవితం ---- ముఖ్యంగా మానవ జీవితం గొప్పది. అమూల్య మైనది. ఆధ్యాత్మిక లో చెప్పాలంటే దుర్లభమైనది. కేవలం లౌకిక జీవితాన్ని ఆరాధించే వారి సంగతి పక్కనుంచితే భగవంతుడే పర-మావధిగా ఆయనను పొందేందుకే మానవ జీవితం అనే స్పృహ కలిగి, ఆ గమ్యానికే దృఢ చిత్తంతో సమాయత్తమైన వారికి జీవితం అపురూపమై నది. మానవ జన్మ ఓ దివ్య వరంగా లభించింది. దీనిని దుర్వినియోగం చేసుకోకూడదంటారు మన పెద్దలు. జ్ఞానం లేకుండా ముక్తి లక్తి భించదు. అందుకే మహాపురుషులను ఆశ్రయించి, ఆత్మ --పరమాత్మ జ్ఞానం పొందాలి. ధర్మార్ధ కామమోక్షాన్ని విడిచి మధ్య ఉన్న అర్ధ కామాల వెంట నేటి మనిషి పరుగులు చేస్తు న్నారు. పరమాత్మ పట్ల చిత్తం అంటే మనసును లగ్నం చేయాలి. మన మనసు ప్రవర్తనను నిరోధించడమే యోగం.

ఎన్ని ఒడుడుకులు ఎదురైనా పదిలంగా బతకాలని ప్రతి జీవి తాపత్రయపడుతుంది. అందులో ప్రమా-దరహితంగా, ప్రమోద భరితంగా సాగాలనే కాంక్ష అంతర్లీనమై ఉంటుంది. జటిల సమస్యలు ఎదురైన-ప్పుడు ఏమైనా మహిమాన్విత శక్తి తనకు సహక క్తి రించాలని ఆశించడం సహజం. భగవంతుని అను-గ్రహం పొంది, సమస్యలను అధిగమించగల శక్తి పొందాలనే ప్రయత్నమే --- భక్తి మార్గం. భగవంతుడు అపార కరుణా సముద్రుడు. దయాళుడు. ఆయన మానవునికి సద్బుద్ధినిచ్చి సన్మార్గంలో నడిపిస్తా డు. అందరికీ ప్రేరణ ఇస్తాడు. ఆయన ప్రేరణ జగతి జాగృతికి ఆధారం. భవ బంధాలనుండి విముక్తి చేయ-డానికి ఎన్నెన్నో మార్గాలు చూపాడు. ఎన్నో దివ్య ధామాలను సృష్టించాడు. వేదాలు పుట్టిన ఈ పవిత్ర భూమిపై ముక్తి ధామాలుగా సప నగరాలు ఉన్నాయి. అందు పరమాత్మ అనేక అనేక అవతారాలుగా ఉద్భవించి దుష్ట శిక్షణలు గావించి తన మహిమలతో కృపాదృష్టితో కాపాడుతున్నాడు, మరియు నూ-తనోత్సాహాన్ని నింపుతున్నాడు.. "అయోధ్యా, మధురా మాయా, కాశీ కంచి అవంతికాపురి ద్వారవతి చైవ సప్తైతే మోక్ష దాయకా" భారత దేశంలో అనేక దివ్య క్షేత్రాలు ఉన్నాయి. అయితే సప మోక్ష నగరాలు మోక్ష ధామాలుగా ప్రసిద్ధి గాంచి మనందరకూ సుఖ శాంతులు, విజయ కాంతులు ప్రసాదిస్తు న్నాయి. అం-దువల్ల మనకు ఆధ్యాత్మిక చైతన్యం విరాజమానమై దైవం పట్ల భక్తి ప్రపక్తి త్తులు పెరిగి ఆత్మ విచారణ చేయగలుగుతున్నాము. ధర్మ బద్ధమైన జీవనాన్ని ఎంపిక చేసుకుని పుణ్య క్షేత్రాలను సందర్శిస్తూ ముక్తి కోసం ప్రయత్నించడం మన ధ్యేయంగా చేసుకోవాలి. ముఖ్యంగా జీవిత కాలంలో సప్త మోక్ష ధామాలను దర్శించి పునీతులమవ్వాలి. భగవంతుడు భక్తుని నుండి కోరుకునేది కూడా అదే.

ఆసేతు హిమాలయ పర్యంతం వ్యాపించిన మన భారతావనిలో ఎన్నో జాతులు, తెగల ప్రజలు, భాషలు ఉన్నా మొత్తం జాతినంతటినీ సమైక్య పరచి ముందుకు నడిపిస్తోంది మన సనాతన సంస్కృతి. అట్టి సంస్కృతికి ప్రతిరూపాలు మన పుణ్య క్షేత్రాలు, తీర్థాలు. వాటిలో అనాదికాలం నుంచి విఖ్యాతి చెంది భక్తులకు మోక్షదాయికాలుగా ఏడు పుణ్య క్షేత్రాలు అత్యంత ప్రాముఖ్యత పొందాయి.

**అవి అయోధ్య, మధుర, మాయ (నేటి హరిద్వార్), కాశీ, కంచి, అవంతిక(నేటి ఉజ్జ-యిని) మరియు ద్వారక.**

# మాయ (నేటి హరిద్వార్)



భగీరథుని వెంట సాగిన గంగ పాతాళానికి చేరి, సగరుల భస్మ రాశులపై ప్రవహించి, వారికి సద్గతులను ప్రసాదింపచేసింది. గంగా నది భాగీరథిగా పిలవబడుతోంది. గంగ పేరు విన్నంతనే మనసులు పవిత్ర భావనలతో పునీతమౌతాయి.

హిమాలయాలలో కొండలు వాగులలో ప్రవహిస్తూ, అందరి తపోభూములను పునీతం చేస్తూ హరిద్వార పుణ్యధామం ప్రవేశించి నదీ రూపంలో వేల కిలోమీటర్లు పయనించి కలకత్తా నగరం వద్ద సముద్రంలో కలుస్తుంది. ఇక హరిద్వార్ పుణ్యస్థలి యందు లక్షలకొద్దీ యాత్రికులు గంగా స్నానం చేసి పునీతులౌతారు. తమ పెద్దల అస్థికలు కలుపుతారు. తీర్థ విధులు ఆచరించి ధన్యులుగా భావిస్తారు. ఇటువంటి పితృ కర్మలు నిర్వహించడానికి బ్రహ్మకుండానికి దక్షిణంగా కుశావర్తం ఘట్టం ఏర్పాటుచేశారు. బ్రహ్మదేవుడు ఈ తీర్థంలో విష్ణువుని సేవించాడు. కాబట్టి ఈ ప్రదేశానికి బ్రహ్మకుండం అన్న పేరు వచ్చింది.

గంగ చాలా వేగంగా పయనిస్తుంది. అందుకు యాత్రికుల సౌకర్యార్థం ఇనప గొలుసులు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలోని హరి కి పైడి దగ్గరలో విష్ణుకుండం, సుభాష్ ఘాట్ అని, రామఘాట్ అని, గౌ ఘాట్ అనీ అనేక స్నాన ఘట్టాలు ఉన్నాయి. హరి క పైడి లో యాత్రికులు భక్తి శ్రద్ధలతో శివాలయంలో శివుని, గంగమ్మ ఆలయాన్ని తిలకించి నమస్కరిస్తారు. ప్రతి రోజూ సాయంత్రం 7 గంటలకు గంగాహారతి ఇస్తారు. అక్కడ అన్ని

వివిధ ఆలయాల పూజారులు కూడా ఘంటానాదాల మధ్య వేలాది భక్తులు తిలకిస్తుండగా భక్తితో హారతులు సమర్పిస్తూ సందర్శకుల హృదయాలను దోచుకుంటారు. భక్తులు అందరూ గంగమ్మకు పూజలు జరిపి చిన్న చిన్న దొన్నెలలో దీపాలు వెలిగించి పూలతో ఆ దీపహారతిని గంగామాతకి సమర్పించి ఆ తరువాత ఆ దీపాన్ని, పువ్వుల్ని దొన్నెతో సహా నీళ్లలో వదులుతారు. ఇట్టి దీపాలు వందలు వేలకొద్దీ నీళ్లలో వదలటం వాళ్ళ ఆ దీపాలన్నీ బారులు తీరి అందంగా కదిలివెళుతుంటే చూచి యాత్రికులు అపూర్వ అనుభూతి చెందుతారు.

హరిద్వార్ లో దర్శించుకోవాల్సిన దేవాలయాలు అనేకం ఉన్నాయి. వాటిని గురించి తెలుసుకుందాం.

**1. మానసాదేవి ఆలయం**

అష్టాదశ పీఠాలలో ఒకటయిన 'కామరూపి' దేవి పట్టణం లోని శివాలిక్ కొండమీద వెలిసి, హరిద్వార్ పుణ్యక్షేత్రానికి వచ్చిన యాత్రికుల బాగోగులు చూసుకుంటుంది. కొండపైన అమ్మవారిని చూచుటకు కాలినడక లేక రోప్ వే ద్వారా భక్తులు ఆలయానికి చేరుకుంటారు. విద్యుత్ తీగల మీద నడిచే ట్రాలీలలో యాత్రికులను కూర్చోపెట్టి కొండపైకి చేరుస్తారు. గంగామాతను, పట్టణ పరిసరాలను, కొండలు కోనతిలకిస్తూ కొండపైకి సంతోషంగా చేరుకొని




ప్రధాన ఆలయాన్ని, ఉపాలయాలనీ చూసి తరిస్తారు. అమ్మవారి ఆలయ ప్రాంగణం నుంచి ప్రకృతి శోభను తిలకిస్తూ మురిసిపోతారు. కొందరు దాతలు తమ మొక్కులు తీర్చుకున్న పిమ్మట నివేదన చేయించిన ప్రసాదాన్ని భక్తులందరికీ స్వహస్తాలతో పంచి



తృప్తి చెందుతారు. అమ్మవారి ఆలయం నుంచి రోప్ వే కు వెళ్లే మార్గంలో ఉన్న దుకాణాలలో అందమైన బొమ్మలు, పాతాలు, ఇతర వస్తువులు అమ్ముతుంటారు.

**2. చండీదేవి ఆలయం**

బ్రహ్మ కుండానికి పశ్చిమంగా ఆరు కిలోమీటర్ల దూరంలో నీల పర్వతమనే కొండ పైన చండీదేవి ఆలయం ఉంది. ఇచ్చటనే అమ్మవారు శుంభ నిశుంభులనే రాక్షసులతో యుద్ధం చేసినట్లుగా ఇచ్చటి స్థానీయులు చెప్తుంటారు. ఈ మధ్యకాలం 200 సంవత్సరాలలో కొండ మీద ఉన్న ఆలయాన్ని చేరుటకు రోప్ వే నిర్మించారు. యాత్రికులకు చండీదేవి దర్శనం రోప్ వే ద్వారా సుగమమైంది. దసరా నవరాత్రులు ఈ ఆలయంలో ఘనంగా జరుపుతారు. ఈ చండీదేవి మందిరానికి దగ్గరలో ఉన్న గౌరీ

శంకర ఆలయం, నవేశ్వర మహా-దేవుని మందిరం, అంజనాదేవి ఆలయములు చూడవచ్చును. ఈ మానసాదేవి, చండీదేవి ఆల-యాలను యాత్రికులు విధిగా దర్శించుకుని అమ్మవార్లకు తమ కోర్కెలు నివేదించుకుంటారు.

3.భారతమాత మందిరం

ఈ మందిరం హరిద్వార్ కి 4 కిలో-మీటర్ల దూరంలో ఉత్తరం వైపు ఉంది. ఇది ఏడు అంతస్థుల భవనం. భవనం మందిరం లోని ప్రతి అంతస్థులో అనేక విగ్రహా-లను తిలకించవచ్చును. క్రింది అంతస్థులో అతి సుందరంగా రూపొందించబడిన భారతమాత విగ్రహం మనో జ్వలంగా తిలకిం-చవచ్చును. బుద్ధ, మహావీర, గు-రునానక్, కబీరు, తులసీదాసు, శంకరాచార్య మొదలగు మహ-నీయుల విగ్రహాలు కనిపిస్తా-



రాణా ప్రతాప్, శివాజీ, గురుగో-వింద్ సింగ్ వంటి వీరుల విగ్ర-హాలు దర్శించుకోవచ్చును. అదే రీతిలో పై అంతస్థులో నవదుర్గ, జగదాంబ, మీనాక్షి, శక్తి రూపాలు కనుల విందుగా దర్శించుకోవ-చ్చును. అయిదవ అంతస్థులో లక్ష్మీ నారాయణులు, సీతారాము-

రించారు. ఆఖరి అంతస్థులో శి-వరూపాలయిన నటరాజు, అర్ధ-నారీశ్వరుడు, ఉమామహేశ్వరుల విగ్రహాలను చూడగలుగుతాం. భరతమాత మందిరం సందర్శిస్తే భారతీయ సంస్కృతి ఎంత ఉన్న-తంగా నిలిచిందో, దైవారాధనకు ప్రజలు ఎంత ప్రాధాన్యత ఇస్తు-



యి. వేరే అంతస్థులో భారతదే-శం గర్వించదగ్గ వ్యక్తులు అనగా లు, రాధాకృష్ణుల చలువరాతి విగ్రహాలు అందంగా అలంక-న్నారో తెలుసుకోగలుగుతాం.

# గాలిపటాలు



సంక్రాంతి సంబరాలలో భాగంగా కొన్ని ప్రాంతాలలో గాలిపటాలు ఎగురవేస్తారు. పిల్లలంతా మేడ పైన గాలిపటాలు ఎగురవేస్తుంటే, నేను, మావారు చూడడానికి వెళ్ళాము. చుట్టుపక్కల అపార్ట్ మెంట్ టెర్రెస్ లపైన చాలా ఉత్సాహకరమైన వాతావరణం కనిపించింది. చిన్నపిల్లలు, పెద్దవాళ్ళు అంతా చాలా సందడిగా ఆ గాలిపటానికి పైన, క్రింద దారంతో ముడివేసి సరైన దిక్కు వైపుకి గాలి గమనాన్ని బట్టి చేతిలోని గాలిపటం దారం గుంజుతూ, వదులుతూ పైకి ఎగురవేస్తున్నారు. ఈ గాలిపటాలను 'పతంగు'లని, వాటికి కట్టే దారాన్ని 'మాంజా' అని అంటారు. ఎగురవేసిన పతంగులలో కొన్నింటికి రంగురంగుల తోకలు కూడా ఉన్నాయి. కొందరు మ్యూజిక్ పెట్టుకుని ప్రక్కనున్న పతంగుని కట్ చేయగానే కేకలు పెట్టి డాన్సులు చేస్తున్నారు. చాలా సరదాగా సాగుతోంది ఆ ఆట. అలా ఆకాశంలో తోకచుక్కల్లా ఎగురుతున్న గాలిపటాలను కళ్ళపైన చెయ్యి అడ్డం పెట్టుకుని చూస్తూ ఉండిపోయాను.

అదో మ్యాజిక్ లా తోచింది. అలా చూస్తున్న నా ఆలోచనలు మన జీవితాల వైపుకు మళ్ళాయి. వేదాంతంలా అనిపించినా ఈ గాలిపటాలకు మన జీవితాలకు చాలా దగ్గర పోలికలు ఉన్నాయి. స్వేచ్ఛగా గాలికి రెపరెపలాడుతూ గగన సీమల్లో ఎగురుతున్నట్టు కొందరి జీవితాలు మనకు అనిపించినా దారం కింద ఎవరి చేతుల్లోనే ఉంటుంది. మన జీవితాలు విధాత చేతిలో ఉన్నట్లు, అప్పటిదాకా తారాస్థాయిలోకి చేరిన పతంగులు ఎవరైనా కట్ చేయగానే కిందకి సుడులు తిరుగుతూ వచ్చి నేలకొరుగుతాయి. మనలోని కొందరి జాతక మహత్యంలా తారాస్థాయి నుండి పాతాళానికి దిగిపోయినట్లు కొన్ని పతంగులు పైకి ఎగిరిన కొద్దీ క్షణాల్లోనే ఏ కరెంట్ తీగలకో చెట్టుకొమ్మలకో చుట్టుకుని ఆట ముగిస్తాయి.

కొందరు దురదృష్టవంతుల బ్రతుకులు ఆదిలోనే వసివాడినట్లు, మన ఎదుగుదల చూసి ఓర్వలేక వెన్నుపోటు పొడిచినట్లు పైపైకెగిరి అల్లంత దూరాన ఉన్న పతంగును గురిపెట్టి దానిని తెంపి (ఆదే, కట్ చేసి) నేలరాల్చేవారు కొందరు, మనలోని కొందరి స్వార్థపరుల కుట్ర కుతంత్రాల్లా ఎక్కడో తయారయ్యి, ఎన్నో చేతులు మారి మన దగ్గరకి వచ్చి మన ఆటలో భాగమై దూరంగా ఎక్కడో ఏ మూలనో నెలకొరిగే పతంగులు చూస్తే మన జీవితాల్లాగే అనిపించింది. ఎక్కడో పుట్టి, ఎక్కడ పెరుగుతామో, చివరకి మన కథ ఎక్కడ ముగుస్తుందో ఎవరికీ తెలీదు.

మన జీవితాలు ఈ గాలిపటాలైతే మనల్ని ఓ అద్భుత శక్తి దారమై నింగి అంచులకు ఎగసేలా చేస్తోంది. ఆ గగనపు టంచులపై నిలబడి నిశ్చలంగా, స్వేచ్ఛగా, ఆహ్లాదంగా పుడమి అందాలను చూసి తరించాలని ఈ ప్రకృతిలో మనం పులకరించాలని ఆ శక్తి తన వంతు కృషి చేస్తూనే ఉంటుంది. ఆ గాలి సాక్షిగా ప్రతి ఒక్కరం తమ పతంగు ఆకాశపు మేఘాలను ముద్దాడాలనే అనుకుంటారు. మన విధాత మరింత అనంతశక్తితో అనేక లక్షల కోట్ల జీవిత గాలిపటాలను నింగికి నేలకి నిచ్చెన వేసి ముందుకు నడిపిస్తూ ధర్మం, న్యాయం, కృషి, శ్రద్ధ అనే దారంతో ఒడిసిపట్టి వెనుకకు లాగుతూ ముందుకు వదులుతూ ఉంటాడు. ఆ రక్షకుడి చేతుల్లో మనముండగా రోజూ సంక్రాంతి పండగే! మన జీవితాలన్నీ స్వేచ్ఛగా ఎగిరే ఆ గాలిపటాలే!

నమస్తే!

భారతీలక్ష్మి
సైనిక్ పురి

# నూటపదహార్లు కందాల్లో
# సుందరకాండ



పాలెపు బుచ్చిరాజు

## మనవి

వాల్మీకి రామాయణం మహోత్కృష్టమైన కావ్యం. ఎవరె న్నిసార్లు రాసినా ఇంతకంటే ఎక్కువగా ఏం చెప్పగలరు? యావద్భారత దేశంలో ఎన్నో భాషల్లో ఎందరో మహానుభావులు రచించి, చదివి, విని ధన్యులయ్యారు. ఉత్తర భారత దేశంలో గోస్వామి తులసీదాసు రచించిన "రామచరితమానస్" కి ఉన్న ప్రాచుర్యం మరి దేనికీ లేదు. అఖండ రామాయణ పారాయణం, సుందర కాండ పారాయణం, హనుమాన్ చాలీసా ప్రతి రోజూ ఎక్కడో ఒక దగ్గర వినిపిస్తూనే ఉంటాయి. తెలుగులో కూడా వెయ్యేళ్ళుగా వేలాది భక్తులు రామాయణాన్ని రాసి, చదివి, విని తరించారు.

రామాయణంలో రాముడి తరవాత విశిష్టమైన పాత్ర హనుమది. స్వామి భక్తికి, కార్య దీక్షకి, బుద్ధికుశలతకి కొలమానంగా చిత్రించాడు వాల్మీకి. అసలు రామాయణంలో సుందర కాండ ప్రత్యేకంగా హనుమ కోసమే సృష్టించ బడింది అనిపిస్తుంది. సీతాన్వేషణలో హనుమ చేసిన అద్భుత కార్యాలకి అబ్బురపడి శ్రీరాముడు "నువ్వు నా తమ్ముడు భరతుని వంటి వాడవ"ని ఆప్యాయంగా కౌగలించుకున్నాడు. భక్తి తత్వానికి ఉదాహరణగా రచించ బడింది కనుకనే సుందర కాండ ప్రత్యేకంగా పారాయణకి నోచుకుంది.

నాటి రామదాసు, త్యాగరాజు నుంచి, నేటి ఎం. ఎస్. రామారావుగారి వరకు ఎందరో మహానుభావులు శ్రీరామ హనుమలను కీర్తించడం ద్వారా ధన్యులయ్యారు.

వారిని స్ఫూర్తిగా తీసుకుని 'వంద కందాల్లో సుందర కాండ' రాద్దామనే ప్రయత్నం చేశాను. 'అష్టోత్తర శతం' దాటినా హనుమంతుని తోకలా పెరుగుతూ పోయింది. ఆఖరికి 'నూటపదహార్లు' తో పూర్తి చేయ గలిగాను. చదువరులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

ఆఖర్న అనుబంధంగా "పురజన గీత" గా పద్దెనిమిది కందాలు చేర్చాను. పట్టాభిషేకం తరవాత శ్రీరాముడు తమ్ముల్ని, మంత్రుల్ని, సామంతుల్ని, సైన్యాన్ని ఉద్దేశంచి ఎవరెలా మసలుకోవాలో మాట్లాడాక, పుర ప్రజల్ని కూడా పిలిపించి వారికి భక్తి తత్త్వం బోధిస్తాడు. ఆ కారణంగానే దీనికి 'పురజన గీత' అని పేరు. తులసీ రామాయణం ఆధారంగా రాసిన పద్యాలు.

బరోడా

పాలెపు బుచ్చిరాజు

17) ఇది జరిగి నేటికి యగును
పదిమాసములు కపులార పట్టుడు లంకన్
వదలడు రావణుడు చెనటి
మదిలో సందేహమేల మాతను గావన్

17) నేను చెప్పిన ఉదంతం జరిగి సుమారు పది నెలలు కావస్తోంది. మీరింక తిన్నగా లంకకే వెళ్ళండి. దు-ర్మార్గుడు రావణుడు ఆ మాతను ఒకంతటట విడిచి పెట్టడు.

*18)* రావణుడు సీత నెత్తుక
పోవుట చూచెను మదీయ పుత్రుడు హనుమా
కావుడని యరచు మహిళను
ఆవంతయు వినని నీచు డారా యనియెన్

18) సీతనెత్తుకు పోయిన వాడు రావణుడే అన్నవిషయం నా కుమారుడు కూడా దక్షిణ సముద్రపు ఒడ్డున చూశాడు. సీత "రక్షించండి. రక్షించండి" అని అరుస్తున్నా లెక్కచేయక వాడు లంకా నగరం వైపుగా ఆకాశమార్గాన ఎగిరిపోయాడు.

19) ఆ రావణు పురముండును
పారావారము నడుమన బాగుగ వినుడీ
ఆ రాజ నగరు జేరును
నూరామడలెవడు దూక నోపునొ వాడే

19) నా దృష్టి చాలా నిశితమైనది. ఎంత దూరమైనా చూడగలను.ఆ లంకా నగరం సముద్రం మధ్యన ఉంది. అక్కడికి చేరడం అంత తేలిక కాదు. నూరామడల దూరం ఏకబిగిన ఎవరు ఎగుర గలరో వారే అక్కడికి చేరుకోగ-లరు. మీకు శుభమగు గాక! " అని దీవించింది ఆ పక్షి..

20) అంతయు విన్న కపులకునొ
కింతగ నుత్సాహము కలిగె నపుడె వెడలన్
అంతలొ ఖేదము కలిగెను
అంతటి సాహసము చేయ అందరి కనువే

20) సంపాతి మాటలు విన్న కపిసేనలో చాలా ఉత్సాహం వచ్చింది. సీతా ఎక్కడ ఉందో తెలిసింది గదా అని గంతులు వేశారు. కాని అంతలోనే నిరుత్సాహం వారిని కమ్మివేసింది. మనలో అంత సాహసం చేయగల ధీరుడు ఎవరు? అని తర్కించుకోసాగారు.

21) అందరు మహేంద్రగిరిపై
సందేహములు వెలిబుచ్చ సాగిరి ముందున్
చందము తెలుపగ నొక్కడు
బంధువు గలడు మనలోన భయపడ నేలన్

21) అలా ఆలోచనల్లో గడుపుతూ వారు దక్షిణ సముద్రపు ఒడ్డున ఉన్న మహేంద్ర పర్వతం చేరుకున్నారు. ఏం చేయాలి? ఎలా చేయాలి? లంకకు ఎలా వెళ్ళగలం? అనే చింత వారిని బాధించసాగింది. ఒకడు "నేను సగం దూరం వరకే ఎగర గలను అన్నాడు" . మరొకడు "నేను వెళ్ళగలను కాని తిరిగి రాలేను" అన్నాడు. ఆఖరికి, మనందరిలోనూ పెద్దవాడు, అనుభవజ్ఞుడు తెలివైనవాడు అయిన జాంబవంతుడు ఉన్నాడు. ఆయననే ఉపాయం అడుగుదాం అని కూడ బలుక్కుని జాంబవంతుడిని అడిగారు.

22) ) అని జాంబవంతు నడిగిరి
మన హనుమంతుడు వలంతి మానుడు చింతన్
తనబలమె తనకు తెలియదు
మనమంత కలిసి హనుమను మంత్రించ వలెన్

22) అప్పుడు జాంబవంతుడు, వారితో అన్నాడు. "నాయనలారా! దీనికి మీరంత చింతించ వలసిన పని లేదు. అంతటి మహా వీరుడు మన మధ్యలోనే ఉన్నాడు. కాని విచిత్రం ఏమిటంటే, ఆయనకు తన బలమే తనకు తెలియదు. మనంతా కలిసి హనుమంతుని 'నీ అంతటి వీరుడు లేడ'ని పొగిడితే, ఆ ఉత్సాహంతో, ఆయన ఈ కార్యాన్ని అవలీలగా సాధించ గలడు."

23) అనిపలికె వృద్ధ వీరుడు
వనచరు లందరు హనుమను బాగుగ పొగడన్
కనమెందును నీయంతటి
ఘనమగు వీరుని మహీజ కనుగొని రమ్మా!

23) ఇంకేముంది? కపులంతా హనుమంతుని చుట్టూ చేరి భజన మొదలుపెట్టారు. "నువ్వొక్కడివే సీతామాతను చూసిరాగలవు. వెంటనే బయల్దేరు" అని తొందరపెట్టారు.

24) లెంకవు రాముని ప్రియుడవు
లంకకు పోగలవు నీవులంఘించుమిదే
ఇంకను జాప్యము చేయకు
జంకిన సుగ్రీవునాజ్ఞ జరుగునె హనుమా!

24) "నువ్వు రాముడి బంటువి. నువ్వంటే ఆయనకి చాలా ఇష్టం. ఆయన ఆశీర్వాదం పొందిన వాడివి నువ్వు సాధించలేనిది ఏదీ లేదు. ఇంక ఆలస్యం చేయవద్దు. మన మహారాజు సుగ్రీవుడు ఇచ్చిన గడువు కూడా దాటి పోయింది. నువ్వు తప్ప మా ప్రాణాలు ఎవరు కాపాడగలరు?" అని వేడుకున్నారుసహాయం చేయగలను.

(సశేషము)

# గ్రీసు దేశపు పురాణ గాథలు



## వేమూరి వేంకటేశ్వరరావు

"Knowledge is acquired when we succeed in fitting a new experience into the system of concepts based upon our old experiences. Understanding comes when we liberate ourselves from the old and so make possible a direct, unmediated contact with the new, the mystery, moment by moment, of our existence."
Aldus Huxley. "Knowledge and Understanding"

## ముందు మాట

నేను ఈ వ్యాసాలు రాయడానికి ప్రేరణ కారణం ఒక విమాన ప్రయాణం. భారత దేశం వెళుతూ, శేన్ ఫ్రాన్సిస్కో లో ఉదయం 8 గంటలకి బయలుదేరి, నూ అర్క్ చేరునేసరికి సాయంత్రం అయిదు అయింది. పరుగుబాట మీదకి దిగడానికి విమానం సంసిద్ధం అవుతూ ఉండగా, "మనం దిగబోయే పరుగుబాట మీద మరొక విమానం ఉంది. కంట్రోలు టవర్ లో ప్రజలు నిద్రపోతున్నట్లు ఉన్నారు. మరో చుట్టు తిరిగి వస్తాను. అరగంట సేపు ఓపిక పట్టండి," అని చోదకుడు విమానం జోరు పెంచుతూ పైకి లేచేసరికి ఇహ చేసేది ఏమీ లేకపోవడంతో నా కుర్చీకి ఎదురుగా ఉన్న టి.వి. లో ఏదైనా "ఇరవై నిమిషాల కార్యక్రమం" చూద్దామని వెతకడం ఉపక్రమించేను. "అపస్వరం అనే ఏపిల్ పండు కథ" ట. పదిహేను నిముషాలు ట. చూడడం మొదలు పెట్టేను.
పురాతన గ్రీసు దేశపు కథ. ఇంతకు పూర్వం నేనెప్పుడూ ఈ కథ గురించి వినలేదు. ఆసక్తితో చూసేను. గమ్యం చేరుకోగానే గూగుల్ లో వెతికేను. చాల ప్రాచుర్యం ఉన్న కథ. మా అమ్మాయిని అడిగితే, "చిన్నప్పుడు హైస్కూల్ లో చదివేను" అని చెప్పింది. నేను పుస్తకాల పురుగుని అయినా ఈ కథ నా కళ్ళ పడడానికి ఎనభై ఏళ్ళు పట్టిందంటే ఈ కథని వినని వాళ్ళు ఇంకా ఎంతమంది ఉంటారో అని-పించింది. ఈ కథ గురించి పరిశోధన చేస్తూ ఉంటే ఆసక్తికరమైన అంశాలు ఎన్నో తెలుసుకున్నాను. వాటన్నిటిని క్రోడీకరించి వ్యాసాలుగా రాసేను.
ఇక్కడ ఉటంకించిన అంశాలన్నిటినీ కేవలం ఒక నఖచిత్రంలా స్పర్శించినా ఇది పెద్ద గ్రంథం అవుతుంది. అందుకని కొన్ని ముఖ్యమైన అంశాలని మాత్రమే ముచ్చటించేను.

వేమూరి వేంకటేశ్వరరావు
ప్లెజంటన్, కేలిఫోర్నియా

# 6. అపస్వరం అనే ఏపిల్ పండు కథ

గ్రీసు దేశపు పురాణ గాథలలో ఒక కథ ఇది. ప్రస్తుతం టర్కీ దేశం ఆక్రమించిన ప్రాంతాన్ని పూర్వం ఏసియా మైనర్ అనేవారు. ఈ ప్రాంతపు ఈశాన్య మూలకి ట్రోయ్ అనే నగరం ఉండేది. గర్భవతిగా ఉన్న ఈ నగరపు రాణి హెకూబా (Hecuba) ఒక రాత్రి ఒక వింతైన జ్వాలని ప్రసవించినట్లు కలని కన్నది. రాజు ఆస్థాన జ్యోతిష్కుడిని పిలిపించి కలకి అర్థం చెప్పమని అడిగేరు.

"రాజా! రాణి వారు ప్రసవించబోయే బాలుడు ట్రోయ్ నగరపు వినాశనానికి కారకుడు అవుతాడు! ఈ రాజ్యాన్ని, ప్రజలని రక్షించుకోవాలంటే ఈ బాలుడిని హతమార్చవలసిందే" అని జోశ్యంతో పాటు సలహా కూడా చెప్పేడు.

భూపతనమైన వెంటనే బాలుడిని హతమార్చమని భటుడికి ఆదేశం ఇచ్చేడు రాజు. ముక్కుపచ్చలారని పసికందు ప్రాణాలు తియ్యలేక భటుడు ఆ పసికూనని ఇడా (Ida) పర్వతం మీద ఒక చెట్టు కింద వదిలేసి వెళ్ళిపోయాడు. ఆ పసి కందుని ఒక ఎలుగుబంటి చూసింది. పాపని చూసి, జాలిపడిందో




ఏమో రాత్రల్లా కాపలా కాసింది. మరునాడు బాలుడు ఏమయ్యాడో చూద్దామని భటుడు తిరిగి వచ్చేడు. ఆ బాలుడు ప్రాణాలతో కనిపించేసరికి "ఈ బాలుడు భవిష్యత్తులో ఏదో సాధించవలసి ఉంది. అందుకనే ప్రాణాలతో బయట పడ్డాడు" అనుకుంటూ ఆ పసివాడిని రహస్యంగా తన ఇంటికి తీసుకెళ్లి పెంచుకున్నాడు. శుక్లపక్ష చంద్రుడిలా పెరిగిన పేరిస్ (Paris) స్ఫురద్రూపి, సత్యసంధుడు, శీలవంతుడుగా ముల్లోకాలలోను పేరు తెచ్చుకున్నాడు.




పందేలలో పోటీకని పేరిస్ కోడె దూడలని పెంచేవాడు. పందెంలో తన గిత్తని ఎవ్వరి గిత్త ఓడగొడితే వారికి బంగారు కిరీటం బహుమానంగా ఇస్తానని పేరిస్ ఒక సారి సవాలు విసిరేడు. స్వర్గలోకంలో ఉన్న ఆరీస్ (Ares) ఈ సవాలు విన్నాడు. తానే స్వయంగా ఒక గిత్త రూపం దాల్చి పోటీలోకి దిగేడు. యుద్ధాలకి అధినేత అయిన ఆరిస్ ఈ పోటీని అనాయాసంగా గెలిచేడు. పేరిస్ పెద్దమనిషి తరహాలో ఓటమిని అంగీకరించి ఆరిస్ కి బంగారు కిరీటాన్ని బహూకరించేడు. ఈ సంఘటనతో "సత్యసంధుడు, మాట తప్పని పెద్దమనిషి" అని పేరిస్ భూమి మీద, స్వర్గంలోనూ పేరు ప్రతిష్ఠలు తెచ్చుకున్నాడు. ఇలాంటి పేరు రావడంతో ఒక

అనూహ్యమైన పందేనికి పేరిస్ ఎలా న్యాయనిర్ణేత అయేడో చూద్దాం.

స్వర్గానికి అధినేత జూస్ భార్యలలో ఒకరైన థేమిస్ (Themis) జూస్ కొడుకులలో ఒకడు జూస్ ని పదవీభ్రష్టుడిని చేస్తాడని జోశ్యం చెప్పింది. ఈ జోశ్యం ఇలా ఉండగా జూస్ ఒక రోజు సముద్రపుటొడ్డుకి విహారానికని వెళ్లి, అక్కడ తేటిస్ (Thetis) అనే ఎలనాగ ని చూసి, మనసు పడి, గాంధర్వ విధిని పెళ్లి చేసుకుంటానంటాడు. అప్పుడు తేటిస్ కి పుట్టబోయే కొడుకు తండ్రిని మించిన వాడు అవుతాడు అని మరొకరు జోశ్యం చెప్పేరు. జూస్ రెండు, రెండు కలిపితే నాలుగు అని లెక్క వేసుకుని, పెద్ద ఎత్తున కంగారు పడి, తేటిస్ ని పీలియస్ (Peleus) అనే ముసలి మానవుడికి ఇచ్చి పెళ్లి చెయ్యడానికి తాంబూలాలు ఇప్పించేసేడు. విందుకి జూస్ అందరినీ ఆహ్వానించేడు - కలహభోజని అని పేరు తెచ్చుకున్న ఒక్క ఏరీస్ (Eris) ని తప్ప!

తనకి ఈ విధంగా జరిగిన అవమానానికి ఏరీస్ కోపోద్రేకురాలు అయింది. అసహనంతో రగులుతున్న ఏరీస్ అతిథులు







బారులు తీర్చి భోజనాలు చేస్తున్న మందిరానికి గాలివానలా దూసుకు వచ్చింది. ఆమె లోపలికి రాకుండా హెర్మీస్ అటకాయించి అగ్గి మీద గుగ్గిలం జల్లేడు. ఏరీస్ బయట నుండే "ఇదే నా పెండ్లి కానుక" అంటూ ఒక బంగారు ఏపిల్ పండుని అతిథుల మధ్యకి విసిరింది. ఆ బంగారు ఏపిల్ పండు మీద "ఇది ముల్లోకాలలోను అందమైన ఆడదానికి మాత్రమే" అని రాసి ఉంది. ఇంకేముంది. "ఆ పండు నాదే!" అంటూ అక్కడ ఉన్న దేవతలంతా ఎగబడ్డారు. ఆ దొమ్మీలో హేరా, ఎతీనా, ఏఫ్రొడీటి అనే ముగ్గురు దేవతలు ఆ పండుని స్వాధీన పరచుకుందుకి పోటీ పడ్డారు. హేరా సాక్షాత్తు జూస్ భార్య. పైపెచ్చు పట్టమహిషి. ఈమె స్త్రీలకి, వివాహ జీవితాలకి అధినేత్రి. ఎతీనా విద్యలకి అధినేత్రి. ఏఫ్రొడీటి అందాలకి దేవత.

ఈ ముగ్గురిలోను పండు ఎవ్వరికి చెందాలి? ముగ్గురూ దేవతలకి రాజైన జూస్ ని తీర్పు చెప్పమన్నారు! జూస్ కి పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టు అయింది. ఎవరి పక్షాన్న తీర్పు చెబితే ఎవ్వరికి కోపం వస్తుందో! వారిలో ఒకామె తన భార్య కూడా!

"ఈ సమస్యని న్యాయబద్ధంగా పరిష్కరించగలిగే స్థోమత

భూలోకంలో ఉన్న ఒక్క పేరిస్ కి తప్ప మరెవ్వరికీలేదు" అంటూ తన కొడుకు హెర్మీస్ ని తోడు ఇచ్చి అందరిని భూలోకంలో ఇడా పర్వతం మీద ఉన్న పేరిస్ దగ్గరకి పంపి ఇబ్బంది నుండి తప్పుకున్నాడు జూస్!

సాక్షాత్తు స్వర్గలోకానికి అధిపతి అయిన జూస్ తనయుడు హెర్మీస్ స్వయంగా వచ్చి అడుగుతూ ఉంటే పశువులని కాసుకుంటూన్న పేరిస్ కాదనలేకపోయేడు.

దేవతల ముందు నిలబడి ముగ్గురిని పరకాయించి చూస్తున్నాడు.

దేవతలు ముగ్గురూ ఎలాగో ఒకలాగ పేరిస్ ని మభ్యపెట్టి




తీర్పు తమవైపు వచ్చేలా ప్రయత్నిస్తున్నారు.

"నన్ను ఎంపిక చేస్తే నిన్ను ఐరోపాకీ, ఆసియా మైనరుకి చక్రవర్తిని చేస్తాను," అని ఆశ పెట్టింది హేరా.

ఎతీనా ముందుకి వచ్చి, "నీకు విద్యాబుద్ధులు ప్రసాదిస్తాను. యుద్ధరంగంలో తిరుగులేని అస్త్రాలు ఇస్తాను," అని ఎర చూపించింది.

చిట్టచివరికి తన కురులని సుగంధం వెదజల్లే పువ్వులతో అలంకరించుకున్న ఏఫ్రొడీటి ముందుకి వచ్చి, "పేరిస్ ! నువ్వు నన్ను ఎన్నుకున్నావంటే నీకు మరపురాని అనుభవాన్ని ప్రసాదిస్తాను. స్త్రీ యొక్క ప్రేమ ఎలా ఉంటుందో చవి చూపిస్తాను. స్పార్టా రాణి హెలెన్ ని మించిన అందగత్తె ఈ భూలోకంలో లేదు. ఆమె పొందు నీకు దక్కేలా వరం ఇస్తాను. ఆమె నీ సందిట బందీ అయేలా చేస్తాను.ఏమంటావు?"

హెలెన్ అసాధారణమైన అందగత్తె. ఆమె చేతి కోసం ఎందరో యువకులు ఉవ్విళ్ళూరేవారు. శూరులు, వీరులు, మేధావులు, ఒకరేమిటి? ఎవరిని ఎన్నుకుంటే ఎవరికీ కోపం వస్తుందో? హెలెన్ ని వరించడానికి వచ్చిన యువరాజులందరి దగ్గర స్పార్టా రాజైన మెనలావూస్ (Menelaus) ఒక హామీ తీసుకున్నాడు. భవిష్యత్తులో ఈ కొత్త దంపతులకి ఏ ఆపద వచ్చినా అందరూ సైన్యసమేతంగా వచ్చి హెలెన్ ని రక్షించాలి. అందరూ ఒప్పుకున్నారు. అప్పుడు హెలెన్ పెంపుడు తండ్రి తిందారియస్ (Tyndareus) మెనలావూస్ ని హెలెన్ భర్తగా ఎంపిక చేసేడు. (తిందారియస్ భార్య లేడాకి జూస్ ద్వారా పుట్టిన కూతురు హెలెన్!)

ఇలా పెళ్ళి అయిపోయి, కాపురం చేస్తున్న హెలెన్ పేరిస్ ని ప్రేమించేలా చేస్తుంది ఏఫ్రొడీటి. ఈ సంఘటన మహాభారత యుద్ధాన్ని పోలిన మహాసంగ్రామానికి దారి తీసింది. గ్రీకులకి, ట్రాయ్ నగరానికి మధ్య జరిగిన ఈ భీకర పోరాటాన్ని హోమర్ అనే రచయిత తన ఇలియాడ్, ఆడెస్సీ అనే ఉద్గ్రంథాలలో పొందుపరచేడు. ఈ కథలో కొన్ని పాత్రలు భువి నుండి దివికి, దివి నుండి భువికి సునాయాసంగా తిరుగుతూ ఉంటారు.

దేవతలు పోటీ పడి, పందెం కట్టి, దాని పర్యవసానంగా భూమి మీద లక్షలాది ప్రజలు నాశనం అవడానికి కారణభూతులు అవుతారు.

# ప్రేమంటే ఇంతే

(గతసంచికతరువాయి)



ఇంద్రగంటి వేంకట సుబ్బారావు

"నాకు తెలుసు మీరు చాలా బిజీ, ఈ పెళ్ళి భారం అంతా మీ భుజస్కందాల మీద వుంది, అయినా ఈ దీనురాలిని కరుణించి కాస్త అపాయింట్‌మెంట్ ఇవ్వండి" అని దీనంగా మొహం పెట్టి అడిగింది అనూరాధ. అది చూసి కృష్ణమోహన్‌తో సహా అందరూ నవ్వుకున్నారు.

"అనవసరంగా నన్ను మునగ చెట్టు ఎక్కించకు" నవ్వుతూ అన్నాడు కృష్ణమోహన్. వీళ్ళంతా నవ్వుతూ మాట్లాడుకోవడం దూరంనుండి చూసిన రుక్మిణి "హమ్మయ్య, ఈయన మూడ్ మారినట్లుంది" అనుకుంది.

ఇంతలో రాజేశ్వరరావుని, కవితని పార్వతమ్మగారు పిలుస్తున్నారని కబురు రావడంతో వాళ్ళిద్దరూ అక్కడనుండి లోపలికి వెళ్ళారు. అనూరాధ, కృష్ణమోహన్ ఒంటరిగా మిగిలారు. "పిల్లలిద్దరూ విశాఖలో వస్తున్నారు స్టేషన్‌కి వెళ్ళాలి, నువ్వు వస్తావా?" అని అడిగింది అనూరాధ.

"వద్దులే మీ అన్నయ్య, నువ్వు వెళ్ళండి" అన్నాడు కృష్ణమోహన్ తప్పించుకుంటూ.

"నువ్వు నిజంగా డాష్" అంది అనూరాధ నిరుత్సాహంతో.

"ఆ "డాష్" కి అర్థం 'పలాయనవాదివి' అని నాకు తెలుసు, ఆ విషయం నీకు 23 సంవత్సరాల క్రిందటే అర్థమయిందికదా. రాధా, ఇక్కడ మనిద్దరి గురించి తెలిసినవాళ్ళు చాలామంది వున్నారు, అందుకని మనిద్దరం ఇపుడు కలిసి కారులో వెళ్ళాము అనుకో చాలా కహానీలు పుడతాయి. అందుకనే మిమ్మల్ని వెళ్ళమన్నాను, నువ్వు నిరుత్సాహపడకు నువ్వు వైజాగ్ నుండి వెళ్ళే లోపల నీతో ప్రత్యేకంగా కొంత సమయం గడుపుతాను, కానీ ఇప్పుడు కాదు సరేనా" అన్నాడు కృష్ణమోహన్.

"అదేమిటి కృష్ణా మనిద్దరమూ కలిసి వెళ్ళడం తప్పా? నువ్వేమిటి ఇలా మాట్లాడుతున్నావు? బెంగాల్‌లో పుట్టినందుకు ఎంతో అభ్యుదయ భావాలతో వుండేవాడివి, ఇప్పుడేమిటి ఇలాంటి చిన్న విషయాల గురించి తీవ్రంగా ఆలోచించి భిన్నంగా మాట్లాడుతున్నావు, ఈ మార్పు నీలో ఎందుకొచ్చింది" అని ఆశ్చర్యపోతూ అడిగింది అనూరాధ.

"లేదు రాధా, నాలో మార్పు వచ్చినట్లు నీకు అనిపించవచ్చు కానీ నా దృక్పథంలో మార్పులేదు, కాకపోతే ఇలాంటి చిన్న చిన్న విషయాలు రేపు చిలికి చిలికి గాలి వానగా మారకుండా జాగ్రత్త తీసుకుంటున్నాను. ఎందుకంటే 'ఈ సంఘంలో ప్రతి ఒక్కరూ తాము తప్ప మిగతా వారందరినీ అవినీతిపరులుగానూ, తప్పు చేసిన వాళ్ళుగానూ భావిస్తారు. ఎదటివాడు ఇబ్బందులలోనో, కష్టాలలోనో వుంటే చూసి ఆనందిస్తారు తప్ప, చేయూతనివ్వరు'... ఈ జీవితం ఎన్నో పాఠాలను నేర్పింది, నా వల్ల ఎటువంటి నిందలు నీ మీద పడకూడదు, అది నేను భరించలేను. అదీగాక ఆ నిందల ప్రభావం మన పిల్లల మీద కూడ చూపిస్తుంది అది వారి భవిష్యత్తుని ఇబ్బందులలోకి నెట్టకూడదు, ఆ ఉద్దేశ్యంతోనే అలా మాట్లాడాను. దయచేసి నన్ను అర్థం చేసుకో" అని తన మనసులోని భావాన్ని వివరించాడు.

"అవును నువ్వు చెప్పింది నిజమే. నీ మాట నేను ఎప్పుడు కాదన్నాను, నీ మాట నాకు శాసనమని అది నాకు శిరోధార్యమనిపాతికసంవత్సరాల క్రితమే చెప్పాను, నువ్వు చెప్పినట్లే అన్నయ్యతో వెళతాను" నిన్నటి పరిస్థితి నుండి కృష్ణ బాగానే కోలుకున్నాడు అని మనసులో అనుకొంది అనూరాధ.

ఇంతలో సుప్రియ వచ్చి "నాన్నగారూ, నరహరి తాతగారు మీరు కనపడలేదని ఆయన సిగ్నేచర్ ట్యూన్ మొదలు పెట్టారు" అంది.

(42 వ పేజీ చూడండి)

# సినిమా



నండూరి సరోజాదేవి

*ఇక వీనుల విందైన, సంగీత ప్రాధాన్యము కలిగిన చక్కని పాటల గురించి తెలుసుకుంటే మనస్సుకి ఆహ్లాదం,సంతోషం కలిగిస్తుంది కాబట్టి, ఇప్పటి ఆ విషయాలలోకి వెడదాము:-

ఒక 20 ఏళ్లుగా మొదలైన.."-యువ హీరో, హీరోయిన్ ల ప్రేమకథా చిత్రాలు, మధ్య మధ్యలో నటనా-అనుభవం వున్న సీనియర్ నటులు నటించిన, మంచి కథాంశం వున్న చిత్రాలూ ఇప్పటి వరకూవస్తూండడం" ప్రేక్షకులు అందరికీ తెలుసున్నదే!

అలాగే, కాలానుగుణంగా మారుతున్న 'ఈ కాలపు సినిమా సంగీతం' గురించి ఆలోచిస్తే.. పాటలు వినగానే చాల వరకు బావుండడమేగాకా, అవి కొన్ని కొన్ని మంచి భావాన్ని కూడా కలిగి వుంటు చక్కని మ్యూజిక్ అందివ్వబడుతోందనుకునేలా వున్నాయనే చెప్పాలీ!

అయితే, ఈ నవయుగ కాలాన తెలుగు సినిమాలకు ఎక్కువ మ్యూజిక్ని అందించేవారిలో, వీరిని తప్పకుండా చెప్పుకు తీరాలి:- కీరవాణి, కీర్తి శేషులు S.P బాలసుబ్రహ్మణ్యం, దేవి శ్రీ ప్రసాద్, S.తమన్, మిక్కీ J మేయర్, R.P. పట్నాయక్, శ్రీచరణ్, కుంచె రఘు, పార్థసారథి తదితరులు.

* మహాగాయకుడు S.P బాలసుబ్రహ్మణ్యంగారు, అనంత లోకాలకు తరలి పోయి వెళ్లడం.. సినిమాలకు తీరని లోటుతో పాటు, అభిమానుల అందరి గుండెల్లో ఆరని దుఃఖాన్ని సహితం మిగిల్చిన వారవడం అన్నది కూడా ఈ సందర్భాన తప్పకుండ గుర్తుచేసుకోవలసిన అవసరం వుంది!

ఎంతో గొప్ప సంగీత ప్రావీణ్యం ఉండడమే కాదు, మంచి గీత రచయత, మ్యూజిక్ డైరెక్షన్, ఎన్నెన్నో సినిమాలలో పాత్ర పోషణ చేయడం వంటి ఎన్నెన్నో కళలకు బాలుగారు పెట్టింది పేరు అని సర్వజనులకు తెలిసున్నదే.

అలాగే సినిమాకి మాటలు, పాటలు అందించే సుప్రసిద్ధ రచయిత వెన్నెలకంటి రాజేంద్ర ప్రసాద్గారు కూడా మరణించడం అన్నది చిత్ర సీమకు ఎంతో లోటు అనే చెప్పాలి.

ఇక, సినీ గీతాల సాహిత్య రచయితల విషయాలకు వస్తే.. ముఖ్యంగా సిరివెన్నెల సీతారామ శాస్త్రి, చంద్రబోస్, రామజోగయ్య శాస్త్రి, భువన చంద్ర, తనికెళ్ళ భరణి, అనంత శ్రీరామ్, సాహితి వంటి మహామహులు ఎందరో వున్నారు అన్నది కూడా ప్రతీ ఒక్కరికీ విదితమైన విషయమే.

సినిమాలకు డైలాగ్స్ అందించే సినీ రచయితల గురించి కూడా రాయాల్సి వస్తే:- పరుచూరి బ్రదర్స్, త్రివిక్రమ్, చంద్రమౌళి, లక్ష్మి భూపాల్, తణికెళ్ల భరణి, దివాకరబాబు, మారుతీ తదితరులు అందరిని ప్రముఖంగా చెప్పుకోవాలి.

అంతేకాదు! ఇప్పటి సినిమా పాటలు వింటుంటే.. చాలా వరకూ లిరిక్స్ లో కానీ, వాటికి సంగీతాన్ని సమకూర్చడంలో కానీ రచయితలు, ఆ మ్యూజిక్ డైరెక్టర్లు కనబరచిన ప్రతిభ అద్భుతమనే చెప్పాలీ.

పాఠకులారా! అలాగే.. ఈ కొత్త పాటలకు, పూర్వకాలపు పాత పాటలకు సంబంధించి నూతనవిధాన సరళి ఒకటి మీ ముందు ఉంచే ప్రయత్నం చేయదల్చుకున్నాను. అది తప్పకుండా మీరంత గమనించి చదవగలరు.

(ఇంకా వుంది)

# మహాభారతంలో మహోన్నతమైన వ్యక్తి (దాన వీర శూర కర్ణ)

మత్స్యరాజ హరగోపాల్



పంచమవేదం, వ్యాస మహాభారతం (జయమ్)లో భిన్న వ్యక్తిత్వాలు కల్గిన వీరులను మనం చూస్తున్నాము. సూర్యపుత్రుడైన (కుంతీపుత్రుని) కర్ణుని వ్యక్తిత్వం ఉదాత్తమైనది. జననం మొదలు మరణం దాకా నవరసభరితమైన ఆయన జీవనం మనకు ఆదర్శప్రాయమైనది. అయితే ఆయన జీవిత చిత్రీకరణలో కర్ణునికి న్యాయం జరిగిందా! ఇదొక సందేహంగానే ఉండిపోయింది.

జననం : మహర్షి దుర్వాసులవారి మంత్రోపదేశంతో, కన్యకయైన కుంతీదేవి, సూర్యభగవానుని ద్వారా కర్ణునికి జన్మ నిస్తుంది. గంగానదిలో తొట్టెల్‌లో వదలిపెడ్తుంది. మాతృహృదయం తల్లడిల్లినా, సమాజానికి భయపడింది. సూతునికి ఆ తొట్టె లభించడం, సూతపుత్రునిగానే 'కర్ణుడు' పిలవబడడం - మహాభారతంలో కన్పిస్తుంది. దానికి, కర్ణుడు ఆద్యంతం బాధపడడం.

విద్య: కేవలం సూతపుత్రుడనే కారణంచేత ద్రోణాచార్యులు 'కర్ణుని' శిష్యునిగా అంగీకరించలేడు! అందువల్ల తనను 'బ్రాహ్మణునిగా' తెలిపి పరుశురాముని వద్ద విద్యాభ్యాసం చేసిన 'కర్ణుని'కి ఒకానొక సందర్భంలో గురువు క్షేమాన్ని కోరి, బాధను భరించిన ఆయనకు (కర్ణునికి) మిగిలింది గురుశాపం. తద్వారా ఆయన నేర్చుకున్న విద్య, అవసరమైన సమయంలో (యుద్ధభూమిలో) పనికిరాకపోవడం.

రంగస్థలంలో అవమానం: కురు-పాండవులు శస్త్ర విద్య ప్రదర్శనకు గురువు ద్రోణాచార్యులు రంగస్థలలంలో 'అర్జునిని' సర్వశ్రేష్ఠ ధనుర్ధరునిగా ప్రకటిస్తాడు. అందుకు సభలో నున్న 'కర్ణుడు'- పోటీ పడడానికి సిద్ధపడినా, ద్రోణాచార్యులు అంగీకరించలేదు. సభలో ఆసీనురాలైన కుంతీదేవి కుమారున్ని గుర్తుపట్టినా, ఆ విషయాన్ని గుప్తంగానే ఉంచింది తప్ప ఏం చేయలేకపోవడం, బాధాకరమైన విషయం. ఇలాంటి సమయంలో దుర్యోధనుడు సభాముఖంగా 'అంగరాజు'గా కర్ణునికి అండగా నిల్చి, కర్ణుని జీవితాంతం తనవైపున ఉంచుతాడు.

యుధిష్ఠిరుడు ఇంద్రప్రస్థంలో 'చక్రవర్తి' అయిన తర్వాత రాజసూయ యాగాన్ని నిర్వహిస్తాడు. ఆ సమయంలోనూ కుంతీదేవి కర్ణుని గుర్తించి కూడా నిస్సహాయురాలిగా ఉండిపోతుంది.

ఏనాడు కూడా 'కర్ణుడు' తన క్షాత్రధర్మాన్ని త్యజింపలేదు - అన్ని వేళలా, శకుని యొక్క కుతంత్రాలను ఒప్పుకోలేదు, తన మద్దతు ప్రకటించలేదు సరికదా ఆ కుతంత్రాల ద్వారా పాండవులను లాక్షా గృహంలో ఉంచడం, జూదమాడి రాజ్యాన్ని కైవసం చేసుకోవడం లాంటి దుష్టచేష్టలను ఖండించాడు.

ద్రౌపదీ స్వయంవర సమయంలోనూ 'కర్ణుడు' ద్రుపద మహారాజు అంగీకారంతోనే తన శస్త్ర నైపుణ్యాన్ని ప్రదర్శింపబూని, మత్స్యయంత్రాన్ని ఛేదింపబూనిన తరుణంలో, ద్రౌపది నిరసిస్తుంది. ఇది చాలా బాధాకరం. ఇక్కడ కర్ణునికి జరిగిన పరాభవం మరువ లేనిది. అందుకే ద్రౌపదీ వస్త్రాపహరణ సమయంలో ఆమెను, ఆవేశంతో 'వేశ్య'గా సంబోధించినా, తర్వాత పశ్చా-

త్తాపపడిన సంఘటనలెన్నో భారతంలో కన్పిస్తాయి. ఉదాహరణకు కురుక్షేత్ర యుద్ధం ప్రారంభం అయ్యే ముందు రోజు రాత్రి శ్రీకృష్ణుడు కర్ణుని కలుస్తాడు. 'భీష్మపితామహుడు' కురుసైన్యానికి అధిపతిగా ఉన్నాడు. ఆయన ఆధిపత్యంలో కర్ణుడు యుద్ధం చేయకూడదని భీష్ముని షరతు. కావున యుద్ధం జరిగే సమయంలో, పాండవుల శిబిరం నుండి యుద్ధాన్ని వీక్షించమని కోరుతాడు. అందుకే కర్ణుడు కృష్ణుడితో తన నిస్సహాయతని తెలుపుతూ పాండవ శిబిరంలో 'ద్రౌపదీదేవి' ఉంటుంది. ఆమెను ఒకానొక సమయంలో 'వేశ్య' అని సంబోధించడం తనను ఎప్పటికీ బాధిస్తుందని, తను చేసిన ఈ దుర్మార్గము ఎప్పుడు తనను వెంటాడుతూ సిగ్గుపడేట్లు చేస్తుందని తెలుపుతూ క్షమాపణ కోరుతాడు కర్ణుడు. పశ్చాత్తాపం ద్వారా చేసిన తప్పును ప్రక్షాళనం చేసుకుంటాడాయన.

కృష్ణ రాయబారానికి పూర్వం కర్ణుడు భీష్ముని నివాసంలో పితామహుణ్ణి కలిసిన సందర్భంలోనూ భీష్ముడు 'కర్ణునితో' కౌరవ పక్షాన నిలువకూడదనీ, తద్వారా 'అధర్మానికి' దోహదం చేయకూడదని అంటాడు. అప్పుడు కర్ణుడు నిబ్బరంగా భీష్మునితో ఆయన లాగే తాను కూడా కొన్ని నియమాలు, పరిస్థితులకు తలవొగ్గి కౌరవపక్షాన 'ఉండవలసి వస్తుందని తన నిస్సహాయతను తెలియజేస్తాడు.

ప్రతిరోజు సూర్యోదయాత్పూర్వము, కర్ణుడు - అడిగినవారికి కాదనకుండా, ఎట్టి పరిస్థితుల్లోనూ, ఏమడిగినా కాదనలేడని తెలిసిన ఇంద్రుడు, భారతయుద్ధానికి పూర్వము ఓనాటి ఉదయంవేళ బ్రాహ్మణరూపంలో 'ఇంద్రుడు' కర్ణుని దగ్గర బిక్ష (దానం) అడుగుతాడు. అంతక్రితం రాత్రి, సూర్యభగవానుడు ఈ విషయం తనతో తెలిపినా, ఏలాంటి సంకోచం లేకుండా, తన శరీరంలో భాగమైన కవచకుండలాలను ఇంద్రునికి సమర్పిస్తాడు దానకర్ణుడు.

అప్పట్లేనే శ్రీకృష్ణభగవానుడు, రాయబారం తర్వాత కర్ణునితో కలిసి ఆయన జన్మవృత్తాంతం వివరిస్తూ, పాండవపక్షాన నిలబడమని కోరుతాడు. మహారాణి కుంతీదేవి కూడా ఓనాటి ఉదయం కర్ణుని కలిసి, ఆయన జన్మవృత్తాంతాన్ని వివరిస్తూ, పాండవ పక్షాన ఉండమని, తద్వారా రాజ్యాధికారాన్ని కూడా పొంది, 'చక్రవర్తి' కాగలడని తెలిపినా, చలించని కర్ణుడు "అమ్మా.. ఎటువంటి పరిస్థితుల్లోనూ కురుక్షేత్ర సంగ్రామంలో కేవలం అర్జునుని తప్ప, మిగిలిన పాండు పుత్రులను ఎలాంటి హాని కల్గించననీ, తద్వారా అయిదుగురు పుత్రులు, నీకు మిగులుతారనీ ప్రమాణం చేస్తాడు. ఆ ప్రమాణాన్ని నిలబెట్టుకున్న ధీరుడు కర్ణుడు.

భారతయుద్ధ ప్రారంభంలో భీష్ముడు కౌరవ సర్వ సైన్యాధిపత్యాన్ని ఒప్పుకున్న తరుణంలో 'తన ఆధిపత్యంలో' కర్ణుడు యుద్ధం చేయకూడదన్న షరతు విధిస్తాడు. అందువల్ల మొదటి పదిరోజులు కర్ణుడు యుద్ధంలో పాల్గొనలేదు. పదిరోజుల కురుక్షేత్ర యుద్ధం తర్వాత భీష్ముడు 'అంపశయ్య'పై ఉన్న తరుణంలో, కర్ణుడు పితామహుని వద్దకు వెళ్ళిన సందర్భంలో కర్ణుని 'కుంతీపుత్రా' అంటూ సంబోధిస్తాడు. కర్ణుని జన్మరహస్యం భీష్మునికి కూడా తెలుసు. అయినా తన ఋణవిముక్తి కొరకు మాత్రమే కౌరవపక్షాన యుద్ధం చేస్తూ 'దుర్యోధనుని' అన్ని విధాల, తను బ్రతికి ఉన్నం-

తవరకు కాపాడుతానని, అతని-పట్ల 'నిష్ఠ' వల్ల మాత్రం కాదని ని-ప్పులాంటి నిజాన్ని పలుకుతాడు. అందుకే ఏనాడు కూడా 'కర్ణుడు' శకుని కుటిలనీతిని సమర్థించలే-దు సరికదా తన విరోధాన్ని నిర్భ-యంగా తెలియజేశాడు.

రాజనీతిజ్ఞునిగా, యోధునిగా ద్రోణుడు కూడా కర్ణుని గుర్తిం-చిన సందర్భాలెన్నో మనకు భారతంలో కన్పిస్తాయి. ద్రోణా-చార్యుల సైన్యాధిపత్యంతో, 13వ రోజు కర్ణుడు భీముని ఓడిస్తాడు. ఆ సందర్భంలో సునాయాసంగా భీముని వధింపవచ్చు. కానీ తన తల్లి 'కుంతీదేవి'కిచ్చిన మాట ప్రకారం చేజిక్కిన 'భీముని' వది-లివేస్తాడు కర్ణుడు. 15వ రోజు ద్రో-ణపర్వం ముగుస్తుంది - కర్ణుడు కౌరవసేన అధిపతిగా, దుర్యోధ-నుడు నియమిస్తాడు. ఆ రాత్రి భీ-ష్మపితామహుణ్ణి మళ్ళీ కలుస్తాడు కర్ణుడు - ఆయన నుండి ఆశీ-ర్వాదం పొందుతాడు. ఇదీ కర్ణుని గొప్పతనం. తనకంటే పెద్దవారు, కొన్నిసార్లు తనకు అవమానించి-నా, వారిని ఏనాడు తూలనాడలే-దు. సరికదా వారికి తగిన గౌరవం ఇచ్చాడు.

మహాభారత సంగ్రామంలో 16వ రోజు అర్జునునితో ముఖాముఖి యుద్ధం సాగుతుంది. చివరకు అర్జునుడు పూర్తిగా ఓడిపోయే పరిస్థితిలో, సులభంగా 'కర్ణుడి' విజేతగా నిలువగలిగిన సం-దర్భంలోనూ, సూర్యాస్తమా-నమవుతున్నదనే నెపంతో అర్జునుని చంపకుండా వదలి-వేస్తాడు. దుర్యోధనుడు 'కర్ణుని' శంకించిన పరిస్థితిలోనూ, తన నిబద్ధతను, మనోనిగ్రహాన్ని వి-డనాడడు. తను బ్రతికున్నంత-వరకు 'దుర్యోధనుని'కి ఎలాంటి ముప్పురాకుండా అహర్నిశలు కాపాడి తన ఋణాన్ని తీర్చుకు-న్న మహామనీషి కర్ణుడు. 17వ రోజు యుద్ధంలో కర్ణుని రథం నేలలో కుంగుతుంది. సారథి 'శల్యుడు' సూటిపోటి మాటలతో అవమానిస్తాడు. 'గురు' పరు-శురాముని శాపంవల్ల దివ్యాస్త్రా-లన్నీ కర్ణుని అందుబాటులోకి రావు. అలాంటి విపత్కార పరి-స్థితులను ఆసరాగా చేసుకొని, అర్జునుడు 'మహావీర' కర్ణుని చంపుతాడు. అందువల్ల జననం నుండి మరణంవరకు తన తప్పు-లేకున్నా, పరాభావులను ఎదుర్కొ-న్న ధీరుడు కర్ణుడు - ధీరుడిగా వాటిని ఎదుర్కొన్నాడు తప్ప, ఏనాడు కృంగిపోలేదు. అలాంటి స్థితప్రజ్ఞుడు కర్ణుడు. జీవితాంతం సూతపుత్రునిగానే మిగిలిపో-యాడు. తప్ప నిజం తెలిసిన తర్వాత కూడా 'రాజ్యాధికారం కొరకు' కుంతీపుత్రునిగా చెప్పుకో-లేదు. కురుక్షేత్ర యుద్ధంలో 17వ రోజు యుధిష్ఠిరుడు (ధర్మరాజు), నకులుడు ఆయా సందర్భం-లో కర్ణుని ఎదుర్కొని ఓడిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. చేతికి చిక్కిన వీరిని సులభంగా వధించే అవకాశం కల్గినా, తల్లి కుంతీదే-వికిచ్చిన మాట ప్రకారము, వారిని చంపకుండా వదిలివేస్తాడు - 16వ నాటి యుద్ధంలో అర్జు-నుడు చేతికి చిక్కిన పరిస్థితు-ల్లో చంపకుండా వదిలివేస్తాడు. 17వ రోజు ఉదయం కుంతీదేవి యుద్ధభూమిలో కర్ణుని శిబిరం-లోకి వస్తుంది. ఆ సమయం-లోనూ తన మాటగా అర్జునుని తప్ప మరే పాండవ పుత్రులను చంపనని మాట ఇచ్చి తప్పలేదు. అంతటి ఉదారస్వభావుడు, మ - న్నత వ్యక్తి కర్ణుడు. అదే 17వ రోజు విపత్కారపరిస్థితుల్లో 'కర్ణుడు' చంపబడతాడు. తల్లి కుంతీదేవి యుద్ధభూమిలో 'కర్ణుని' శవం వద్ద విలపిస్తూ, ఆయన తన జ్యేష్ఠపుత్రుడిని, పాండవులలో అగ్రజుడన్న విషయాన్ని బహిర్గ-తం చేస్తుంది. అప్పుడే ధర్మరాజు బాధతో కృద్ధుడై 'ఆడవారి నోట్లో, క్షణమాత్రం కూడా నిజం దాగ-కూడదంటు, పలికినాడని ప్రతీతి.

ఏది ఏమైనా ఒక శకం ముగుస్తుంది. అమరుడైనాడు కర్ణుడు.

మహాభారత యుద్ధానంతరం యుధిష్ఠిరుని పట్టాభిషేక సమయంలో 'దాన వీర శూర కర్ణుని' పాండుపుత్రులు అభివాదనం చేస్తారు.

భారత యుద్ధానికి పూర్వం, భీముని మనుమడైన బర్బరీకుడు తన గురువు ఆదేశానుసారం నడుచుకోవటంతో తన విచక్షణాజ్ఞానాన్ని సరిగా ఉపయోగించలేకపోయినందున, పాండుపుత్రులకు ఒక సమస్యగా మారుతాడు. కౌరవులు కూడా ఇదొక సమస్యగా భావిస్తారు. బర్బరీకుడు తన నిత్యానుష్ఠానంలో ధ్యానమగ్నుడై ఉన్న తరుణంలో, దుర్యోధనుడు బర్బరీకుని తలను నరకడానికి ప్రయత్నిస్తున్న సమయంలో 'కర్ణుడు' అడ్డుపడి, అది దుర్మార్గమైన, నిస్పష్టమైన పనిగా ఉంటుందని, దుర్యోధనునికి జ్ఞానోదయం కల్గిస్తాడు కర్ణుడు.

ముగింపు : భారతీయ ఇతిహాసాలలో వ్యాసమహర్షి రచించిన జయం (మహాభారతం), వాల్మీకి మహర్షి రచించిన శ్రీమద్రామాయణం, అతి ముఖ్యమైనవి. వాటిలో లేని విషయాలు మరెక్కడ కనబడవు. మహాభారతంలో 'కర్ణుడు' ఒక విశిష్ట వ్యక్తి. పుట్టుక మొదలు చావుదాకా ఎన్నో సమస్యలకు ఆయన ఏ మాత్రము బాధ్యుడు కాకపోయినా, సూతపుత్రునిగా పిలువబడి, అవమానాల పాలయ్యాడు. పాండవులు తన తమ్ములనీ తెలిసినా, తన తల్లి కుంతీదేవి శ్రీకృష్ణభగవానుడు, భీష్మపితామహులు ఆయా సందర్భంలో తన జన్మవృత్తాంతాన్ని తెలిసినా, తన మాటకు, మిత్రత్వానికి, కట్టుబడ్డాడే తప్ప, తన ఆశయాలను కర్తవ్యాన్ని మరువలేదు. 'కృతజ్ఞతాపూర్వకంగా' కౌరవ పక్షం వహించినా, 'నిష్ఠ' (ధర్మనిష్ఠ)ను మరువలేదు. మరి అలాంటి దాన, వీర, శూరకర్ణుని దుష్టచతుష్టంలో ఒకరిగా భావించడం, ముద్రవేయడం తగునా! మహాభారతంలో ఆయన విశిష్ఠతను మనం ఎలా చూడాలి. ఎలా అర్థం చేసుకోవాలి. విజ్ఞులైన పండితులు ఆలోచించవలసిన తరుణమిది.

ఆచార్య మత్స్యరాజ హరగోపాల్
hargopal33@yahoo.com

---

# నాన్న

నందుల గౌతమ్



నాన్న ....

కష్టం అనేది తెలియకుండా పెంచారు .
ఇష్టం అని అడిగిందల్లా ఇచ్చారు ...

మా ఇష్టాలను తీర్చడంకోసం, మీరు
కష్టపడ్డారు ..

మీ కళ్ళలో పెట్టుకొని చూసుకున్నారు ..
మీ కలల్లో కూడా మమ్మల్నే
ఊహించుకున్నారు ..

మీ ఆనందం లో ఉన్న మేము ...
మీ ఆలోచనలలోకి వెళ్ళాము ...

కనిపెంచిన మీరు ,
కనిపించకుండా వెళ్లిపోయారు ...

అంతులేని ప్రేమ చూపించారు ...
అంతుచిక్కని ప్రశ్నలాగా వెళ్లిపోయారు

ప్రాణం పోయేలా అరిచినా రారు అంటే ..
నమ్మడానికి మనసు ఒప్పుకోవట్లేదు ...
ఏడవడానికి కన్నీళ్లు చాలట్లేదు ....

మా ధైర్యం మీరు ....
మా దైవం మీరు ...

మా ఆశ మీరు ...
మా శ్వాస మీరు ...

మీరు అందించిన ప్రతి కణం ...
మీతో గడిపిన ప్రతి క్షణం ...
మాకు వరం ....

జన్మ జన్మలకు సరిపోయే ప్రేమను , ఈ 16
సంవత్సరాలలోనే చూపించారు ..

చేతులు జోడించి, తలవంచి , మీ
పాదాలను తాకుతూ ....
మీరు ఇచ్చిన ఈ జీవితం ...
మీకు అంకితం ....

# నవవిధ భక్తులు



ఆదూరి హైమవతి

## స్మరణం

బామ్మ చెప్పసాగింది. "నవ విధ భక్తి మార్గాల్లో మూడవది స్మరణ. అంటే తలంచడం, చింతించడం, జ్ఞప్తియందుంచు కోవడం. సాధారణంగా నీలాంటి పిల్లలు పరీక్షలు వస్తున్నాయంటే హనుమాన్ ఆలయానికి వెళ్ళి నమస్కరించుకుంటారు. ప్రదక్షిణలు చేస్తారు. పరీక్షలన గానే దేవుడు గుర్తు వస్తాడు.ఐతే నిరంతరం భగవన్నామాన్ని స్మరించుకుంటూ ఉంటే వేరే పరీక్షల సమయాన ప్రదక్షిణలు చేయనక్కరలేదు. స్మరణం వలన ధైర్యం వస్తుంది. మీరు ప్రశ్నలకు సమాధానాలు పరీక్షల్లో ఎలా గుర్తు తెచ్చుకుంటారో అలాగే భగవన్నామాన్ని నిరంతరం మన స్సులో స్మరించు కోడం ఒక గొప్ప అలవాటు. భాగవత కథలో ప్రహ్లాదుడు, చిన్నవాడే ఐనా నిరంతరం భగవన్నామ స్మరణ వలన తరించిన మహనీయుడు, తండ్రికి కూడా ముక్తి లభించను కారణమైనవాడు. అలాంటి ఒక బాల భక్తునికథ చెతాను విను.

అన్నవరం అనే గ్రామంలో అనంతయ్య అనే ఒక రైతు కూలీ ఉండే వాడు. అతనూ అతని భార్య భాగ్యమ్మా కష్టపడి కూలీ నాలీచేసి కొడుకు బాలాజీని చదివించేవారు. బాలాజీ వారి ఇలవేల్పు. అందుకే ఆయనపేరే కొడుక్కు పెట్టుకున్నారు. బాలాజీ అని పిలిచినపుడల్లా వారు భగవంతుడైన బాలాజీని స్మరించేవారు. బాలాజీ కూడా తల్లి, తండ్రి తనకోసం ఎలా కష్ట పడి సంపాదిస్తున్నారో, తన చదువు కోసం ఎంత కష్టపడుతున్నారో గ్రహించి మరో ఆలోచన లేకుండా చదువుకోసాగాడు.

ఐతే బాలాజీ కూడా శ్వాసక్రియ జరిగిట్లే నిరంతరం తనకు తెలీకుండానే మనస్సులో స్వామి వారి రూపాన్ని తలంచుకుంటూ, స్మరించుకుంటూ ఉండేవాడు. అతని ధ్యేయం ఒక్కటే తనకోసం కష్టపడే అమ్మానాయనల కష్టానికి ప్రతిఫలం సాధించి బాగా



చదివి వారిని సుఖపెట్టాలని.

అలా పట్టుదలతో చదువుతూ బాలాజీ, ఆ ఊర్లో చదువ య్యాక పక్క ఊరికి నడిచి వెళుతూ పదోక్లాసు ఫస్టు క్లాసు లో పాసయ్యాడు.

స్కూల్ మాస్టార్ల సాయంతో నగరంలో మంచి కళాశాలలో ఉచిత ఇంటర్ మీడియట్ విద్య లో చేరి, అక్కడి ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ పన్నెండో తరగతి ప్రథముడిగా వచ్చాడు.

ప్రభుత్వమే బాలాజీని ప్రభుత్వ కళాశాలలో చేరను వసతి కల్పించింది. బాగా చదువుకుని ప్రభుత్వ విద్యార్థి ఉపకార వేతనంతో బి ఎస్సీ డిగ్రీ, ఆ పైన మాస్టర్ డిగ్రీ ఎం ఎస్సీకూడా పూర్తయ్యే వేళకు బాలాజీ తల్లీ తండ్రీ బాగా పెద్దవారై పనిచేయలేని స్థితికి వచ్చారు.

బాలాజీ మంచి కళాశాలలో అధ్యాపకునిగా ఉద్యోగం సంపాదించి వచ్చి, అమ్మనూ నాన్ననూ తనతో నగరానికి తీసుకెళ్ళాడు.

ఊరివారేకాక, అనేక టీవీ

ఛానళ్ళ వారు అతడిని ఇంటర్వ్యూ చేయగా బాలాజీ ఒకేమాట చెప్పాడు.

'మానాయనా, అమ్మా నాకు భగవంతుడైన బాలాజీ పేరు పెట్టి నిత్యం నన్ను అనేక మార్లు 'బాలాజీ', 'బాలాజీ' అని పుర్తి పేరుతో పిలుచుకుంటూ ఆ భగవంతుని నామాన్ని పదేపదే ఉచ్చరించేవారు. నేనూ స్వామి నామాన్ని లోలోపల శ్వాసక్రియలాగా స్మరిస్తూ, ముఖ్యంగా మా అమ్మ నాన్నల కష్టాన్ని నాకోసం ఎంత కష్టపడుతున్నారో స్మరిస్తూ వారి కలలను నిజం చేయాలని తలంచేవాడిని. భగవంతుని నామాన్ని పిల్లలకు పెద్దలు ఎందుకు పెట్టుకుంటారో నాకు అర్థమైంది. ఇలా మేము ముగ్గురం ఆ స్వామి వారి నామాన్ని స్మరిస్తూ నేను మా తల్లిదండ్రుల ధ్యేయాన్ని స్మరిస్తూ ఈ రోజుకు నేను చేరవలసిన గోల్ చేరాను. కొద్ది రోజులయ్యాక కాలు నిలద్రొక్కుకుని వచ్చి ఈ ఊర్లో ఒక మంచి పాఠశాల, పొలంలో మంచి పంటలు పండించను నేను చదువుకున్న అగ్రికల్చరల్ ఎమ్మెస్సీ చదువుతో మన ఊరి పొలాల్లో బంగారం పండించి కన్న ఊరికి సేవ చేసుకుంటాను. దానికోసం ముందు ఉద్యోగంలో చేరి కొంత సొమ్ము వెనకేసుకుని మరలా నా మాతృ భూమికి చేరుతాను' అని చెప్పాడు. చూశావా! కన్న తల్లిదండ్రులనే కాక కన్న భూమికి సేవచేయాలని ఎలా నిర్ణయించుకున్నాడో! మన ధ్యేయాన్ని నిరంతరం స్మరిస్తూ భగవంతుని స్మరిస్తే తప్పక విజయం సాధించగలం . తెలిసిందా!" అంటూ ముగించింది బామ్మ.

***

---

# ప్రేమంటే ఇంతే

(35 వ పేజీ తరువాయి)

"ఏయ్ ప్రియా! ఏమిటది చిన్నా పెద్దా లేకుండా ఆ వ్యాఖ్యలేమిటి?" అని సుప్రియని మందలించాడు.

"అబ్బో! రూపంలో వాళ్ళ అమ్మని పోలినా, చురుకుతనంలోని, ఎదుటి వాళ్ళని కమ్మ కట్టడంలో నీ పోలిక బాగా వచ్చినట్లుందే ప్రియకి" అంది అనూరాధ.

"చూసావా ప్రియా, ఆంటీ నీ గురించి ఏమనుకుంటున్నారో?" కొంచెం కోపంగా అన్నాడు కృష్ణ మోహన్.

"కృష్ణా! ఏమిటది, ఇప్పుడు తను ఏం పెద్ద నేరం చేసిందని అలా మందలిస్తున్నావు. పిల్లలన్నాక హుషారుగా వుండాలి, ఎప్పుడూ నవ్వుతూ, జోక్స్ వేసుకుంటూ, ఎవరైనా వాళ్ళ మీద జోక్స్ వేస్తే స్పోర్టివ్‌గా తీసుకుంటూ వుండాలి. అంతే గాని నిస్తేజంగా ఒక మూల కూర్చుంటే ఏం బాగుంటుంది. అదీగాక ఈ వయసులోనే వాళ్ళకి ఆ స్వేచ్ఛ వుంటుంది, ఉంకో ఐదారు సంవత్సరాలు తరువాత ఎన్నో బాధ్యతలు వచ్చి ఇలా వుండమన్నా వుండలేరు. ఆమ్మా ప్రియా, నేను నీకు ఫుల్ సపోర్ట్" సుప్రియ నిరుత్సాహ పడకుండా వుండాలని అలా అంది అనూరాధ.

"థాంక్యూ ఆంటీ"

"యూజ్‌లెస్ ఫెలో! అప్పుడే ఆంటీని బుట్టలో వేసావు, పదండి లోపలికి వెళదాము" అన్నాడు కృష్ణమోహన్.

కృష్ణమోహన్ మెల్లిగా రుక్మిణి ఎక్కడ వుందో వెతుక్కుని "ఏమిటి రుక్మిణీదేవి గారు ఎక్కడా కనబడటంలేదు. బిజీగా వున్నారా? ఈ దాసుడికి ఒక కప్పు కాఫీ కొట్టిస్తారా" అని వేళాకోళంగా అడిగాడు.

"ఇక్కడికి వచ్చిన వెంటనే ఇద్దామనుకున్నాను, కానీ కారు దిగినదగ్గరనుండి శ్రీకృష్ణులవారు చాలా బిజీగా వున్నారు. అయినా మధ్యలో ఒకసారి కాఫీ ఇద్దామని బయటకు వచ్చాను, అప్పుడు అక్కడ "రాధాగోపాళం" కని పించి మధ్యలో పానకంలో పుడకలా నేనెందుకు అని వెనక్కి వచ్చేసాను" అని చమత్కారంగా సమాధానమిచ్చింది రుక్మిణి.

రుక్మిణి ప్రక్కనే వున్న కమల, సౌజన్య వీళ్ళిద్దరి మాటలూ విని ముసుముసిగా నవ్వుతున్నారు.

"బావగారు ఇవాళ డిఫరెంట్‌గాను, స్మార్ట్‌గాను కనబడుతున్నారు" అని వేళాకోళంగా అంది కమల .

కమలకి వంత పాడుతూ "అవును బావగారు ఇవాళ చాలా స్మార్ట్‌గా కనబడుతున్నారు, ఐ థింక్ దేర్ మస్ట్ బి సంథింగ్".

(ఇంకా వుంది)

# మా ఊరి నందుల ఆత్మీయ కథ



నందుల ప్రభాకర శాస్త్రి

(గత సంచిక తరువాయి)

బూడిదలో కాలిన మిరపకాయల్ని, తెల్లపాయల్ని, చింతపండును, ఉప్పును పళ్లెంలో ఒక మూలన వేసి బొటనవేలితో నలుపుతారు. ఆ నలిపేటప్పుడు పళ్లెం టకా.. టకా.. అంటూ శబ్దం చేస్తుంది. ఆ శబ్దాన్ని దరువు అంటారు. అదే 'బొటనవ్రేలి దరువు'... కూర, పచ్చడి, పప్పు, చారు, పాయసం.... అన్నీ అదే. ఇక బీగాల సాయబు కథలను ఎందుకు ఆస్వాదించరు చెప్పండి?

సంఘసేవిక బూబమ్మను గురించి కూడా చెప్పాలి. ఈమెది ఈ ఊరే అయినా అప్పుడప్పుడు వచ్చి పోతూ వుంటుంది. ఈమె వచ్చిందంటే రావి చెట్టు అరుగు నుండి పెద్దబావి మెట్ల వరకు దారి శుభ్రంగా వుంటుంది. ఈమె ఊర్లో లేకుంటే చిన్న చిన్న బావి గులక రాళ్లతో, నల్ల తుమ్మ ముళ్ళతో నిండి వుంటుంది. ఈమె ఊర్లోకి వచ్చిన మొదటి రోజు ఉదయం నాలుగు గంటల కల్లా పొరక తీసుకుని ఈ దారి మొత్తం శుభ్రంగా ఊడుస్తుంది. ఇందుకు ఎవరి నుంచీ ఏమీ ఆశించదు. బావిలో నీళ్లు తీసుకునేటప్పుడు గంగా దేవిని ప్రార్థించి తనకు కావలసిన కడవ నీళ్లు ముంచుకుపోతుంది.

బాగా వయసు ఉడిగినా ఈ పని చేస్తూ వుండేది. ఎవరైనా తమాషాకి 'నువ్వు ఇంకా బ్రతికేవున్నావా' అంటే ... అందుకు సమాధానంగా గొప్ప ఫిలాసఫీ చెప్పేది. దేవుడు మనలను పుట్టించినపుడే ... ఇంత అన్నం, ఇన్ని నీళ్లు, పీల్చడానికి ఇంత గాలీ, చెయ్యడానికి ఇంతపని ఇచ్చి పంపుతాడట. దేవుడిచ్చిన ఈ రేషన్ సక్రమంగా వాడుకుంటూ పోతే ... నిండు నూరేళ్లు బ్రతకవచ్చుట.

అలా కాకుండా ఇచ్చిన రేషన్ లో ఏ ఒక్కటి ఎక్కువగా వాడుకున్నా ... అది అయిపోతే .. అదే రోగమవుతుందట. ఉదాహరణకు.. అవసరానికి మించి తిని శరీరాన్ని పెంచుకుంటే అదే రోగమై తినడానికి తిండి లేక, వున్నా తినే అవకాశం లేక బాధపడతారట. అలాగే ఎక్కువ నిద్రపోయినా, ఎక్కువగా గాలి పీల్చినా,... నవనాగరిక ప్రపంచంలో వత్తిడి (టెన్షన్) వల్ల గాలి పీల్చుట ఎక్కువై రక్తపోటు, భయం, అభద్రతా భావం వస్తున్నాయి. నీళ్లు అవసరమైనన్ని తాగక, చల్లని గదుల్లో కూచుని చల్లటి నీళ్లు తాగితే దప్పిక తీరుతుంది కానీ శరీరానికి అవసరమైన నీళ్లు అందవు. అలాగే రాత్రి పగలు పని చేసి ఇచ్చిన 'రేషన్ పని' అయిపోతే ఆకలి, దప్పిక, నిద్ర... అన్నీ ఉంటాయి. పని చేసే సామర్థ్యం పోతుంది.

అందుకే బూబమ్మ చెప్పిన వేదాంతం - మనకు ఆ భగవంతుడిచ్చిన 'రేషన్' సరిగ్గా వాడుకుంటే నిండు నూరేళ్లు ఆరోగ్యంగా, ఆనందంగా బ్రతకవచ్చు.

## రాజకీయ నాయకులు

రాజకీయ నాయకుడనగానే ఆ రోజుల్లో గుర్తొచ్చే సామెత 'ముసిలోడైనా బసిరెడ్డి మేలు' అని.

(సశేషము)



# భాగవతులతో అనుబంధం

శ్రీ వేంకటాచార్యులు

(గత సంచిక తరువాయి)

రామానుజులు తిరుక్కురుంగుడి క్షేత్రానికి వచ్చి స్వామిని సేవించాలని వస్తే, ఆ స్వామి వడుగ నంబి రూపంలో రామానుజుల శిష్యునిగా చేరి ద్వయమంత్రాన్ని వేదసారాన్ని గ్రహించినందున 'దక్షిణ బదరి' గా గుర్తింపబడుతోంది.

ఈ క్షేత్రంలో స్వామి సన్నిధి యందు ఒక రాత్రి పూర్తిగా అక్కడే ఉంటే, రాత్రి లోకం ప్రశాంతంగా ఉండే సమయంలో, కొన్ని వింత వింత శబ్దాలు బాగా దగ్గరగా వినిపిస్తాయట. దీనికి కారణం యమధర్మరాజనగరం ఈక్షేత్రానికి చాలా దగ్గరలో ఉందని తరతరాలుగా పెద్దలు తెలియజేసే మాట. రామానుజులకు ఉభయ విభూతి నాయకత్వం కల్పించిన క్షేత్రం. శ్రీ రంగనాథుని ఆజ్ఞతో తిరుమంగై ఆళ్వార్లు ఈ క్షేత్రానికి విచ్చేసి, వీరి అనుగ్రహంతో మోక్షాన్ని పొందారు. వీరి సమాధి ఈ క్షేత్రంలో 'శిలామారు' నదీ ఒడ్డున ఉంది. ఈనాటికీ మనం దర్శించవచ్చు. అట్టి తిరుక్కురుంగుడి క్షేత్రానికి కౌశికుడు ప్రతిరోజూ తెల్లవారుఝామున అడవి మార్గం గుండా చేరి వీణ మీటుతూ దేవగానం వినిపించి స్వామిని మేలుకొలిపి, ఎవ్వరూ గుర్తించకుండా తిరిగి ఇంటికి చేరుతుండేవాడు. ఒకరోజు సమయాన్ని సరిగా గుర్తించలేక పరమాత్మ మేలుకొలుపుకు



అర్ధరాత్రి బయలుదేరి వెళ్ళాడు. పరమాత్మ ధ్యాసలో ఉండడంతో దారి తప్పి ఒక ఘోరమైన అడవిలో ప్రవేశించాడు. అక్కడ ఒక బ్రహ్మ రాక్షసుడు ఆకలి... ఆకలి అంటూ భయంకరంగా అరుస్తూ, ఇతనిని చూసి 'చాలా కాలానికి నరుడు దొరికాడు, ఇతని మాంసంతో నా ఆకలిని తీర్చుకుంటాను' అని అంటుండగా, కౌశికుడు భయపడకుండా 'ఇంతవరకూ ఈ దేహం ఈ లోకంలో అందరికీ అంటరానిది, పనికిరానిదీ అనుకున్నా. నీకు ఆహారంగా ఉపయోగపడుతుందంటే నా అదృష్టం. కొంత సమయం వేచియుండు. ప్రతిరోజూ తిరుక్కురుంగుడి పెరుమాళ్లును వీణాగానంతో మేలుకొలపడం అలవాటు. వారు నాకోసం ఎదురుచూస్తూ వుంటారు. గాన వెళ్లి మేలుకొలిపి, తిరిగి వచ్చి నీ ఆకలి తీరుస్తా. సత్యాన్ని పలుకుతున్నా' అని ప్రమాణం చేసి పెరుమాళ్ళ సన్నిధికి బయలుదేరాడు. కౌశికుని బ్రహ్మ తేజస్సు ఆ రాక్షసుని నిలవరింపచేసింది. ఆ రాక్షసుడు చరకవంశమున జన్మించిన సోమశర్మ. వీరు సద్బ్రాహ్మణునిగా యజ్ఞ యాగాదులు నిర్వహిస్తూ ఉండేవారు. వీటి నిర్వహణ విషయంలో మంత్ర క్రియా లోపం జరిగితే రాక్షస జన్మయే. ఆ విధంగా సోమశర్మ బ్రహ్మ రాక్షసునిగా మారి ఒక అడవిలో బ్రతుకుతున్నాడు. సోమశర్మ పూర్వజన్మ సుకృతం వల్ల కౌశికుని దర్శనం లభించింది.

(ఇంకా వుంది)

# గడి - నుడి

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| ■ | 1 | 2 | | 3 | | ■ |
| 4 | ■ | | ■ | | ■ | 5 |
| 6 | 7 | ■ | 8 | ■ | 9 | |
| 10 | | | ■ | 11 | | |
| 12 | | ■ | 13 | ■ | 14 | |
| | ■ | 15 | ■ | 16 | ■ | |
| ■ | 17 | | | | | ■ |

## సూచనలు: నిలువు:

2. నీటి యొక్క భౌతిక స్థితి (2)

3. మామ భూమి చుట్టూ తిరుగుతున్నా-డు(2)

4 . ఆకుపచ్చని ఆకులలో వుండే వర్ణదం(7)

5.తాంబూలంలో వేసుకొనే ముక్కలు areca palm నుండి పొందుతాము (7)

7. మనదేశం1858 నుంచి 1947వరకు ఆం-గ్లేయుల ---- యంత్రాగపు దాశ్యాన్ని అనుభ-వించి తిరగబడి స్వాతంత్ర్యాన్ని పొందింది(3)

9 సంపద లో సగ ము (3)

15.రెండు కత్తులు ఇమడవిందులో(2)

16 ఉపాయము(3)

## సూచనలు: అడ్డము:

1.అణు రియాక్టర్ లో ఈ శక్తి విద్య్త శక్తిగా మారుతుంది(5)

6. నాటకంలో నటుడు పోషించే భూమిక ఇక్కడ తిరగబ-డింది(2)

8. ఈ బండిని అక్షరమాలలో రమ్మంటారు (1)

9.నీ కంటే పెద్ద దైన నీ సోదరి (2)

10. పొలందున్నుతుంది(3)

11. పనికిరానిది(3)

12. నారీ నారీ నడుమ మురారీ లో ఎవరిని పూజించాలి. వెనక్కి తిరిగి చూడండి (2)

13. లక్షలోవున్నదే లక్కలోను వుంది(1)

14. ముక్కాలిపీట లో వున్న మాట(2)

17. ఇకనుండి ఆదిత్యుడిచ్చే ఈశక్తినే మనం ఎక్కువగా-వాడుకోవాలి (7)

# ఎలగందుల మట్టిలోని మాణిక్యం-'ఎలనాగ'



తుమ్మూరి రాం మోహనరావు

'ఆలాతో గుండె చప్పుళ్లు వింటాడు
కలంతో గుండె లయలు విర చిస్తాడు'

వైద్యుడుగా డాక్టరు నాగరాజు సురేంద్ర కవిగా 'ఎలనాగ'. వృత్తి వైద్యం. ప్రవృత్తి కమనీయసాహిత్యం.

దాదాపు నాలుగు దశాబ్దాలనుండి కవితా వ్యాసంగాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ వస్తున్న ఎలనాగ తెలుగు సాహిత్య సీమలో లబ్ధ ప్రతిష్ఠుడు. పద్యం,గేయం,వ్యాసం,వచనకవిత్వం, లఘుకవిత్వం,అనువాద ప్రక్రియలలో నిష్ణాతుడు. భాషమీద మంచి పట్టు కలిగిన కవి.రసౌచిత్యం ఎరిగిన సాహితీ పిపాసువు.ఇటు-సాహిత్యం తో పాటు సంగీతంలో కూడా మంచి అభినివేశం ఉండటంతో ఈయనకవిత్వంలో లయ విన్యాసం కమనీయంగా గోచరిస్తుంది.

వివిధ ప్రక్రియలలో పాతిక పైగా పుస్తకాలు వెలువరించిన ఎలనాగలో మరో ప్రత్యేకత గళ్లనుడికట్టు నిర్మాణం.నాకు తెలిసి సుదీర్ఘ కాలంగా తెలుగులో అనేకపజిల్లు తయారు చేస్తూ వస్తున్న ఏకైక వ్యక్తి 'ఎలనాగ' అని చెప్పవచ్చు. ప్రముఖ తెలుగు-మాస పత్రిక 'రచన'లో ఈయన పజిలింగ్ పజిల్ ను నిర్వహించారు. అనేక మందిపాఠకులను తెలుగు పజిల్ వ్యసనపరులుగా మార్చిన వారు అని కూడా అనవచ్చు. అప్పట్లో ఈయన పజిల్ ను అనేక మంది లబ్ధ ప్రతిష్ఠులైన సాహితీ వేత్తలుకూడా పూరించడానికి ఉత్సాహ పడేవారంటే వీరి పజిల్ ఎంత ఉత్కృష్ట స్థాయిలోఉండేదో ఊహించవచ్చు. దానిని ఇప్పటి సామాజిక మాధ్యమాలలో ఇంకా కొనసాగిస్తూఉండటం వీరికి దానిపైగల ఆసక్తి ,నైపుణ్యం తెలియజేస్తుంది.

బహుముఖ ప్రజ్ఞావంతులను పరిచయం చేయడం కష్టతరమైన పని. ప్రముఖ సాహితీవిమర్శకులు రజా హుసేన్ గారన్నట్టు ఎలనాగ గారి గురించి ఎంత చెప్పినా తక్కువే.

ఆయన చేపట్టిన ప్రతి ప్రక్రియలోనూ ఒక విలక్షణత ఉంటుంది. నిర్దిష్టంగా,నిర్దుష్టంగారాయటంలో నేర్పరి.పద్యాన్ని ఎంత పటిష్టంగా రాయగలరో వచన కవిత్వా-



న్ని అంతవిశిష్టంగా రాయగలరు. ఎవరూ చేయని ఒక ప్రయోగాన్ని చేసి రెండు పుస్తకాలు వేసినఘనత ఎలనాగకుంది.వృత్త పద్యాన్ని వచన కవిత్వ వాక్యాలుగా కత్తిరించి 'మోర్సింగ్ మీద మాల్కౌస్ రాగం', 'కొత్తబాణీ' అనే పేర్లతో వెలువరించారు. ఆపుస్తకాల పేర్లే చెబుతున్నాయి యాయన ప్రయోగశీలత్వాన్ని.మోర్సింగ్ అనేది నాలుకతో మ్రోగించే ఒక వాద్య పరికరం. ప్రకంపనలతో కూడుకున్న లయాత్మకనాదం వెలువరిస్తుందది.

దానిమీద మాల్కౌస్ రాగం పలుకించడమంటేనే అదో ప్రయోగం.

పద్యం నడక వేరు, వచనకవిత్వ ధోరణి వేరు. ఆ పంక్తులను విడిగా చదివితేవచనకవిత్వంలాగానూ, సమన్వయ పరచి నాలుగు పంక్తులుగా చదివితే వృత్తపద్యమోసీసమో ఏదైనా పద్య రూపంలో ఉంటుంది. ఉత్పలమాల, చంపకమాల ,శార్దూలమత్తేభాలు ఇలా చాలా కాల పద్యాలపై ప్రయోగం చేశారు. గణ యతి ప్రాసలు చక్కగాపాటించ పడతాయి. ఉదాహరణకు ఈ వచనకవిత లాంటి పద్యం 'నగరయానం' అనేశీర్షికతో రాసిన పద్యాలలోనిది చూడండి.

**వానొస్తే**
**ఇక వేనవేల వెతలే**
**వారాశి వచ్చేసి**
**ఆ డ్రైనేజీలను కమ్ముతూ**
**వరద తోడై వాగులే పారి**
**ఆ సీనే ఓ నరకం**
**ఇవాళ చిరువృష్టే**
**మాకు ప్రాణాంతకం**
**నానా యాతనలున్న**
**ఈ నగరయానం**
**పెద్ద శాపం కదా!**

**అదే పద్య రూపంలో ఇలా**
**శార్దూలం:**
**"వానొస్తే ఇక వేనవేల వెతలే వారాశి వచ్చేసి ఆ డ్రైనేజీలను కమ్ముతూ వరద తోడై వాగులే పారి ఆ సీనే ఓ నరకం ఇవాళ చిరువృష్టే మాకు ప్రాణాంతకం నానా యాతనలున్న ఈ నగరయా నం పెద్ద శాపం కదా!"**

విడివిడిగా చదివితే వచన కవిత కలిపి చదివితే వృత్తపద్యం శార్దూల విక్రీడితం అవుతుంది.

ప్రయోగ పద్యాలే గాకుండా అచ్చమైన ఛందోబద్ధ పద్యాల సంపుటి అంతస్తాపము. ఇందులో సమకాలీన సమాజంలోని అనేక దుస్థితులను వ్యథా రూపంలో ప్రౌఢపదబంధాల తో పద్యాలుగా వెల్లడించారు. వీరి సమాస బంధురత, శబ్ద సంచయము, పద్య ధార వీరి పాండిత్య గరిమను ప్రకటిస్తాయి. ఉలితో చెక్కిన శిల్పంలాగా పద్యాన్నిమలచటం వీరికి వెన్నతో పెట్టిన విద్య.

ఇటీవల ప్రేమ పేరుతో అమ్మాయిలను వేధించి, వారు తిరస్కరిస్తే అమానుషంగా వారిపై యాసిడ్ దాడులు చేయటంసహించలేక



అంతస్తాపంతో రాసిన పద్యం ఇది:

కశార్పటము అనే శీర్షికతో ఉన్న పద్యాలలోనిది ఈ చంపకమాల పద్యం-

**మనసును గెల్వలేక మృ-**
**దుమానవతిన్ మనువాడు కాంక్షతో**
**దినములు రాత్రులన్ యనక**
**తీక్ష్ణ విమోహ విషాగ్ని కీలలం**
**దనగుచు బేలయైన ప్రమదన్**
**పొగిలింతువు నీ దురాత్మతన్**
**వనితను క్రుంగదీయు వలప-**
**న్నదదెంత వివేక హీనమో**

భావానికి భావం,భాషకు భాష, అందమైన ఛందోబద్ధమైన పద్యం
ఆధునిక సందర్భానికి అన్వయిస్తూ రాయడం మాటలు కాదు.

ఇక వచన కవిత్వానికి వస్తే, వాగంకురాలు, సజల నయనాలకోసం, అంతర్లయ, అంతరగాంధారం, అంతర్నాదం అని ఇంతవరకు ఐదు పుస్తకాలు వెలువరించారు. పుస్తకాలపేర్లలోనే అన్యాపదేశంగా తన కవిత్వంలో లయ, నాదం ఉంటుందనే విషయం తెలియచేయటం జరిగింది. సామాజిక స్పృహ తో పాటు, చిక్కదనం, భావశబలత గమనించగల్గుతాం. ఈ వచన కవిత్వాల్లో కొందరు ప్రముఖులకు ముఖ్యంగా సంగీత రంగానికి చెందినవారికి నివాళులు తెలి యజేసే కవితలున్నాయి. ఈ కవితల్లో కవిసంగీతజ్ఞత తెలియవస్తుంది. గతంలో సంగీతజ్ఞుల గురించి డా.సామల సదాశివగారువ్యాసాలు రాస్తే వీరు కవితలు రాసారు.

వీరి వచన కవిత్వం ఎలా ఉంటుందో మచ్చుకు ఒక కవిత చూడండి.

సజల నయనాలు వచనకవితా సంపుటి లోని 'రసోచితం'అనే శీర్షికతో రాసినది.

**తీరికగా చెక్కి**
**తీర్చి దిద్దు శిల్పా న్ని**
**పొందికగా నిల్పి**
**అందిస్తుంది మనోల్లాసాన్ని**
**కుంచెతో రంగుల్ని అద్ది**
**కుదురుగా రచించు సజీవచి-**
**త్రాన్ని**
**అందాన్ని ఒలకబోస్తూ**
**అచంచలంగా నిలుస్తుంది**
**అది**
**గుండె తీగను బిగించి**
**గుట్టుగా రగిలించు రాగాన్ని**
**మధుర నిస్వన నివహాన్ని**
**పదిలంగా నినదిస్తుంది అది**
**పదాలలో నదీనదాలను**
**దూర్చి**
**పరిచెయ్ కాయితమ్మీద**
**అరచేతిలోఅనుభూతి స్వరాన్ని**
**ప్రవహింప జేస్తాయి పరవశ-**
**కరంగా**

ఈ ఒక్క కవిత మీద నాలుగు పేజీల వ్యాసం రాయవచ్చు. ఈయన కవితాసంపుటులలో మేలిమి కవితలిలాంటివింకెన్నో ఉన్నా నేను దీన్ని తీసుకోవడంలో ముఖ్యోద్దేశం ఇది ఆయన కవితా మార్గాన్ని,కవితా పాటవాన్ని రెంటినీ చూపిస్తుందని.

వాక్యం రసాత్మకం కావ్యం కావాలంటే ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో, కళ ఎప్పుడురసోచితమౌతుందో తెలిపే ఇది చాలు ఈయన మెతుకు ఎంత బాగా ఉడికిందో అనిగ్రహించడానికి.

ఇక అనువాదరంగంలో ఎలనాగకు పెట్టింది పేరు. ఆంగ్లం నుండి తెలుగు,తెలుగునుండి ఆంగ్లంలోకి కథలు కవితలు అనువదించి పుస్తకాలు వెలువరించారు.సోమర్సెట్మామ్ నవలిక The Alien corn ను కలుపు మొక్క అనే పేరుతో అనువదించారు.

Contemporary Latin American Short stories నుండి కొన్ని ఉత్తమ కథలను ఉత్తమలాటిన్ అమెరికన్ కథలు అనే అనువాద పుస్తకం వెలువరించారు. అలాగే వివిధ దేశాలకథానువాదాలను కథా తోరణంగా తెచ్చారు. ఉత్తమ ఆఫ్రికన్ కథలు,సోమర్సెట్ మామ్కథలు పుస్తకాలుగా వచ్చాయి.

అలాగే 'పొరుగు వెన్నెల ,'ఊహల వాహిని' వీరి వివిధ భారతీయ భాషల మూలకవితలకు తెలుగు అనువాద కవితల సంపుటాలు.

వీరి కవిత్వానువాదం పొంకంగా మాతృకలోని భావ సౌకుమార్యాలను ప్రస్ఫుటంగా తెలియబరచేదిగా ఉంటుంది. వీరి అనేకా-

నేక సమకా లీన తెలుగు కవితల కవిత్వానువాదాలు పలు సంకలనాల్లో చోటు చేసుకున్నాయి. కేంద్ర సాహిత్య అకాడమీ వారికోసంపవన్ కె.వర్మ Ghalib:The Man,The Time ను తెలుగులో గాలిబ్ -నాటికాలం గాఅనువాదం చేయడం జరిగింది.

వీరు అనువాద విషయంలో సవ్యసాచి అనవచ్చు. ఆంగ్లం నుండి తెలుగులోనికి చేసినట్లే- తెలుగునుండి ఇటు కవిత్వాన్ని అటు కథల్నీ కూడా ఆంగ్లీకరించారు.

Faded leaves and fireflies అనేది డా.అమ్మంగి వేణుగోపాల్ గారి కొన్ని తెలుగు కవితలకు ఆంగ్లాను వాదం. Impressions -Images అనే పుస్తకం 64 మందితెలుగు కవితలకు ఆంగ్లానువాదం. ముందే చెప్పినట్లుగా వీరికి సంగీతం మీద అపారమైన పట్టు కలిగి ఉండటం వల్ల శాస్త్రీయ సంగీతమ్మీద, కళాకారులమీద రాసినకవితలు, వాక్చిత్రా లను ఆంగ్లంలో Memorable Melody Makers and Other Poems on Music గా వెలువరించారు.

అలాగే వట్టికోట ఆళ్వారు స్వామి కథలసంపుటి 'జైలులోపల' ను Inside the Prison గాఅనువదించి ప్రచురించారు. ఇటీవల తెలంగాణ కు చెందిన ప్రముఖ రచయితలు కాళోజీ, దాశరథి కథలను ఆంగ్లంలోకి Stories of Kaloji Narayan Rao ను కాళోజీ ఫౌండేషన్ వారు ప్రచురించగా, Fire Flowers And Other Stories of Dasharathi Krishnamacharya ను తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురించింది.

ఇక ఇతర ప్రక్రియల పుస్తకాలకు వస్తే 'యుక్త వాక్యం'భాషను ఉపయోగించేప్పుడు మనం చేసే తప్పుల గురించిన పుస్తకంగా 'నుడిక్రీడ 'పదబంధాల సంచయం మరియు అనేక పజిల్సు పూరణలకుసంబంధించిన పుస్తకం. వీరి 'పెన్మంటలు -కోకిలమ్మ పదాలు 'డా.సి.నారాయణ రెడ్డిగారి లాంటి వారి ప్రశంసలను చూరగొన్నాయి.

అవి సరదాగా మరియు సెటైరికల్ గా ఉంటాయి. ఒకటి చూడండి

**'ఆలికొచ్చెను జోషు**
**అపుడు ఖర్చయె క్యాషు**
**మొగుడాయె బేహోషు**
**ఓ కోకిలమ్మా!'**

ఆరుద్ర కూనలమ్మ పదాల్లాంటి వే ఎలనాగ కోకిలమ్మపదాలు.

ఒకే పుస్తకంలో ఈ రెండు లఘు కవితల ను వేశారు . అందులోని పెన్మంటలు క్లుప్తకవితల సమాహారం. అందులోని ఒక లఘు కవిత


**'డైలాగులు చూడ అతడు**
**ధర్మరాజు అచ్చం**
**బైట చూడ వచ్చి లోభి**
**వేయడసలు బిచ్చం'**

ఈయన పుస్తకాల పరిచయమే ఇంత సుదీర్ఘంగా ఉంది. ఇక విశ్లేషణ చెయ్యాలంటే వ్యాసవిస్తర భీతి హెచ్చరిస్తుంది.ఇంకా చెప్పాలంటే నా శక్తి కూడా చాలదు. పైన చెప్పినట్లు ఈయన గురించి ఎంత చెప్పినా తక్కువే.పాతికకు పైగా రాసిన పుస్తకాలేకాకుండా పలుపత్రికల్లో రాసిన వ్యాసాలు, కవితలు గేయాలు అనేకం.

ఇక జీవిత విశేషాలకు వస్తే ఈయన పుట్టింది కరీంనగర్ జిల్లా లోని చారిత్రక గ్రామమైన ఎలగందుల. వ్యాసకర్తది అంటే నాది కూడా అదే ఊరు కావడమే గాక ఎలనాగ నాబాల్య సహపాఠి, మిత్రుడు. అయితే హైస్కూలు చదువు కాగానే ఆయనదో దారి నాదోదారి కావటం వల్ల ఇద్దరం పదవీ విరమణ తరువాతనే మళ్లీ సన్నిహితులమయ్యాం. హైదరాబాదులో యం.బి.బి.ఎస్. చదివిన తరువాత 1980 నుండి1986 వరకు నైజీరియాలో ప్రభుత్వోద్యోగి గా పనిచేశారు. తరువాత తిరిగి వచ్చి 1989 నుండి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో చేరి పలుజిల్లాలలో పలు హోదాలలో వైద్య సేవలందించి, చివరి మజిలీలో ఆంధ్రప్రదే శ్ వైద్య విధాన పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ గా పదవీ విరమణపొందారు. ప్రస్తుతం పూర్తిగా సాహిత్యైకజీవిగా హైదరాబాదులో నివసిస్తున్నారు. వీరిజననీ జనకులు నాగరాజు రంగమ్మ, తిరుమలయ్య గార లు. వీరి అగ్రజులు ప్రసిద్ధ కవి

నాగరాజు రామస్వామి గారు. తమ్ముడు నాగరాజు రవీందర్ కూడా డాక్టర్ మరియు అన్నయ్యల లాగానే కవి. పద్యాలు రాస్తారు. వీరి తండ్రి తిరుమలయ్య గారు అప్పట్లో మంచి హస్తవాసిగలిగిన ఆయుర్వేద వైద్యులు. తల్లి శతాధిక వసంతాలు జీవించి ఇటీవలే గతించారు.

ముగించే ముందు ఒక విషయం చెప్పాలి. చాలా మంది ప్రచ్ఛన్న నామాలతో ప్రసిద్ధులుగాఉండటం మనకు తెలిసిందే. అలాగే డా.నాగరాజు సురేంద్ర తన కలం పేరు 'ఎలనాగ' అని పెట్టుకున్నారు. నాకు తెలిసి ఇంత అందమైన అర్థవంతమైన కలంపేరు అరుదనిపిస్తుంది. ఊరి పేరులోని మొదటి రెండక్షరాలు 'ఎల' ఇంటి పేరులోని మొదటి రెండక్షరాలు 'నాగ' కలిపి ఏర్పడిన అందమైన తెలుగు పదం 'ఎలనాగ' వీరి కలంపేరు తోనే సాహిత్య లోకంలో వీరు బాగా ప్రసిద్ధికెక్కారు. అంతర్ముఖుడు, సౌజన్య మూర్తి, మితభాషి, ఊసుపోకకు కాకుండా సంగీత సాహిత్యాలను తపనతో అత్యంత శ్రద్ధాసక్తులతో మమేకం చేసుకున్న ఎలనాగ ఉరఫ్ డాక్టర్ నాగరాజు సురేంద్ర గారు ఇంకా ఎన్నో మంచి మంచి పుస్తకాలు వెలువరించాల్సి ఉంది. ఇంతటి సాహితీ సంపన్నుని కృషికి తగిన గుర్తింపు కూడా రావాలని నా ఆకాంక్ష.




జనవరి నెల గడి- నుడి సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | పు | న | రా | వ | ర్త | న | ము | |
| ప | | డి | కా | | | త్త | | స్వ |
| లు | పా | | శ | శాం | కం | | ప్రా | యం |
| చ | ర | రా | శి | | ది | శ | | స |
| ని | | బం | | | | లా | | మ |
| మ | | ధు | ప్పి | | ర్ర | క | ళ్ల | రూ |
| జ్జి | గ | | పి | చ్చు | క | | కో | ప |
| గ | | ద్ధ | | | ల | బా | | క |
| | స | ము | ద్ర | పు | జీ | వా | లు | |


సలామ్ ఇండియన్ క్రికెట్ టీమ్


MEASURE BODY TEMPERATURE
భారత్ లో ప్రారంభమయిన
అత్యంత వేగవంతమైన
కోవిడ్ వేక్సిన్ కార్యక్రమం

RNI No. APTEL/2011/39497 FEBRUARY 2021 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication: 1st February Date of Posting: 8th February




ఘనంగా 72వ గణతంత్రదిన వేడుకలు

Published, Edited and Printed by T Shanti at Flat No. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad-500048. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001.